


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

**దేశంలోనే ప్రత్యేక ఎర్త్ సైన్స్ వర్సిటీ**

కొత్తగూడెం జిల్లాలో రేపు ప్రారంభించనున్న సిఎం : మంత్రి తుమ్మల

**'ఇస్కాఫ్' పాత్ర చాలా అవసరం**

03

సంపుటి 09, సంచిక: 05 | సోమవారం | 01-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# క్యూర్, ప్యూర్, రేర్

## రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి, మూడు పాలసీలను ప్రవేశపెడుతున్నాం

- ఆదాయం పెంచి పేదలకు పంచే విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థ తయారు చేస్తాం
- గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాం
- అద్భుతమైన పాలసీని జాతికి అంకితం చేస్తాం
- బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారుచేస్తాం
- రాష్ట్రంలో మరో నాలుగు విమానాశ్రయాలు తీసుకువస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- మంత్రులతో కలిసి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని 'క్యూర్, ప్యూర్, రేర్' మూడు విభాగాలుగా విభజించి, మూడు పాలసీలను ప్రవేశపెడుతున్నామని, తద్వారా ఆదాయాన్ని పెంచి, పేదలకు పంచడం, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ దిశగా ముందుకు సాగుతామని, దీనికి అనుగుణంగానే 'తెలంగాణ విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను, పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. తమ విజన్ డాక్యుమెంట్‌లో 'విజన్, స్ట్రాటజీ' రెండు ప్రధాన అంశాలని, ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి, పారదర్శక పాలసీలు ఉండాలని, ఆ పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుందని సిఎం వివరించారు. అందుకే పారదర్శకమైన పాలసీలను రూపొందించామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అంశంపైన సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి తరువాయి 2లో

### నేటి నుంచి ప్రజాపాలన ఉత్సవాలు : భట్టి

ప్రజాపాలన ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 1 నుంచి (సోమవారం) రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల చొప్పున మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సోమవారం మక్తల్‌లో ఉత్సవాలు ప్రారంభిస్తామని, ఆ తర్వాత డిసెంబర్ 2న కొత్తగూడెం, డిసెంబర్3న హుస్నాబాద్, డిసెంబర్ 4న ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్, డిసెంబర్ 5న నర్సంపేట, డిసెంబర్ 6న దేవరకొండలో నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 7న హైదరాబాద్‌లోని ఉస్మానియా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేస్తారని వివరించారు. డిసెంబర్ 8,9న ఫ్యూచర్‌సిటీలో 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహిస్తామని, ఈ సమ్మిట్‌ను 8వ తేదీన ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమంలో రెండు సంవత్సరాల ప్రజాపాలనలో చేపట్టిన క్రమాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తామని తరువాయి 2లో

# 'సర్', ఢిల్లీ పేలుడుపై చర్చ జరపాల్సిందే...

- దేశ భద్రత, విదేశాంగ విధానం, రైతుల సమస్యలపైన కూడా...
- అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు డిమాండ్
- నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సమావేశాలు 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొత్తం 15 పని దినాలు భేటీ కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో ప్రభుత్వం తరుపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆయన డిప్యూటీ అర్జున్ రామ్ మేఘ్వాల్ హాజరయ్యారు. ప్రతిపక్షాల తరపున జైరాం రమేష్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), టి.ఆర్. బాలు (డిఎంకె), డెరెక్ ఓబ్రియన్ (టిఎంసి), సిపిఐ నుంచి పి.సందోశ్‌కుమార్, సిపిఐ(ఎం) నుంచి జాన్ బ్రిట్టాస్, ఇ.టి. మొహమ్మద్ బషీర్ (ఐయుఎంఎల్) పాల్గొన్నారు. బిజెపి నుంచి కేంద్ర మంత్రి జెపి నడ్డా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్‌జెడికి చెందిన మనోజ్ ఝా, ఎస్ఎడికి చెందిన హర్‌సిమ్రత్ కౌర్, జెడి(యు)కు చెందిన సంజయ్ ఝా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

**ప్రభుత్వం పార్లమెంట్‌ను పట్టాలు తప్పించాలని చూస్తోంది : గగోయ్**

కాగా, సమావేశాలు వాడీవాడిగా జరగనున్నాయి. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పార్లమెంటులో చర్చించాలని మెజార్టీ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో దేశ భద్రత, విదేశాంగ విధానం, రైతుల సమస్యలు, ఢిల్లీలో వాయు కాలుష్యంపైనా చర్చించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ అంశాలపై చర్చించేందుకు సుముఖంగా లేదనే విషయం అఖిలపక్ష సమావేశంలో అర్థమైందని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్ కూడా డిమాండ్ చేసిం ది. అఖిలపక్ష సమావేశ అనంతరం గగోయ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, పార్లమెంటును పట్టాలు తప్పించాలని, పార్లమెంటరీ సంప్రదాయాలను సమాధి చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఢిల్లీ పేలుడు తర్వాత జాతీయ భద్రతతో సహా దేశంలో భద్రతపై చర్చ జరగాలని తమ పార్టీ డిమాండ్ చేసిందని గొగోయ్ చెప్పారు. ప్రభుత్వం జాతీయ భద్రతపై స్వల్పకాలిక చర్చను కోరుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. రెండవ అంశమని, ప్రజాస్వామ్య భద్రత అని, ఎన్నికలకు ముందు, ఆ తరువాత ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, తరువాయి 2లో



### ఆదివాసీలను నిర్మూలించే అన్యాయాన్ని తక్షణం నిలిపివేయాలి

ఢిల్లీలో భద్రతావైఫల్యంపై నిలదీసిన సిపిఐ ఎంపి సందోష్ కుమార్

ఢిల్లీలోని కీలక ప్రాంతంలో జరిగిన బాంబుపేలుడు ఘటన దేశ గూఢచారి విభాగం వైఫల్యాన్ని, బలహీనపడిన భద్రతా సన్నద్ధతను సూచిస్తోందని రాజ్యసభలో సిపిఐ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ విమర్శించారు. అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయపార్టీల సభాపక్షనాయకుల సమక్షంలో ఐదు ప్రధాన అంశాలను ఆయన ప్రస్తావించారు. ఢిల్లీలో భద్రతావైఫల్యంతోపాటు వివిధ రాష్ట్రాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై ప్రతిపక్షాల ప్రశ్నలకు ఎన్నికల సంఘం జవాబుదారీగా ఉండాలని, మావోయిస్టు తీవ్రవాదంపై తరువాయి 2లో

## పార్లమెంట్ ముందుకు భారీ సంస్కరణ ఎజెండా 05



### 'సర్' గడువు వారం పొడిగింపు

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాల ఆందోళనలకు కేంద్ర ఎన్నికల సంఘం తలొగ్గింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ వారం పొడిగించింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ డిసెంబర్ 4తో పూర్తికావాల్సి ఉండగా డిసెంబర్ 11 వరకు ఇసి పొడిగించింది. అందుకు అనుగుణంగా ముసాయిదా ఓటరు జాబితా, తుది ఓటరు జాబితా విడుదల తేదీలను సవరించింది. ముసాయిదా ఓటరు జాబితాను వచ్చే నెల 16న తుది ఓటరు జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేస్తామని ఇసి పేర్కొంది. తొలుత విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 9న ముసాయిదా ఓటరు జాబితా, 2026 ఫిబ్రవరి 7న తుది ఓటరు బాబితా విడుదల కావాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, గోవా, కేరళ, మధ్యప్రదేశ్, తరువాయి 2లో

### సూర్యాపేటలో సర్పంచ్‌లకు అత్యధిక నామినేషన్లు




- తొలిదశలో 159 పంచాయతీలకు 1387 నామినేషన్లు
- రాష్ట్ర వ్యాప్తంగా 4236 పంచాయతీలకు బరిలో 25,654 మంది అభ్యర్థులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్‌ల పర్వం ముగిసింది. శనివారం అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న తరువాయి 12లో

### ఆయుధాలు వీడిన 37 మంది నక్సల్స్

- దంతెవాడ జిల్లాలో పోలీసులు, భద్రతా బలగాల ఎదుట లొంగుబాటు
- 27 మందిపై సమష్టిగా రూ. 65 లక్షల రివార్డు

దంతెవాడ/భద్రాచలం



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. తాజాగా ఆదివారం దంతేవాడ జిల్లాలో 37మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో 27 మందిపై సమష్టిగా రూ.65 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 'పూనా మార్గెమ్' (పునరావాసం నుండి సామాజిక తరువాయి 12లో

### మహిళల కోసం ప్రత్యేక ఎంఎస్ఎంఇ పార్కులు

- ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- 'ఉమెన్ ఎంపవర్ మెంట్' ఇంటి నుంచే మొదలవ్వాలి
- 'వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'లో మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఇ పార్కును అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యసాధనలో మహిళలను కీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. 'వి హబ్' ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన 'వి నేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తరువాయి 2లో

### ఆ హక్కు ట్రంపునకు లేదు



- తమ దేశ గగనతల మూసివేతపై వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మండిపాటు
- ఆమెరికా అధ్యక్షుడి సామ్రాజ్యవాద వైఖరికి ఖండన
- కరీబియన్ దీవుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత



**కారకాస్:** దక్షిణ అమెరికాలో కమ్యూనిస్టు పాలిత దేశాలను కుప్పకూల్చేందుకు కంకణం కట్టుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద వైఖరిని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్రంగా ఖండించారు. వెనిజులా గగన తలంపై ట్రంప్ నిషేధం విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మరో దేశం గగనతలాన్ని మూసివేసే హక్కు ట్రంప్‌కు లేదని హెచ్చరించారు. ట్రంప్ ప్రపంచానికి మళ్ళీ సామ్రాజ్యవాద వలస విధాన ముప్పు తెస్తున్నారన్నారు. ''వెనిజులా పరిధిలో ఉన్న వైమానిక ప్రాంతాన్ని మూసివేసినట్లుగా పరిగణించండి, అన్నిరకాల పైలట్లకూ, మానవ రవాణా చర్యలకు, మాదక ద్రవ్యాల వ్యాపారులకు, విమాన సంస్థలకు ఈ మూసివేత వర్తిస్తుంది'' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో రాశారు. దీనిపై వ్యాఖ్యానించేందుకు వైట్‌హౌస్ ఇష్టపడ లేదు. కానీ కొంతమంది రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విధమైన చర్యలకు దిగేముందు ట్రంప్ చట్టసభ అనుమతి తీసుకోలేదన్నారు. ''వెనిజులాపట్ల ట్రంప్ అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరి కారణంగా సమీపంలో ఉన్న మరో దేశంపై మరో ఖరీదైన యుద్ధానికి అమెరికా సిద్ధపడుతోంది'' అని డెమోక్రాట్ సభ్యుడు చక్ షుమర్ తరువాయి 12లో

**2080కల్లా భారత్‌లో జనాభా స్థిరీకరణ**

'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్' వెల్లడి

05

**కొనసాగుతున్న 'దిత్వా' బీభత్సం**

ముగ్గురు మృతి, 57వేల హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ భూములు





### రెండు ఆర్‌టిసి బస్సులు ఢీ..

11 మంది మృతి, 25 మందికి గాయాలు

**చెన్నై:** ఎదురెదురుగా వస్తున్న రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులు మరణించారు. మరో 25మంది గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య పెరుగవచ్చని తెలుస్తున్నది. తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కరైకుడి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు, మదురై వైపు వెళ్తున్న మరో ప్రభుత్వ బస్సు తిరుపత్తూరు సమీపంలోని రహదారిపై ఎ దురెదురుగా ఢీకొన్నాయి. కాగా, ఈ ప్రమాదంలో రెండు తరువాయి 2లో



### సేవలు ఏకరువు

- ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నం
- గత తప్పిదాలను ఎత్తి చూపుతున్న ఓటర్లు
- పలకరింపులు, హామీలు,బుజ్జగింపులతో సాగుతున్న పల్లె ప్రచారం

ప్రజాపక్షం/ ఖమ్మం

ఎన్నికల సందడి మొదలైంది. బరిలో నిలిచిన, నిలవాలనుకున్న అభ్యర్థులు ఓటర్లను కలిసి తమకు సానుకూలంగా తిప్పుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల వేళ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ బరిలో ఉన్నవారు సేవలను ఏకరువు పెడుతుండగా ఓటర్లు గత తప్పిదాలపై నిలదీస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి దశకు నామినేషన్ ప్రక్రియ పూర్తి కాగా మలి దశకు ఆదివారం నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలైంది. వార్డు సభ్యులు, సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లను కలుస్తూ ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అమావాస్య నాడు అట్లు ఇచ్చాను, పౌర్ణమి నాడు పునుగులు ఇచ్చాను అన్న చందంగా గతంలో చేసిన సేవలను గుర్తుకు తెస్తున్నారు. ఎప్పటి విషయాలనో గుర్తుకు తెచ్చుకుని మరి ఓటర్ల ముందు వల్లేవేస్తున్నారు. ఏఏ సందర్భాల్లో ఏవిధంగా సహాయ పడ్డది సోదాహరణంగా వివరిస్తున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలపైన భరోసా ఇస్తున్నారు. తమకు సానుకూలంగా ఉండే కుటుంబాలకు చేసే మేలు గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. చిన్న చిన్న గ్రామ పంచాయతీల్లో సైతం పెద్ద పెద్ద హామీలు ఇచ్చే పనిలో అభ్యర్థులు ఉన్నారు. ఇదే సమయమని ఓటర్లు కూడా అభ్యర్థులను నిలదీసే పనిలో ఉన్నారు. ఓటు అడగడానికి ఇంటి తరువాయి 12లో




### గాడి తప్పిన పాలన

- రిటైర్డ్ ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా హెల్త్ వర్సిటీ
- తీవ్ర ఆరోపణలు ఉన్న వ్యక్తికి రిజిస్ట్రార్ బాధ్యతలు
- సిఎం ఆగ్రహంతో కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ రాజీనామా

ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పాలన గాడి తప్పింది. హెల్త్ వర్సిటీలో అక్రమాలు జరిగాయని తేలడంతో స్వయంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు రావడంతో వర్సిటీ వైస్ చాన్సలర్ నందకుమార్ రెడ్డి రాజీనామా చేశారు. ఈ క్రమంలో హెల్త్ వర్సిటీలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. యూనివర్సిటీలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలలో నిర్లక్ష్యంతో సమస్యలు తలెత్తుతు న్నాయి. వైద్య విద్య పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాలు, సీట్ల కేటా యింపు వరకు నిర్లక్ష్యం, అక్రమాలతో వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటదన్న విమర్శలు విన వస్తున్నాయి. ఎంబిబిఎస్ చేసిన సీనియర్ వైద్యులు ఉండాల్సిన పరీక్షల నియంత్రణాధికారి (ఎగ్జామినేషన్ కంట్రోలర్)లో కొన్నేళ్లుగా దంత వైద్యుడిని డిప్యూటేషన్ పై నియమించటం, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడికి రిజిస్ట్రార్ పదవిని అప్పగించడం ఏమిటనే విమర్శలు వినవస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక కాళోజీ వర్సిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య విద్యను ఈ వర్సిటీ పరిధి లోకి తీసుకువచ్చింది. మొత్తం 105 పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నా.. 35 మంది వరకే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. రిజిస్ట్రార్, డిప్యూటీ, జాయింట్ రిజిస్ట్రార్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## అవినీతి కేసులో దేశాధ్యక్షుడికి నెతన్యాహూ క్షమాపణ లేఖ

**టెల్‌అవీవ్ :** అవినీతి, మోసం కేసుల్లో నిందితుడుగా ఉన్న ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ క్షమాపణ కోరుతూ దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు ఒక లేఖ సమర్పించారు. దీర్ఘకాలంగా నెతన్యాహూపై అవినీతి కేసులు నలుగుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన సందర్భంగా నెతన్యాహూ ఉంటకుముందు కూడా నెతన్యాహూకు క్షమాభిక్ష ప్రసాదించాలని అధ్యక్షుడు హెర్జోగ్‌ను కోరారు. ఈ నేపథ్యంలో నెతన్యాహూ దేశాధ్యక్షుడికి ఒక పేజీలో క్షమాపణ లేఖ సమర్పించారు. ఐతే తాను ఏ తప్పు చేయలేదని మరోసారి ఆ లేఖలో ఆయన వాదించారు. ఆయన నేరాన్ని అంగీకరించలేదు. కానీ క్షమాపణలు చెప్పడం తన నైతిక బాధ్యత అన్నారు.
ఐతే హెర్జోగ్ తొలుత ట్రంప్ విజ్ఞప్తికి స్పందిస్తూ, మొదట నెతన్యాహూ పద్ధతి ప్రకారం తనకు ఒక క్షమాపణ లేఖ ఇవ్వాలని కోరారు. ఈ లేఖపై స్పందిస్తూ, ఈ లేఖను ఆమోదించే విషయంలో చట్టపరమైన విషయాలను తాను క్షుణ్ణంగా పరిశీలిస్తానని హెర్జోగ్ చెప్పారు.

## బ్రిటన్‌లో హర్యానా విద్యార్థి హత్య

**చండీఘడ్ :** వెస్ట్ ఇంగ్లాండ్ యూనివర్సిటీలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థి ఒకరు బ్రిటన్‌లో హత్యకు గురయ్యారు. నవంబరు 25వ తేదీన జరిగిన ఈ హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో 22 నుండి 32 ఏళ్ళ మధ్య వయసుగల ఐదుగురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేశారు. తర్వాత వారిని బెయిలుపై విడుదల చేసినట్లు వెస్ట్ మెర్సియా పోలీసులు చెప్పారు. దర్యాప్తు కొనసాగుతోంది. ఆరో నిందితుణ్ణి కూడా అరెస్టు చేసినప్పటికీ ఎలాంటి సాక్ష్యాలు, సమాచారం తెలియలేదని పోలీసులు చెప్పారు. హరియానా రాష్ట్రానికి చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) వోర్సెస్టర్‌లోని బార్బోర్న్ రోడ్‌లో కత్తిపోట్లతో తీవ్ర గాయాలతో కనిపించారు. ఆతడిని ఆసుపత్రికి తీసుకెళ్ళగా ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. బ్రిటన్‌లో చదువుకోవాలనే కోరికతో, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ విభాగంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా రాజీనామాచేసి ఈ ఏడాది ఆరంభంలోనే బ్రిటన్‌కు వెళ్ళి బ్రిస్టల్‌లోని యుడబ్ల్యుఇ విశ్వవిద్యాలయంలో షియోరాన్ విద్యార్థిగా చేరాడు. హత్యవార్త తెలియగానే ఛర్ఖిదాద్రిజిల్లా జగ్గాన్‌వాస్ గ్రామానికి చెందిన షియోరాన్ కుటుంబం ఎటూ పాలుపోక స్థానిక ప్రజా ప్రతినిధులను ఆశ్రయించారు.
ఛర్ఖీదాద్రి ప్రాంత శాసనసభ్యుడు, బిజెపి నాయకుడు సత్పాల్ సంగ్వాన్ ఎక్స్ వేదికగా ఈ మేరకు హత్య ఘటన వివరాలు తెలియజేశారు. విద్యార్థి హత్యపట్ల తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తగినవిధంగా సహకరించాలని కోరారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ ఘటనకు ఎవరు బాధ్యులో తెలుసుకోవాలని, సత్వరం విచారణ జరపాలని, మృతదేహాన్ని దేశానికి తీసుకువచ్చేందుకు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కేసుపై పూర్తి దర్యాప్తు జరపాలని, తమ బిడ్డను తిరిగి రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణ సహాయ సహకారాలు అందించాలని మృతుని కుటుంబ సభ్యులు విదేశాంగ మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేశారు.

# అంధకారంలో శ్రీలంక

### 193కి పెరిగిన మృతుల సంఖ్య

**కొలంబో :** దిత్వా తుఫాను, వరదలు, కొండచరియల విధ్వంసంతో అతలాకుతలమైన శ్రీలంక ద్వీపంలో మూడు వంతుల ప్రాంతం అంధకారంలో మగ్గుతోంది. అనేక సంవత్సరాలుగా వరద నివారణ, నియంత్రణ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో దిత్వా భారీ తుఫాను తాకిడితో శ్రీలంక అతలాకుతలమైంది. వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో మరణించినవారి సంఖ్య 193కి పెరిగిందని శ్రీలంక ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. అనేక ప్రాంతాలలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.
పరిస్థితులు చక్కబడేవరకూ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. భారతదేశం సహాయాన్ని పంపడమే కాకుండా సహాయ బృందాలను కూడా పంపింది. 2,66,114 కుటుంబాలకు చెందిన 9,68,304 మంది పైగా ప్రజలు ఈ ప్రకృతివైపరీత్యాల బారినపడ్డారని అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులపట్ల భారతదేశం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. శ్రీలంకకు 21 టన్నుల సహాయ సామాగ్రిని పంపింది.

**సుమత్రాదీవిలో ఆహారం లూటీ**
**442కు పెరిగిన మృతులు**

తుఫాను, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో చెల్లాచెదురైన ఇండోనేసియా సుమత్రా దీవిలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఆహారాన్ని లూటీ చేశారు. బ్రతకడం కోసం వారికి తగినంత ఆహారం, నీరు లభ్యం కాకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారం రోజులక్రితం సుమత్రా దీవులను వరదలు ముంచెత్తాయి. ప్రధాన రహదార్లు అన్నీ ధ్వంసమయ్యాయి. ఈ వరదల్లో మరణించినవారి సంఖ్య ఆదివారంనాటికి 442కు పెరిగింది. ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని భావిస్తున్నారు. మృతదేహాలను సహాయబృందాలు ఇంకా వెలికితీస్తున్నాయి. సవాలు విసురుతున్న ప్రకృతి వైపరీత్యాన్ని తట్టుకునేందుకు తగినన్ని ఉపకరణాలు ఇండోనేసియా ప్రభుత్వం వద్ద కొరవడ్డాయి. ప్రజలు ఆహారాన్ని లూటీ చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియా అంతటా వ్యాపించాయి. ఇండోనేసియాలో 280 మిలియన్లకు పైగా ప్రజలు ఉన్నారు. తరచు ఇక్కడ వరదలు తుఫానులు సంభవిస్తూ ఉంటాయి. ఇదిలా ఉండగా థాయ్‌లాండ్‌లో వరదలవల్ల మరణించినవారి సంఖ్య 170కి పెరిగింది.







## ఫిలిప్పీన్స్‌లో వరద అవినీతిపై వేలాదిమంది ప్రజా నిరసన

**మనీలా :** ఫిలిప్పీన్స్‌లో భారీ వరద ప్రమాదాన్ని నివారించేందుకు ఉద్దేశించిన నీటి ప్రాజెక్టులలో అవినీతిని వ్యతిరేకిస్తూ రాజధాని మనీలాలో ఆదివారం వేలాదిమంది ప్రజలు మరోసారి వీధుల్లోకి వచ్చి గళం విప్పారు. ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ వరద నియంత్రణ ప్రాజెక్టులను నిర్మించడంలో ఎందుకు జాప్యం జరుగుతోంది? అవినీతికి పాల్పడుతున్న ఇంజనీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు? అని ప్రజలు నిలదీశారు. దేశాధ్యక్షుడు మార్కోస్ జూనియర్ కూడా రాజీనామా చేయాలని, రాజకీయ నాయకులు ఈ వరద ప్రాజెక్టుల నిర్మాణ నిధులను కైంకర్యం చేశారని, అవినీతికి పాల్పడ్డారని ప్రదర్శకులు విమర్శించారు. దేశాధ్యక్షుడి భవనానికి సమీపంలో ఉన్న లునేటా పార్కులో వేలాదిమంది ప్రజలు గుమిగూడారు. ప్రస్తుత అధ్యక్షుడు ఫెర్డినాండో మార్కోస్ తండ్రి మార్కోస్ ప్రభుత్వాన్ని 1986లో ప్రజా ఉద్యమం వల్ల కుప్పకూలిన విషయాన్ని కూడా ప్రజలు గుర్తుచేశారు. ఫిలిప్పీన్స్‌లో ప్రతి సంవత్సరం చాలా ఎక్కువగా తుఫానులు వస్తాయి. ఈ తుఫానుల కారణంగా వందలమంది మరణిస్తున్నారు. ఇటీవలి వరుస తుఫానులు దేశాన్ని అతలాకుతలం చేయడంతో ప్రజలు విసిగిపోయి వీధుల్లోకి వస్తున్నారు.

## గినియా–బిస్సావులో సైనికపాలన
### ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఐరాస డిమాండ్

**బిస్సావు :** పశ్చిమ ఆఫ్రికాదేశం గినియా–బిస్సావులో మరోసారి సైనిక తిరుగుబాటు జరగడంతో రాజకీయ సంక్షోభం తలెత్తింది. ఎన్నికల సమయంలో జరిగిన ఈ తిరుగుబాటును అనేక దేశాలు ఖండించాయి. వెంటనే రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాన్ని పునరుద్ధరించాలని ఐక్యరాజ్యసమితి సైనిక పాలకులను డిమాండ్ చేసింది. దేశంలో ఎన్నికల ప్రక్రియకు అవకాశం ఇవ్వాలని కోరింది. పొరుగున ఉన్న సెనెగల్, నైజీరియా దేశాలు కూడా గినియా–బిస్సావులో సైనిక తిరుగుబాటును తీవ్రంగా ఖండించాయి. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియను కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆఫ్రికా యూనియన్ కూడా గునియా–బిస్సావుతో సంబంధాలు రద్దుచేసుకుంది. రాజ్యాంగబద్ధ పాలనను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. నిర్ణీత ప్రకారం వారం క్రితం అంటే నవంబరు 23వ తేదీన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు ముందు అక్టోబరు 31న దేశంలో సైనిక కుట్ర జరుగుతుందని వార్తలు రావడంతో ఒక సైనికుల గ్రూపును ప్రభుత్వం బంధించి జైలులో ఉంచింది. ఆ తర్వాత అనేకమంది సీనియర్ సైనిక అధికారులు అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఇప్పటివరకూ దేశంలో పది సార్లు సైనిక తిరుగుబాట్లు జరిగాయి. వంబరు 26న ఉదయం సైన్యం తిరుగుబాటు చేసి యావత్ దేశాధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత సైనిక జనరల్ హోర్టా–ఇంటా–ఎ తాత్కాలిక దేశాధినేతగా నియమితులయ్యారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను రద్దుచేశారు. ఆయన ఆదేశంతో ప్రధానమంత్రిగా ఇలిడియో వియెరాటెమరో ప్రమాణ స్వీకారం చేశారు. 28 మందితో ఆయన కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. అప్పటివరకూ అధ్యక్షుడుగా ఉన్న ఉమరో సిస్సొకో ఎంబల్లో కాంగో దేశానికి పారిపోయారు. వాస్తవానికి ఆయనే మరోసారి ఎన్నిక అవుతారని అందరూ భావించారు. ఇప్పుడు తాజాగా శనివారం కాంగో రాజధాని బ్రెజ్జావిల్లోకు చేరుకుని ఆశ్రయం పొందినట్లు ఆయన అనుచరులు ప్రకటించారు.
ఈ తిరుగుబాటు చర్యను ఆఫ్రియా యూనియన్ సహా పలు దేశాలు ఖండించాయి. 1974లో పోర్చుగీసు వారి నుండి స్వాతంత్ర్యం పొందిన తర్వాత క్రమంగా పొరుగున ఆగ్నేయంగా ఉన్న గినియాతో ఉన్న గందరగోళాన్ని తొలగించేందుకు రాజధాని పేరు పక్కన తగిలించి దేశం పేరును ''గినియా–బిస్సావు''గా మార్చారు. ఈ దేశంలో స్థిరత్వం లేకపోవడంతో ఎక్కువగా సైనికపాలనలోనే మగ్గుతోంది. ఆయన ఆశీర్వాదాలతోనే దేశంలో సైనిక కుట్ర జరిగిందని కూడా ప్రచారం జరగడం ఒక విచిత్రస్థితి. ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఇలిడియో వియెరాటె గతంతో ఆయన మంత్రివర్గంలో ఆర్థికమంత్రిగా పనిచేశారు.

## నోబెల్ గ్రహీత టామ్ స్టాపర్డ్ మృతి

**డార్‌సెట్ :** ప్రముఖ నాటక రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత టామ్ స్టాపర్డ్ కన్నుమూశారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. నైరుతీ ఇంగ్లాండ్‌లోని సెరిమోనియల్ కౌంటీ డార్‌సెట్‌లో ఆయన మరణించారు. జెకొస్లొవేకియా జ్లిన్ నగరంలో 1937 జులై మూడో తేదీన జన్మించిన స్టాపార్డ్ నాజీల దురాక్రమణ కారణంగా అనివార్యంగా ఆయన కుటుంబం శరణార్థిగా వెళ్ళి బ్రిటన్‌లో స్థిరపడింది. 1966 నుండి 1996 వరకు స్టాపర్డ్ పేరెన్నికగన్న నాటకాలు రాశారు. విషాదం, హాస్యం కలగలిసిన ఆయన నాటకాలు జనాదరణ పొందాయి.

## బస్సులు ఢీ..
(మొదటి పేజీ తరువాయి)

బస్సుల్లోని ప్రయాణికులు చిక్కుకున్నారు. సమాచారం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో 11 మంది ప్రయాణికులు మరణించారు. మరోవైపు గాయపడిన 40 మందిని శివగంగై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతమంది ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీస్ అధికారి తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## చర్చ జరపాల్సిందే...
(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ల జాబితా స్వచ్ఛతపై చర్చ జరగాలి అని గొగోయ్ ఉద్ఘాటించారు. వాయు కాలుష్యం అంశంపై కూడా కాంగ్రెస్ చర్చ జరగాలని డిమాండ్ చేసిందని గొగోయ్ అన్నారు. ఇక నాల్గొవ అంశము ఆర్థిక భద్రత అని, రైతులకు సరైన ధరలు లభించడం లేదని, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా విదేశాంగ విధానం అంశాన్ని కూడా లేవనెత్తామన్నారు. భారతదేశం ఇతర దేశాల ఆధారంగా తన విదేశాంగ విధానాన్ని రూపొందిస్తోందని, మనం రష్యా నుండి చమురు కొనడం ఎవరో ఇష్టపడరని, మరొక దేశం రక్షణలో పెట్టుబడి పెడుతోందని, దానిని అంగీకరించేందుకు తాము సిద్ధంగా లేమన్నారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయని, ప్రజాస్వామ్య దేవాలయాన్ని ఒక వ్యక్తి పాటలను పాడటానికి మాత్రమే ఉపయోగించాలని కోరుకోవడం లేదని గొగోయ్ అన్నారు. ప్రభుత్వం పార్లమెంటును పట్టాలు తప్పి పార్లమెంటరీ సంప్రదాయాలను సమాధి చేయాలనుకుంటున్నట్లు అనిపిస్తోందని ఆయన ఆరోపించారు.

**అఖిలపక్ష భేటీ లాంఛనప్రాయమే : రమేశ్**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల ఎజెండాపై చర్చించడానికి మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశం కేవలం లాంఛనప్రాయమేనని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఆదివారం అన్నారు. ప్రతిపక్షాలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా స్వల్పకాలిక చర్చకు ఒక అంశాన్ని జాబితా చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం తన ఉద్దేశాలను స్పష్టం చేసిందని సమావేశానికి హాజరైన రమేష్ అన్నారు. '15 రోజుల ఈ సమావేశాలు పార్లమెంటరీ చరిత్రలో అతి తక్కువ సమయం. మోదీ ప్రభుత్వం 13 బిల్లులను ఆమోదం కోసం ఎజెండా రూపొందించింది. వీటిలో ఒకటి ఆర్డినెన్స్‌ను భర్తీ చేయడం. రెండు లోక్‌సభ కమిటీ ద్వారా వెళ్లినవి ఉన్నాయి. అయితే పది బిల్లులు సంబంధిత స్టాండింగ్ కమిటీ పరిశీలించలేదు' అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎజెండాలో పెట్టని బిల్లు స్వల్పకాలిక సెషన్ చివరి భాగంలో అకస్మాత్తుగా ప్రవేశపెట్టబడే అవకాశం ఉందని రమేష్ అన్నారు. ప్రతిపక్షాలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా స్వల్పకాలిక చర్చకు ఒక అంశాన్ని ఎజెండాలో పెట్టడం ద్వారా మోదీ ప్రభుత్వ ఉద్దేశాలు ఏమిటో అర్థమవుతుందన్నారు.

**ఎస్‌ఐఆర్ విషయంలో 40 మంది చనిపోయారు!**

'ఎస్‌ఐఆర్ అంశాన్ని విపక్షాల్లో ప్రతిఒక్కరూ ప్రస్తావిస్తున్నారు. విపక్షాలు ప్రస్తావించిన అనేక అంశాలపై చర్చిస్తున్నప్పుడు ఎస్‌ఐఆర్‌పై ఎందుకు చర్చించరు? మీకు ఈ విషయం తెలుసా కొద్దిరోజులుగా ఎస్‌ఐఆర్ విషయంలో 40 మంది చనిపోయారు. పది నుంచి 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇది చాలా తీవ్రమైన అంశం. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉంది. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియ ఏకపక్షంగా సాగడానికి వీల్లేదు. గతంలో వీలైనన్ని ఎక్కువ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలనే ఉద్దేశం ఎన్నికల సంఘానికి ఉండేది. ఇప్పుడేమో వీలైనన్ని ఓట్లు తొలగించాలని చూస్తోంది. ఈ వ్యవహారంపై చర్చించాలి' అని టిఎంసి సభ్యుడు కల్యాణ్ బెనర్జీ అన్నారు. సర్‌పై చర్చ జరగకపోతే తమ పార్టీ పార్లమెంటును పనిచేయనివ్వదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ అన్నారు. నిర్దిష్ట ఓట్లను తొలగించమని చెప్పినందుకే అనేక మంది బిఎల్‌ఒలు ఆత్మహత్య చేసుకున్నారు. పార్లమెంటుకు అంతరాయం కలిగితే, పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని సిపిఐ(ఎం) నాయకుడు జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఎర్రకోట పేలుడు ప్రభుత్వాన్ని బహిర్గతం చేసిందని, జాతీయ భద్రతపై చర్చ అవసరమని కూడా ఆయన అన్నారు. సర్‌పై చర్చకు డిమాండ్ చేయడంలో ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా ఉన్నాయని డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ అన్నారు. ప్రభుత్వం 14 బిల్లులను జాబితా చేసిందని, ప్రతిపక్షాలకు ఉమ్మడి సమస్య ' సర్' అని శివ అన్నారు.

**సమావేశాలు సజావుగా సాగుతాయని విశ్వసిస్తున్నా : రిజిజు**

'విపక్షాలు అనేక అంశాలను ప్రస్తావించాయి. అందులో ఎస్‌ఐఆర్ ఒకటి. ఎస్‌ఐఆర్ అంశంపై పార్లమెంటును సాగనివ్వమని ఏ పార్టీ కూడా చెప్పలేదు. ఎవరైనా బయట చెప్పి ఉంటే దానిని సామూహిక ప్రకటనగా భావించడానికి వీల్లేదు. శీతాకాల సమావేశాలు సజావుగా సాగుతాయని నేను విశ్వసిస్తున్నాను. ప్రభుత్వం కూడా ఇదే కోరింది. విపక్షాలు కూడా అనేక మంచి సలహాలు ఇచ్చాయి. అంతా కలిసి శీతాకాల సమావేశాలను సజావుగా నడపాలనే అభిప్రాయంతో ఉన్నాం' అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

## వారం పొడిగింపు
(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్, తమిళనాడు, యుపి, బంగాల్‌లో రెండో విడత ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది.

**తక్కువ సమయంలో పూర్తి చేయలేమని ఇసి గ్రహించింది : కాంగ్రెస్**

కాగా, ఎస్‌ఐఆర్ గడువును పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్‌ఐఆర్‌ను వారం పొడగించడమంటే కసరత్తును తక్కువ సమయంలో పూర్తి చేయలేమని ఇసి గ్రహించిందని పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇసి అహాన్ని విడిచిపెట్టి చివరిసారిగా జరిగిన కసరత్తు ఆధారంగా (2003 షెడ్యూల్ ప్రకారం) ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలని పేర్కొన్నారు. మరో వైపు ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. ఇదిలా ఉండగా ఎస్‌ఐఆర్ సమయంలో దాదాపు 40 మంది బూత్‌స్థాయి అధికారులు మరణించారని, తీవ్ర ఒత్తిడికి గురయ్యారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కొంత మంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపాయి. అందులో పది నుంచి 12 మంది పరిస్థితి విషమంగా ఉందని తెలిపాయి. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొన్నాయి. దీనిపై పార్లమెంట్‌లో చర్చించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశాయి. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియ ఏకపక్షంగా సాగడానికి వీల్లేదని వ్యాఖ్యానించాయి. గతంలో వీలైనన్ని ఎక్కువ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలనే ఉద్దేశం ఎన్నికల సంఘానికి ఉండేదని, ఇప్పుడేమో వీలైనన్ని ఓట్లు తొలగించాలని చూస్తోందని ఆరోపించాయి. మరోవైపు ప్రతిపక్షాల ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. ఎస్‌ఐఆర్ సజావుగా జరుగుతోందని పేర్కొంది.

**ఎస్‌ఐఆర్ జరురుగుతున్న రాష్ట్రాలు!**

అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బంగాల్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, బంగాల్‌లో 2026లో ఎన్నికలు జరగనున్నాయి. చాలా వరకు రాష్ట్రాల్లో 2002 నుంచి 2004 మధ్య చివరిగా ఎస్‌ఐఆర్ జరిగింది. ఎస్‌ఐఆర్ ప్రాథమిక లక్ష్యం విదేశీ అక్రమ వలసదారులను గుర్తించి వారిని అరికట్టడం. కాగా, ఇప్పటికే బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన వారితో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ వలసదారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## తక్షణం నిలిపివేయాలి
(మొదటి పేజీ తరువాయి)

పోరాటం పేరుతో అమాయకులైన ఆదివాసీలను నిర్మూలించే అన్యాయాన్ని తక్షణం నిలిపివేయాలని, ఢిల్లీలో రోజు రోజుకూ క్షీణిస్తున్న గాలి నాణ్యతా ప్రమాణాల సమస్యను అత్యవసర ప్రజారోగ్య సమస్యగా చేపట్టి పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందని ఈ విషయాలపై పార్లమెంటు సమావేశాల్లో ప్రధానంగా దృష్టిసారించాలని కోరారు.
దేశంలోని అత్యంత సున్నితమైన ప్రాంతాలలో ఒకటైన ఎర్రకోట వద్ద ఇటీవల జరిగిన బాంబు పేలుడు ఘటన ప్రభుత్వ భద్రతావైఫల్యానికి చిహ్నమని సందోష్ కుమార్ విమర్శించారు. ఈ విధమైన ఉల్లంఘన కేవలం గూఢచర్యం వైఫల్యాన్ని మాత్రమే కాకుండా, వ్యవస్థాగతమైన భద్రతా సన్నద్ధత వైఫల్యాన్ని కూడా ప్రతిబింబిస్తోందని విమర్శించారు. వ్యవస్థాగతమైన విలువలు రోజు రోజుకూ క్షీణించిపోవడంపై పార్లమెంటు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని కోరారు. నిధుల కేటాయింపులో కేరళ రాష్ట్రంపట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష పాటించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.
మావోయిస్టు తీవ్రవాదంపై పోరాటం పేరుతో అమాయకులైన ఆదివాసీలను, గిరిజనులను లక్ష్యంగా చేసుకుంటూ ఎలాంటి జవాబుదారీ చర్యలూ లేకుండా వట్టి అనుమానాలతో గిరిజనులను హతమారుస్తున్న విషయాన్ని ప్రముఖంగా ఆయన అఖిలపక్ష సమావేశం దృష్టికి తెచ్చారు. ఆదివాసీలను నిర్మూలించి వారికి సొంతమైన ప్రకృతి వనరులను అధికారపార్టీతో అంటకాగిన కార్పొరేట్ మిత్రులకు స్వాధీనం చేయాలనే అతిపెద్ద ఎజెండాలో ఈ చర్యలన్నీ ఒక భాగంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. తక్షణమే ఈ అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నిధుల కేటాయింపులో కేరళపట్ల కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశాలతో సవతి తల్లి వైఖరి అనుసరిస్తోందని, సహకార సమాఖ్య విధాన సూత్రాలను ఉల్లంఘిస్తోందని, ఈ వైఖరి ప్రత్యక్షంగా కేరళ ప్రజలకు తీవ్ర హాని కలిగిస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యలతోపాటు ప్రతిపక్షాలన్నీ లేవనెత్తిన అన్ని సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తితో పార్లమెంటులో చర్చించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాణాత్మకంగా, సహకార ధోరణితో పార్లమెంటు పనితీరుకు భరోసా ఇవ్వాలని, పార్లమెంటు వేదికపై వాస్తవ ప్రాతిపదికపై జవాబుదారీతనంతో చర్చలు జరగాలని సందోష్ కుమార్ కోరారు.

## ఎంఎస్‌ఎంఇ పార్కులు
(మొదటి పేజీ తరువాయి)

శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.... మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు అనేది ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. ఇప్పుడిప్పుడే... సమాజంలో ప్రగతిశీల మార్పు కనిపిస్తుందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. 2017–18 నుంచి 2023–24 మధ్య కాలంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 22 శాతం నుంచి 40.3 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం రాష్ట్ర పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. మహిళలు కూడా పురుషులకు ధీటుగా వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించగలరని 'వి హబ్' నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహి ళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే స్టార్టప్స్ ను అంతర్జాతీయ స్థాయిలో ఎంటర్ ప్రైజెస్ గా మార్చేలా 'వీ హబ్ 2.0'కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ వేదిక ద్వారా ఒకేచోట స్కిల్స్, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెట్, మెంటార్షిప్ అందుబాటులో ఉండేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తామన్నారు. మహిళల ఆలోచన తీరులోనూ మార్పు రావాలని, ఉద్యోగాల కోసం కాకుండా వాటిని సృష్టించేలా కొత్తగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి జ్వాల గుప్తా, ఫిలిం ప్రొడ్యూసర్ ప్రియాంక దత్, వీ హబ్ సీఈవో సీతా పల్లచోల్ల తదితరులు పాల్గొన్నారు.

## క్యూర్, ప్యూర్, రేర్
(మొదటి పేజీ తరువాయి)

విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దుద్దిళ్ల శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,దామోదర రాజనర్సింహ,కొండా సురేఖ,జూపల్లి కృష్ణా రావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, అజారుద్దీన్,వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి,ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, సుదర్శన్ రెడ్డి,మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఐఎస్‌బి ప్రొఫెసర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మీడియా సమావేశంలో ''గ్లోబల్ సమ్మిట్' ఆహ్వాన పత్రికను సిఎం ఆవిష్కరించారు. అంతకుముందు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలలో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని, దీనిని జాతికి అంకితం చేయబోతున్నామన్నారు. ఐఎస్‌బి, నీతి ఆయోగ్ సంస్థల సహకారంతో తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బలమైన ఆర్థికంగా రాష్ట్రంగా నిలబెట్టడంతో పాటు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశామన్నారు.

**దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలి**

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ రాష్ట్రం వాటా 5 శాతంగా ఉన్నదని, భవిష్యత్తులో పది శాతానికి పెంచాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బలహీనంగా ఉన్న పేదలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ప్రణాళికను రూపొందించామన్నారు. చారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ , 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**హైదరాబాద్ నుంచి మచిలీ పట్నంకు 'గ్రీన్‌ఫీల్డ్'**

హైదరాబాద్ మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటుకు ప్రధాని, ఎపి సిఎం సూచన ప్రాయంగా అంగీకరించారని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మరో నాలుగు విమానాశ్రయలు తీసుకొస్తున్నామని, వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్ట్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తామన్నారు. సులభతరమైన రవాణ ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, దేశాల నుంచి ఉత్పత్తుల దిగుమతి, ఎగుమతికి సముద్రం మార్గం ఉంటే మరింత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

**అభివృద్ధి చెందిన దేశాలతోనే పోటీ**

ప్రపంచంలో అభివృద్ధిచెందిన దేశాలనే తాము ఆదర్శంగా తీసుకున్నామని, ఆ దేశాలతోనే పోటాపడుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.బలమైన ఆర్థిక వ్యవస్థగా, అభివృద్ధి చెందిన చైనా, సౌత్ కోరియా, సింగపూర్, జపాన్‌తో పోటీ పడదల్చుకున్నామని, ఆయా దేశాల నుంచి పెట్టుబడులు ఆకర్షించబోతున్నామని ,పెద్ద పెద్ద పరిశ్రమలను తీసుకురాబోతున్నామని సిఎం అన్నారు. డిసెంబబర్ 1 నుంచి 13 రాష్ట్రంలో ప్రజా పాలన ఉత్సవాలు జరుగతాయని, ఈ ఉత్సవాల్లో భవిష్యత్, అగ్రికల్చర్, టూరిజం, ఎండోమెంట, హెల్త్, హెరిటేజ్ టూరిజం డాక్యూమెంట్ ఉంటాయన్నారు. ఉత్సవాల్లో భాగం గా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దేశాలకు అతిథ్యం ఇవ్వబోతున్నదన్నారు.

**విద్యా వ్యవస్థలో ప్రక్షాళన**

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని, నాణ్యమైన , సాంకేతికపరమైన విద్య ప్రభుత్వ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సింగిల్ టీచర్ నుంచి హైదరాబాద్ వరకు విద్యా వ్యవస్థలో ప్రక్షాళన తీసుకురావాలని, రాష్ట్రాన్ని నాలేడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో సాంకేతిక నిపుణులు, సైంటిటస్టు ఉంటే పెట్టుబడులు వస్తాయని, తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సిఎం అన్నారు. పెట్టుబడులు రక్షణ ఉంటే పెట్టుబడులు వస్తాయన్నారు.

**న్యూట్రిషన్ ఉత్తులకు ప్రాధాన్యత :**

తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు న్యూట్రిషన్ ఉత్పత్తులకు ప్రధాన్యత ఇవ్వబోతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి అవసరమైన దాని కంటే సర్‌ప్లస్ ఆహార ధాన్యాల ఉత్పత్తి చేస్తుందని, కానీ ప్రజలకు కావాల్సిన ఆరోగ్య ఉత్పత్తులను ఇవ్వలేకపోతుఅన్నమని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే న్యూట్రిషన్ ఫుడ్ ఎలా ఇవ్వాలనే విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు.

**సర్వీస్ సెక్టార్‌గా అవుటర్ రింగ్ రోడ్**

అవుటర్ రింగ్ రోడ్ లోపల కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామ పాలన ఇలా రకరకాల పాలన కొనసాగడంతో, ఏ సంస్థలో ఏం జరుగుతుందో ఎవరికి తెలిసేది కాదని, తద్వారా గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయని సిఎం వివరించారు. ట్రాఫిక్ జామ్, వర్షం లాంటి సమస్యలు ఎదుర్కొన్నామని, అందుకే అవుట్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ రీజన్ ఎకానమీగా(క్యూర్) ఏర్పాటు చేస్తున్నామని,ఇక్కడి నుంచి కాలుష్య పరిశ్రమల తొలగించి,సర్వీస్ సెక్టర్‌గా మారుస్తున్నామని చెప్పారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు 360 కిలోమీటర్ల దూరం ఉండనుంది, దీనిని పెరీ అర్బన్ రీజినల్ ఎకానమీగా (ప్యూర్) , ఏర్పాటు చేయబోతున్నామన్నారు. భారత్ ఫ్యూచర్‌సిటీ, హైవేలు, బుల్లెట్ ట్రేన్‌వంటి రాబోతున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూరల్ అగ్రికల్చర్ రీజనినల్ ఎకానమీ (రేర్) విభజించామని తెలిపారు. రీజినల్ రింగ్ రో డ్ హైదరాబాద్ రెండవ మానిహారంగా ఉండబోతుందన్నారు. బుల్లెట్‌ట్రేన్ సూత్రప్రాయంగా ఒప్పించామన్నారు.

**వ్యవసాయానికి ప్రాధాన్యత**

రూరల్ అగ్రికల్చర్ రీజినల్ రూరల్ ప్రాంతాలో వ్యవసాయ ఆధారిత ప్రణాళికలు రూపొందించామని, తద్వారా రైతులను భాగస్వామం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయ గ్రామీణ ప్రాంతాలను, ఉత్పత్తలను తాము నిర్లక్ష్యం చేయదల్చుకోలేదని, అందుకే ప్రధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఆహ్వానిస్తామని, ఆర్గనిక్ ఫుడ్‌ల ఏర్పాటుకు అగ్రి పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు.

## ప్రజాపాలన ఉత్సవాలు : భట్టి
(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం భవిష్యత్ కార్యాచరణ, 'తెలంగాణ రేజింగ్ 2047' విజన్ డాక్యూమెంట్‌ను విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ట్రిలియన్ డాలర్లను సాధించేందుకు ప్రణాళికలు, వ్యవస్థల ఏర్పాటు, పెట్టుబడుల ఆహ్వానం, ఏరకమైన అభివృద్ధి అనేది తమ విజన్ డాక్యూమెంట్ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ ఉత్సవాలకు ప్రపంచ దేశవ్యాప్తంగా ఆయా రంగాలలో నిష్ణాతులైన నిపుణులను, ఆయా రంగాలలో విజయం సాధించిన వ్యవస్థలను, వాటికి నాయకత్వం వహించిన వారిని ఆహ్వానిస్తున్నామన్నారు. డిసెంబర్ 10, 11, 12న ఫ్యూచర్ సిటీలో విజన్ డాక్యూమెంట్‌తో పాటు పలు ఆవిష్కరణలో ప్రజలు భాగస్వాములను చేస్తామన్నారు. డిసెంబర్ 13న ప్రపంచ క్రీడాకరుడు లియనెల్ బ్లెస్సి హైదరాబాద్ నగరానికి వచ్చి, ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండీ మ్యాచ్ ఆడబోతున్నారని భట్టి వివరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారెడ్డి అంజిరెడ్డి ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల హక్కుల సాధనకు అగ్రగామిగా సేవలందిస్తున్న టిఆర్‌టిఎఫ్ నూతన రాష్ట్ర కార్యవర్గంను వేములవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి మానేటి ప్రతాప్ రెడ్డి, లక్కిరెడ్డి సంజీవ రెడ్డి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారెడ్డి అంజిరెడ్డి సహా ఇతర పదవులకు కొత్తగా ప్రతినిధులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, పదోన్నతులు, సేవా నియమావళి, విద్యారంగ అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుని నూతన కార్యవర్గం కృషి చేస్తుందని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హామీ ఇచ్చారు.
ఉపాధ్యాయుల ఐక్యతే తమ బలం అని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడి సమస్య పరిష్కారం కోసమే టిఆర్‌టిఎఫ్ నిరంతర పోరాటం సాగిస్తుందని తెలిపారు.



## బాలమల్లేశ్‌కు సిపిఐ నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ నాయకుడు ఎన్.బాలమల్లేశ్ మొదటి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, మఖ్దూం భవన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటి.నరసింహ మాట్లాడుతూ బాలమల్లేష్ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకునిగా అంచలంచెలుగా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎదిగారని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఆ జిల్లా పార్టీ నిర్మాణానికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. బాలమల్లేశ్ ఆకస్మికంగా మరణించి నేటికి సంవత్సరం పూర్తయిందని, వారి ఆశయాలను, నేటితరం పునికిపుచ్చుకుని ఉద్యమించాలని పిలిపించారు. ఈ కార్యక్రమంలో మఖ్దూం భవన్ ఇన్‌చార్జి శ్రీరాములు, దశరథ, శివకుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా యాప్రాల్‌లోని ఆయన స్థూపం వద్ద బాలమల్లేశ్ కుటుంబ సభ్యులు నివాళ్లు అర్పించారు




## ప్రభుత్వ ఖర్చుతో ప్రచారమా?

### ఇసికి సిఎం పర్యటనపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు సిద్ధమవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. సిఎం జిల్లాల పర్యటన ముమ్మాటికి ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం సిఎం రేవంత్ రెడ్డి ఆరు జిల్లాల్లో ప్రచార సభలు నిర్వహించాలని చూడటంపై తెలంగాణ జాగృతి తరపున ఆదివారం ఉదయం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికలు గ్రామాల్లో ఉంటే ముఖ్యమంత్రి జిల్లా కేంద్రాలకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారట, అక్కడికి ప్రజలందరినీ ప్రభుత్వం సొమ్ముతో తరలించి తమ సందేశం ఇస్తారట, ఇది ముమ్మాటికీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని సిఎం పర్యటనను నిలిపివేయాలని కవిత ట్వీట్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదినితో ఫోన్‌లో మాట్లాడిన కవిత, ప్రజాధనాన్ని అక్రమ మార్గాల్లో ఖర్చు చేసి ఎన్నికల్లో అనుచిత లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

## డిసెంబర్ 4 నుంచి 'జాగృతి జనంబాట' కొనసాగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన 'జాగృతి జనంబాట' యాత్రను డిసెంబర్ 4వ తేదీ నుంచి తిరిగి కొనసాగించనున్నట్లు తెలంగాణ జాగృతి కార్యాలయం ఆదివారం సవరించిన షెడ్యూల్ వివరాలను ప్రకటించింది. అక్టోబర్ 25వ తేదీన నిజామాబాద్‌లో కవిత జనంబాట యాత్ర ప్రారంభించారు. మహబూబ్ నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ హన్మకొండ, నల్లగొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, వనపర్తి, కామారెడ్డి జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ లేని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో డిసెంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు యాత్ర నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లాలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యాత్ర చేపడుతారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18, 19 తేదీల్లో, గద్వాల జిల్లాలో 21, 22 తేదీల్లో యాత్ర నిర్వహిస్తారు. యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట, సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, ములుగు, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్, నారాయణపేట, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం వరకు యాత్ర కొనసాగిస్తారు.

# దేశంలోనే ప్రత్యేక ఎర్త్ సైన్స్ వర్సిటీ

### కొత్తగూడెం జిల్లాలో రేపు ప్రారంభించనున్న సిఎం :మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం విచ్చేస్తున్నందున అందుకు తగినట్లుగా ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈమేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఆయనతోపాటు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఎ పిఒ రాహుల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ముందుగా శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణాన్ని పర్యవేక్షించి జరుగుతున్న పనుల పురోగతిని వివరంగా తెలుసుకున్నారు. సభా స్థలాన్ని సందర్శించిన మంత్రి ఏర్పాట్లపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని సమీక్షించారు. భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచే విధంగా దేశంలోనే ప్రత్యేకత గల ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గతంలో సింగరేణి నిర్వహించిన స్కూల్ ఆఫ్ మైన్స్ అనుభవాన్ని గుర్తుచేస్తూ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ స్థాపనకు చేసిన కృషి గురించి వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం లేని నేపథ్యంలో ప్రత్యేక యూనివర్సిటీ అవసరాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తించి వెంటనే ఆమోదం తెలపడంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందని చెప్పారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనలతో రూపొందించిన ప్రతిపాదనను ప్రభుత్వ నిపుణులతో ఆరు నెలలపాటు పరిశీలించి, సాధ్యతా నివేదిక ఆధారంగా అసెంబ్లీలో ప్రకటించిదని మంత్రి వివరించారు. ఖనిజ సంపదలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన కొత్తగూడెం జిల్లా అరుదైన ఖనిజ సంపద లభ్యమయ్యే ప్రాంతాంగా ఉండటంతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అత్యుత్తమ ప్రదేశంగా ఉందని మంత్రి తెలిపారు. దేశ ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ సేవలను గుర్తిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, మంత్రి వర్గం, అసెంబ్లీ దీనిని ఆమోదించాయని వివరించారు. కొత్తగూడెంఇల్లెందుహైదరాబాద్ రహదారి నిర్మాణానికి ఆమోదం లభించగా పనులు ప్రారంభించబడ్డాయని మంత్రి తెలిపారు. భద్రాచలంమణుగూరుఏటూరినాగారంచౌటాల రహదారి నిర్మాణం కోసం అటవీశాఖ రెండు లైన్ల రహదారికి అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. పనుల పురోగతిగా ఉన్నాయని తెలిపారు. ఖమ్మం కేంద్రంగా సూర్యపేటరాజమహేంద్రవారంనాగపూర్అమరావతి రహదారులు పూర్తి కానున్నాయని, ఖమ్మంభద్రాద్రి జిల్లా అభివృద్ధి కోసం రింగురోడ్ కూడా ఆమోదించబడ్డాయని వివరించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో భాగంగా రహదారులు, నీటి పారుదల విద్యుత్ రంగాలలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు.



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పాల్వంచ పునర్జీవనంలో భాగంగా విద్యుత్ ఉప కేంద్రాల మంజూరు ప్రజల్లో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో సింగరేణి సహకారంతో నూతన బస్టాండ్ నిర్మించేందుకు, పాల్వంచ జెన్‌కో సహకారంతో ఆధునిక బస్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రతిబింబించేలా అన్ని సౌకర్యాలతో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపన గర్వకారణమని ఆయన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్ని శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని బాధ్యతలు అప్పగింపును మంత్రికి వివరించారు. అనంతం ఎస్‌పి రోహిత్ రాజ్ చేపడుతున్న భద్రతా చర్యలు, ఏర్పాట్లను వివరించారు. శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై మంత్రి వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుని పర్యటన విజయవంతానికి అంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్‌డిఒ మధు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### తాజా పరిస్థితుల నేపథ్యంలో..

## 'ఇస్కాఫ్' పాత్ర చాలా అవసరం

### సిపిఐ సీనియర్ నాయకుడు సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచం, దేశంలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో 'ఇస్కాఫ్' పాత్ర చాలా అవసరమని సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా సూచించారు. రాజకీయాల ప్రయాణం ఎటుపోతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేటీవ్ అండ్ ఫ్రెండ్‌షిప్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్,హిమాయత్ అమృత ఎస్టేట్‌లోని ఇస్కాఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. కౌన్సిల్ సమావేశానికి సయ్యద్ అజీజ్ పాషా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చెన్నైలో జనవరి 30న,31వ తేదీన జరగనున్న 'ఇస్కాఫ్' జాతీయ మహాసభ తీసుకునే తీర్మానాలు,నిర్ణయాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కౌన్సిల్ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. ఇస్కాఫ్ రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం చేయాలని, జాతీయ మహాసభ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంతో పాటు అంతర్జాతీయ,జాతీయ పరిస్థితులపై అవగాహన పెంచుకుని,ప్రజలలో చైతన్యం కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని అజీజ్ పాషా తెలిపారు.
ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న 'ఇస్కాఫ్'ను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఇస్కాఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రభాకర్ రావు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు రాజ్యాంగం విఫలమైందని చెబుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇస్కాఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమార్ కౌన్సిల్ చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ అధ్యక్షుడు మునీర్ పటేల్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.క్రాంతికుమార్ , సిపిఐ సరూర్‌నగర్ కార్యదర్శి బతరాజు నర్సింహ, ఎఐటియుసి నాయకులు చక్రునాయక్, ఇస్కాఫ్ మహిళా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ఇస్కాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.రాజామౌళితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఇస్కాఫ్ ప్రతినిధులు హాజరయ్యారు.




## రాహుల్ గాంధీకి కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీకి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కె.టి. రామారావు (కెటిఆర్) ఆదివారం బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీ (హిల్ట్ పాలసీ)ను స్వతంత్ర భారతదేశంలో అతి పెద్ద భూ కుంభకోణాల్లో ఒకటని ఆరోపణలు చేశారు. అత్యంత అవినీతితో కూడుకున్న ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగిస్తోందని తన లేఖలో కెటిఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌కు తెలుసా?, లేకపోతే కావాలని మౌనంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఈ అవినీతి కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు, వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందన్నారు. దీని వల్ల తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని లేఖలో వివరించారు. హైదరాబాద్ నగరంలోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని గుర్తు చేశారు. కొత్త హిల్ట్ పాలసీ కింద, పారిశ్రామిక భూములను కలిగి ఉన్నవారు ఇప్పుడు ఆ భూములను వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్‌ఆర్‌ఓ) విలువలో కేవలం 30 శాతం మాత్రమే చెల్లిస్తే చాలని చెప్పుకొచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధరల చాలా రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ విధానం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరిస్తోందన్నారు.
వేల కోట్ల విలువైన ఆస్తుల మార్పిడికి 45 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ ఆమోదాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.



## కొండ గట్టులో భారీ అగ్ని ప్రమాదం

### కోట్లలో ఆస్తి నష్టం
### సర్వస్వం కోల్పోయిన బాధితులు

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం దిగువ కొండగట్టులో శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి సుమారు 20 దుకాణాలు కాలి బూడిదయ్యాయి.కొండగట్టు అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన తెలుసుకోని రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ ,స్థానిక ఎమ్మెల్యే మేడి పెల్లి సత్యం బాధితులను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని, బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఆయన బాధితులకు హామీనిచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఘటన స్థలాన్ని పరిశీలించి,బాధితులను తాత్కాలికంగా స్థానిక పాఠశాలకు తరలించి,వారికి ఆహారం, వస్త్రాలు, ఇతర సహాయాలు అందించారు.అలాగే అసెస్ మెంట్ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలియజేశారు.ఈ ప్రమాదం లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ మధుసూధన్,ఎమ్మార్వో వసంత,ఆది రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర జ్యూడిషియల్ సర్వీసులో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) స్థాయిలో 66 పోస్టులను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ పద్ధతిలో అర్హులైన వారి నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ తెలియచేశారు. ఈ పోస్టులకు డిసెంబర్ 8వ తేదీ నుండి 29వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్ష తేదీలు, హాల్ టికెట్ల డౌన్ లోడ్, కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష వివరాల కోసం హైకోర్టు వెబ్‌సైట్ http://tshc.gov.com లో ఉంచడం జరిగిందని ఒక ప్రకటనలో తెలియజేశారు.

# పిసిబి ఇన్ యాక్షన్... పర్యావరణ పరిరక్షణకు చర్యలు

### 305 పరిశ్రమలు మూసివేత... మరికొన్నింటికి నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) పర్యావరణ చట్టాలు, నియమాలను అమలుకు కట్టుదిట్టం చేసింది. చట్టబద్ధమైన అధికారాలకు మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. కాలుష్య తీవ్రత ఆధారంగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(సిపిసిబి) పరిశ్రమలను నాలుగు రకాలుగా విభజించిన విషయం తెలిసిందే. వాటిలో ఎరుపు, నారింజ, ఆకుపచ్చ, తెలుపు కేటగిరిలుగా నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ నాలుగు కేటగిరీలకు సంబంధించిన పరిశ్రమలు 12,264 ఉన్నాయి. కొత్త పరిశ్రమలకు అనుమతులివ్వడంతోపాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలు చట్టాలు, నిబంధనలను పాటిస్తున్నాయా? అంశాలను గుర్తించడానికి నిరంతరం పర్యవేక్షణలు, నోటీసులు జారీచేయడం పెనాల్టీలు జారీచేయడంతో కాలుష్యాన్ని నియంత్రించడానికి టిజిపిసిబి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు కొత్త కంపెనీలకు పిసిబి అనుమతి ఇచ్చింది. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యకారకాలు, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా అని నిర్ధారించడంతో పాటు నీరు, వాయు కాలుష్యాన్ని నివారించడానికి పీసీబీ అనుమతి జారీ చేస్తుంది. జనవరి, 2024 నుండి అక్టోబర్, 2025 వరకు 2620 కంపెనీల స్థాపనలకు అంగీకరిస్తుంది. అంతేకాదు సదరు కంపెనీ భవిష్యత్‌లో సంభవించే కాలుష్యకారకాల అంచనా, వాటి ప్రభావం ఆధారంగా కార్యకలాపాలను ప్రారంభించడానికి అనుమతులు జారీచేస్తుంది. 3521 కంపెనీలకు కాన్సన్ట్ ఫర్ ఆపరేషన్స్(సిఎఫ్‌ఒ) జారీచేసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం నీటి కాలుష్య కారకాల పరిశ్రమలు 2193, వాయు కాలుష్య కారకాల పరిశ్రమలు 3164 ఉన్నాయని పీసీబీ గుర్తించింది. ఈ పరిశ్రమల పనితీరును పీసీబీ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. జనవరి 2024 నుండి అక్టోబర్ 2025 వరకు పరిశ్రమల నుండి మొత్తం 7966 మురుగునీటి/ప్రమాదకర వ్యర్థాల నమూనాలు, 3807 గాలి కాలుష్య కారకాల నమూనాలను సేకరించారు. నమూనాలను లాబోరేటరీ పంపించడంతోపాటు రిపోర్టు వచ్చిన తర్వాత సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.



**305 కంపెనీలలో ఆపరేషన్లు నిలిపివేత**

జనవరి 2024 నుండి అక్టోబర్ 2025 వరకు రాష్ట్రంలో 305 కంపెనీలకు మూసివేయాలని, ఉత్పత్తిని నిలిపివేయాలని పీసీబీ ఉత్తర్వులు జారీచేసింది. కాలుష్య నియంత్రణలో భాగంగా 2069 పరిశ్రమలకు సంబంధించిన కాలుష్య కారకాలను అధికారులు సమీక్షించారు. వీటిలో 1234 పరిశ్రమలకు నోటీసులు జారీచేశారు. అయితే పిసిబి నిబంధనలు పాటిస్తున్నారని నిర్ధారించుకున్న తర్వాత 697 పరిశ్రమలకు మూసివేత రద్దు ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు చేశారు.
ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఒడిపి) కింద కంప్యూటరైజ్డ్ తనిఖీల కేటాయింపు కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) ఒక 'టూల్'ను అభివృద్ధి చేసింది. ఈ తనిఖీల అమలు డిసెంబర్ 2015 నుంచి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా యాదృచ్ఛిక ప్రాతిపదికన అధికారులకు తనిఖీ కోసం రౌండ్ పరిశ్రమల కేటాయింపు జరుగుతుంది. జనవరి, 2024 నుండి అక్టోబర్, 2025 వరకు టాస్క్ ఫోర్స్ కమిటీ 1664 పరిశ్రమలను తనిఖీ చేసింది. 324 పరిశ్రమలను సమీక్షించడంతోపాటు తగు చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కారం కోసం టిజిపిసిబి టోల్‌ఫ్రీ నంబర్ 10741, ఆన్‌లైన్ ఫిర్యాదు యాప్ 'జనవాణి–కలుష్య నివారిణి'ని ఏర్పాటు చేసింది.

## నూతన వైన్స్‌షాపు పెట్టొద్దని రాస్తారోకో



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని నార్కట్‌పల్లి అద్దంకి జాతీయ రహదారి నందిపాడు చౌరస్తా వద్ద నూతనంగా వైన్స్‌షాపు పెట్టవద్దని కోరుతూ ఆదివారం శరణ్య గ్రీన్‌హోమ్స్ కాలనీ వాసులు, రోడ్డు వెంట నివాసం ఉంటున్న ప్రజలు, మహిళలు రాస్తారోకో చేపట్టారు. సుమారు అర గంటపాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగతా కిలోమీటర్ మేరా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శరణ్యగ్రీన్‌హోమ్స్ వాసులు, ప్రజలు ముఖ్యంగా మహిళలు మద్యం షాపు ఉండడం వల్ల ఇబ్బందులకు గురవుతారని, మద్యం షాపు పెట్టవద్దని వారు అన్నారు. రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య, టూటౌన్ ఎస్ఐ రాంబాబులు చేరుకోని రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం వారంతా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకోని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. నివాసాల మధ్య వైన్స్‌షాపు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

## సాగర్ సందర్శించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి



ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను ఆదివారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కందుల చంద్రారెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునకొండ మ్యూజియాన్ని, అక్కడ పునర్మించిన సింహాల విహారం, మహా స్తూపము, అశ్వమేధ యజ్ఞశాల మొదలగు వాటిని వీక్షించారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌ను, బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధ వనములోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంతరం బుద్ధ వనం కందువాల, బ్రోచర్లతో తో బుద్దవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన సత్కరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ చారిత్రక విశేషాలను, బుద్ధవనం వివరాలను తెలియజేశారు.



## ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ప్రజాపక్షం/మునగాల: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మండలం ఇమాంపేట, మునగాల, నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన రెండో విడత గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్ల ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట, చివ్వెంల, మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ, చిలుకూరు, అనంతగిరి మండల్లాలోని 181 గ్రామ పంచాయతీలు, 1628 వార్డు సభ్యులకు నేటి నుండి డిసెంబర్ రెండవ తేదీ వరకు 49 నామినేషన్ కేంద్రాలలో రెండో విడత ద్వారా నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, ఎంపిడివోలు బాలకృష్ణ, రమేష్ దీన్‌దయాల్, మల్సూర్‌నాయక్, ఆర్ఓలు పాల్గొన్నారు.

## ఆరు గ్రామ పంచాయతీలలో సిపిఐ పోటీ

### సిపిఐ జిల్లా కార్యవర్గ కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య



ప్రజాపక్షం/చండూరు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న కమ్యూనిస్టులను పంచాయితీ ఎన్నికల్లో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో మండల కార్యవర్గ సమావేశం బరిగల వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య హాజరై మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామ పంచాయితీలలో సిపిఐ ఒంటరిగా పోటీ చేస్తుందని అన్నారు. మండల పరిధిలోని కస్తాల , పుల్లెంల , కొండాపురం, దోనిపాముల , జోగిగూడెం , బంగారిగడ్డ గ్రామ పంచాయితీ సర్పంచ్‌తో పాటు అన్ని వార్డులకు ఒంటరిగానే బరిలో నిలుస్తుందని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీ బలపర్చే అభ్యర్థులను సర్పంచ్‌గా గెలిపించుకొని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, దోటి వెంకన్న, బండమీది వెంకటేశం , జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య, ఇరిగి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్‌కు పటిష్ఠ బందోబస్తు



ప్రజాపక్షం/మునగాల: రెండోవిడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఆదివారం నుండి నామినేషన్లు వేస్తున్న మునగాల మండల పరిధిలోని రేపాల గ్రామంలో నామినేషన్ వేస్తున్న కేంద్రాలను జిల్లా ఎస్పి కె.నర్సింహా పరిశీలించారు. ఎన్నికలకు ఐదు అంచెల పోలీస్ భద్రత ఉండాలని సంబంధింత అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి ఆంక్షలు అమలు చేయాలని, అనుమానం వ్యక్తులను మాత్రమే పరిశిలించి లోపలికి పంపించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పౌరులు గుంపులుగా చేరకుండా నిషేద అజ్ఞలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎన్నికల నియామవళిని లోబడి నడుచుకోవాలని గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో నడుచుకోవాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. గెలుపు ఓటములు సహజమని అందరూ ఒకే గ్రామం వారు కావున గొడవలు పెట్టుకోవద్దని అన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిని సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి వెంట కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## తగ్గుతున్న రిజర్వాయర్ నీటిమట్టం

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు ఇన్ ఫ్లో లేకపోవడం కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల కొనసాగిస్తూ ఉండటంతో రిజర్వాయర్ లో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది. 590 అడుగులుగా ఉండాల్సిన ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం ఆది వారం సాయంత్రానికి గరిష్ట నీటిమట్టానికి ఎనిమిది అడుగుల మేర తగ్గి 580.60 అడుగులుగా ఉన్నది.నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 284.7452 టిఎంసిలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 4034 క్యూసెక్కులు ఎస్ ఎల్ బి సి ఏఎంఆర్పి ద్వారా 1800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు,అయితే సాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి స్వల్పంగా 13857 క్యూసెక్కుల నీరు వస్తూ ఉండటంతో అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా విడుదల చేస్తున్నారు.



# నిధుల కోసం నిలదీస్తా

### తెలంగాణ పెండింగ్ సమస్యలు పార్లమెంట్లో వినిపిస్తా

### కీలకమైన దేశ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తాం

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విషయమై నేటి నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో మోడీ సర్కార్‌ను నిలదీస్తానని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామ ల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి 19 వరకు జరుగుతున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి బలంగా లేవనెత్తనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు రాష్ట్రానికి రావలసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన ప్రాజెక్టులకు కావలసిన నిధులు, వాటి అనుమతులు, విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావలసిన న్యాయమైన హక్కులకు సంబంధించి పెండింగ్ సమస్యలను ప్రధాని మంత్రి మోడీకి మొదలుకొని సంబంధిత కేంద్ర మంత్రులకు పలుమార్లు వేరు వేరుగా వినతి పత్రాలను అందజేశామన్నారు. అయినప్పటికీ తెలంగాణకు న్యాయపరంగా రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చేస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈ శీతాకాల సమావేశంలో పార్లమెంటు వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి సాధన కోసం కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్యాబినెట్ మంత్రులు 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని త్రీ మిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి నిర్ణయం తీసుకొని ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్ర జిఎస్‌డిపిని పెంచడానికి కార్యాచర ణ ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తున్నారు. ఇందులో బాగంగానే రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్ మూసీ రీజువెనేషన్, పట్టణ స్థానిక సంస్థలకు అర్బన్ చాలెంజ్ ఫండ్, కొత్త రైల్వే మార్గాలు,వరంగల్, కొతగూ డెం, పెదపల్లి విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక అనుమతుల గురించి ప్రత్యేకంగా లేవనెత్తుతున్న ట్లు వెల్లడించారు. కేవలం 15రోజులు మాత్రమే ఉన్న ఈ చి న్న సెషన్లో, తెలంగాణ ప్రయోజనాలు, ప్రజా సమస్యలను అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి బలంగా వినిపిస్తామన్నారు. ఇండియా కూటమి తరపున, కాంగ్రెస్ ఎన్నికల సంస్కరణలు కోరుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత బిల్లులను ప్రతిఘటిస్తామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఓటర్ లిస్ట్ ఎస్ఐఆర్‌లో లోపాలు, రాజకీయ జోక్యంపై ప్రస్తావిస్తామన్నారు. మోడీ సర్కార్ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీని అమలుపరచని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఉన్న ఉపాధిని ఊడగోడుతున్నదని మండిపడ్డారు. గత 10 సంవత్సరాలకు పైగా కేంద్రంలోని బిజెపి పాలనలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను ఈ సెషన్‌లో ప్రధానంగా వినిపిస్తానని వివరించారు. దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న విపరీత కాలుష్య సమస్యను గొంతెత్తి వినిపిస్తానని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన గాంధీ కుటుంబీకులపై అక్రమంగా, కక్షపూరితంగా మోడీ సర్కార్ పెట్టినటువంటి నేషనల్ హెరాల్ కేసు గురించి ఈ పార్లమెంటు సెషన్‌లో ఎండగడతానని తెలిపారు. మోడీ సర్కార్ తన స్వలాభం, రాజకీయ లబ్ధి కోసం, కార్పొరేట్ వ్యాపారులకు మేలు చేయడానికి తెచ్చిన కొన్ని బిల్లులపై ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కేంద్రం తీసుకువచ్చిన అటామిక్ ఎనర్జీ బిల్ 2025, హయ్యర్ ఎడ్యుకేషన్ కమీషన్ ప్రతిపాదనలు, చండీగఢ్ రాజ్యాంగ సవరణ బిల్లులను పార్లమెంటు వేదికగా ఇండియా కూటమి సభ్యులతో కలిసి ప్రతిఘటిస్తామని చెప్పారు. విదేశాంగ విషయాల్లో ట్రంప్ చేసిన ఇండియాపాకిస్థాన్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు, ఇండియా యునైటెడ్ స్టేట్ ట్రేడ్ చర్చలు, చైనా సంబంధిత అంశాల్లో ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకురావడానికి కృషి చేస్తామని వివరించారు.

## దిత్వా తుఫాన్‌తో అప్రమత్తం

### జిల్లా ఎస్‌పి కె. నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట : దిత్వా తుఫాన్ ప్రభావంతో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 1వ తేదీ సాయంత్రానికి జిల్లాలో ప్రభావం చూపి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, రైతులు కష్టం వృధా కాకుండా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పడాలని విజ్ఞప్తి చేశారు. జాలర్లు చేపల వేటకు వెళ్ళవద్దన్నారు. పశువులు, మేకలు, గొర్ల మందలు మేతకు పొలాలకు తరలించవద్దని సూచించారు. పాత ఇండ్లలో ఉండవద్దని, ప్రయాణాలు రద్దు చేసుకోవాలన్నారు. జిల్లా పోలీస్ శాఖ అంతా అప్రమత్తంగా ఉన్నామన్నారు. సెలవులు రద్దుచేసి విధుల్లో నియమించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రమాద స్థలాలు, నాళాలు, వంతెనలు, కల్వర్టుల వద్ద పికెట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు పోలీసు వారి సూచనలు పాటించాలన్నారు. అత్యవసర సమయంలో 100, సూర్యాపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686026 కు ఫోన్ చేయాలని కోరారు.

## నామినేషన్ల స్వీకరణ సరళి పరిశీలన

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా డివిజన్‌లోని సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన పలు క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆదివారం పరిశీలించారు. నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట దామరచర్ల తహసీల్దార్ జవహర్‌లాల్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్‌లు, యాద్గార్‌పల్లి, ఉట్లపల్లి, కాల్వపల్లి, తక్కెళ్లపాడు, తడకమళ్ల, రాయినిపాలెం క్లస్టర్ల కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హెల్ప్ డెస్కులు క్లస్టర్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్‌లో గ్రామ పాలన అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉంటారని తెలిపారు. సర్పంచ్, వార్డు అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు నింపి ఇస్తున్నారని, సలహాలు ఇస్తున్నారని ఆయన తెలిపారు.



# పారదర్శకంగా రెండవ విడత నామినేషన్లు

### ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి/వలిగొండ : గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా రెండవ విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ ఎన్నికల ఫేస్ II నామినేషన్ల స్వీకరణలో బాగంగా వలిగొండ మండలంలోని పులిగిల్ల క్లస్టర్ పరిధిలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచులు, వార్డుల వారీగా వివరాలు క్లుప్తంగా పరిశీలించి నామినేషన్ పత్రాలు తీసుకోవాలన్నారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, హెల్ప్ డెస్క్, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 100 మీటర్ల దూరం వరకు ఎవ్వరు కూడా గుంపులుగా ఉండకూడదన్నారు. పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి నామినేషన్ల స్వీకరణ సజావుగా జరిగేలా చూడాలన్నారు. అధికారులందరూ కూడా ఎన్నికల నియమాలు పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు.

**చెక్ పోస్ట్‌ను ఆకస్మిక తనిఖీ**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం వలిగొండ మండల శివారు ప్రాంతంలో ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి చెక్ పోస్ట్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీం చెక్‌పోస్ట్ వద్ద ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇప్పటివరకు ప్రతిరోజు ఎన్ని వాహనాలు తనిఖీ చేశారని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ చేసిన వాహనాల వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. 24/7 చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించాలన్నారు. పోలీస్, రెవిన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని ఆపి వీడియో రికార్డ్ చేస్తూ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విధుల్లో నిర్లక్ష్యం చేయడానికి వీలులేదన్నారు.

**క్లుప్తంగా పరిశీలించి నామినేషన్ పత్రాలు స్వీకరించాలి**

ప్రజాపక్షం/ రామన్నపేట: అభ్యర్థులు అందించే నామినేషన్ పత్రాలను అధికారులు క్లుప్తంగా పరిశీలించి స్వీకరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం ఆయన రెండవ విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రామన్నపేట్ల క్లస్టర్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, హెల్ప్ డెస్క్, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. వంద మీటర్ల దూరం వరకు ఎవరూ కూడా గుంపులుగా ఉండకూడదన్నారు. అధికారులందరు కూడా ఎన్నికల నియమావళి పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు.

## సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : ప్రస్తుతం జరగనున్న ఎన్నికలు చాలా కీలకమైనవని ఎలక్షన్స్ సిబ్బంది తమ తమ విధుల్లో బాధ్యతగా పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీవో శేఖర్ రెడ్డి కోరారు. రెండవ దశలో జరగనున్న భూదాన్ పోచంపల్లి మండల గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా ఆయన ఆదివారం తొలి రోజు 5 నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. దంతూరులో ఎలక్షన్ల ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగుతుందని రేపటి వరకు జరిగే నామినేషన్లు ప్రక్రియలో ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు నడుచుకోవాలని కోరారు. రెండవ దశ మండలమైన భూదాన్ పోచంపల్లిలో నామినేషన్ల పర్వం మొదలైంది. మొదటి రోజు మండల వ్యాప్తంగా 21 గ్రామాలలో సర్పం చ్ అభ్యర్థులుగా 15 మంది, వార్డు మెంబర్ అభ్యర్థులుగా 24 మంది నామినేషులు దాఖలు చేశారు. సర్పంచ్ అభ్యర్థులుగా దేశ్ముఖిలో 3, ఇంద్రియాల, దోతీగూడెం, కనుముకుల, శివ రెడ్డిగూడెం గ్రామాలలో 2, జూలూరు, జగత్‌పల్లి, రామలింగంపల్లి, కప్రాయిపల్లి గ్రామాలలో ఒకటి చొప్పున నామినేషన్లు వేశారు. సర్పంచుల అభ్యర్థులుగా దేశ్ముఖి గ్రామంలో కాంగ్రెస్ నుంచి జక్కుల దశరథ, దాసర్ల జంగయ్య, బిఆర్ఎస్ నుంచి దుర్గం జంగయ్య, శివారెడ్డి గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లారెడ్డి, వారాల రామచంద్రారెడ్డి, దోతీగూడెం గ్రామం లో ముద్దం సత్యం యాదవ్, ముద్దం శేఖర్ యాదవ్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా, దంతూరు గ్రామంలో మాకోలు శ్రీనివాస్ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు వేశారు. మండలంలో ఏడు నిర్దేశించిన కేంద్రాలలో రిటర్నింగ్ అధికారులు సా.గం 5 వరకు స్వీకరిస్తారు. సహాయ జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి ఆర్డిఓ వెంట ఉన్నారు.

# సర్పంచ్ అభ్యర్థి కిడ్నాప్

### నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని బెదిరింపులు




ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లా రాజకీయాల్లో కలకలం రేపే ఒక దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. తిప్పర్తి మండలం, ఎల్లమ్మగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాల్సిన మామిడాల యాదగిరి యాదవ్ ని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కిడ్నాప్ చేసి, నామినేషన్ ఉపసంహరించుకోమని అత్యంత పాశవికంగా చిత్రహింసలకు గురిచేసినట్లు బాధితుడు ఆరోపించారు.ఎల్లమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న మామిడాల యాదగిరి యాదవ్ ని కాంగ్రెస్ నాయకులు కత్తులతో బెదిరించి కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్‌లో గతంలో ఎల్లమ్మగూడెం గ్రామ మాజీ సర్పంచ్ భర్త విజయ్ రెడ్డి హత్య కేసులో నిందితుడైన వూట్కూరి సందీప్ రెడ్డి కూడా పాల్గొన్నట్లు యాదగిరి తెలిపారు.నామినేషన్ ఉపసంహరించుకునే వరకు యాదగిరిని ఊరు రాకుండా, నామినేషన్ వేయకుండా కార్లు మారుస్తూ పలు ప్రాంతాల్లో తిప్పారు. ఈ క్రమంలోనే కిడ్నాపర్లు యాదగిరిపై అమానుషంగా దాడి చేశారని యాదగిరి ఆరోపించారు.అంతేకాక, ఆయన్ను బట్టలు విప్పదీసి నగ్నంగా మార్చి తీవ్రంగా కొట్టారని, పిడిగుద్దులు గుద్ది చుక్కలు చూపించారని తెలిపారు. నీ భార్య నామినేషన్ వేయకుండా ఆపించు, లేదంటే నువ్వు చావడం పక్క అంటూ కిడ్నాపర్లు బెదిరించారని యాదగిరి వెల్లడించారు. కిడ్నాపర్లతో కాంగ్రెస్ నాయకుడు బోళ్ల వెంకట్ రెడ్డి మాట్లాడారని కూడా ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ నాయకులు తనను బలవంతంగా కిడ్నాప్ చేశారని యాదగిరి ఆరోపించారు. విడుదలైన తర్వాత జరిగిన సంఘటనపైనా అనుమానం వ్యక్తం చేశారు. కిడ్నాపర్ల చెర నుంచి బయటపడి పోలీసుల వద్దకు రాగా, పోలీసులు తనపై బలవంతపు సంతకాలు చేయించుకున్నారని ఆయన ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఇలాంటి దారుణమైన కిడ్నాప్, చిత్రహింసల ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చివరికి కథ సుఖాంతంగా ముగిసింది కిడ్నాపర్లు యాదగిరి రెడ్డిని విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదగిరి భార్య నాగలక్ష్మి సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేశారు.

## ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

### బూటకపు ఎన్‌కౌంటర్‌లను అపాలి: లక్ష్మణ్

ప్రజాపక్షం/ నలగొండ టౌన్: ఆపరేషన్ కగారు పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం డెడ్‌లైన్ పెట్టిమరీ ఆదివాసీలను,మావోయిస్టులను చంపడం కోర్టు దిక్కారనే అవుతుందని, ఇది పూర్తిగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని పౌర హక్కుల సంఘం సిఎల్‌సి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు.ఆదివారం నల్లగొండ పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో వామపక్ష పార్టీలు,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ అడ్వొకెట్ దర్శనం నర్సింహ అధ్యక్షతన మారేడు మిల్లి, రంపచోడవరం బూటకపు ఎన్‌కౌంటర్స్ పైసుప్రీం కోర్టు జడ్జిచే విచారణ జర్పించాలని, ఆపరేషన్ కగార్‌ను విరమించాలని నిరసన సభ నిర్వహించారు.ఈసభకు ప్రొపెసర్ లక్ష్మణ్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఆర్ ఎస్ఎస్ నేతృత్వంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అత్యంత పాశవికంగా ఆదివాసులను, మావోయిస్టులను పట్టుకొని ఎన్ కౌంటర్స్ పేరిట హత్యలు చేస్తున్నదని అన్నారు.డెడ్ లైన్ పెట్టి అంతమొందిస్తామని బహిరంగంగా ప్రకటించి మానవ హననం చేయడం కోర్ట్ దిక్కారనే అవుతుందని అన్నారు. కోర్టులు, చట్టాలు ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా అన్ని వ్యవస్థ లను బీజేపీ ప్రభుత్వం విధ్వంసం చేసిందని తెలిపారు. దేశంలో జరిగిన ఎన్‌కౌంటర్స్ అన్ని రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్నవేనని తెలిపారు. హిడ్మా ఆదివాసులకు హీరో అని, ఇరువై కోట్ల ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాడని అన్నారు. మారేడు మిల్లి ఘటనపై విచారణ జరపాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న మానవ హననం పై ప్రజలు నిరసన తెలపాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ఎస్ రెడ్డి,విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య,సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,ఎం.ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆర్.జనార్దన్,బిసిపి రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు,మాజీ ఎంఎల్ఏ నర్సిరెడ్డి,అనంత రెడ్డి,సిహెచ్ సుధాకర్ రెడ్డి,పాలడుగు నాగార్జున. గురూజీ తదితరులు పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం ముఖ్యం

**చెన్నై:** గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్ భవన్ పేరును 'లోక్ భవన్'గా మార్చాలన్న ప్రతిపాదనను తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఈ చర్యకు సిఫార్సు చేయడంపై మండిపడ్డారు. ముందు ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం ముఖ్యమని సూచించారు. ప్రజాస్వామ్య సంస్థల పట్ల గౌరవం లేనప్పుడు రాజ్ భవన్ పేరు మార్పు చర్య అనవసరమని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల అధికారాన్ని గౌరవించడంలోనే నిజమైన జవాబుదారీతనం ఉంటుందని సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. 'పేరు మార్చడం అనేది మనస్తత్వాన్ని మార్చడం కంటే తక్కువే.శాసనసభ అనేది ప్రజల సభ. శాసనసభను గౌరవించని వారికి, లోక్ భవన్‌గా పేరు మార్చడం కేవలం సంజ్ఞా? ప్రజాస్వామ్య సూత్రాల కళ్లలో ఇసుక వేయడమేనా?' అని ప్రశ్నించారు. మరోవైపు ప్రజలచే ఎన్నుకున్న ప్రభుత్వాలను, ప్రజల అభీష్టాన్ని నెరవేర్చే సార్వభౌమ శాసనసభను గౌరవించడం ప్రస్తుతం అవసరమని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో..
# సోనియాగాంధీ, రాహుల్‌పై కొత్త ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలైన ఎంపి రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో సహా మరికొందరిపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యు) కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు మరో ఆరుగురిపై నేరపూరిత కుట్ర అభియోగాలు నమోదు చేసినట్లు ఇఒడబ్ల్యు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో వీరిద్దరితో పాటు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతో పాటు యంగ్ ఇండియా సంస్థ కూడా కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. వీరందరూ కుట్రపూరితంగా కేవలం రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆస్తులపై హక్కు పొందారని ఆరోపించింది. కాగా ఈ కేసులో నిందితులుగా ఉన్న మోతీలాల్ వోరా 2020లో మృతిచెందగా.. ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021లో మృతిచెందారు. ఇక నేషనల్ హెరాల్డ్ కేసు విషయానికి వస్తే... నేషనల్ హెరాల్ పత్రికను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నలిస్ట్ లిమిటెడ్ (ఎజెఎల్)కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకుందని, రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియా రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్‌కి చెల్లించి ఏజేఎల్‌ను సొంతం చేసుకొన్నట్లు అభియోగపత్రంలో ఇడి పేర్కొంది.





ఎన్నికల్లో పార్టీ టికెట్లు కేటాయిస్తామని, పదవులకు ఎంపికచేస్తామని, వ్యాపారాలకు రక్షణ కల్పిస్తామంటూ వివిధ వ్యక్తుల నుంచి పార్టీ సీనియర్ నేతల ద్వారా భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారని తెలిపింది. 2025 అక్టోబర్ 3 నాటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ రూపొందించబడింది. ఇడి తమ దర్యాప్తు నివేదికను ఢిల్లీ పోలీసులతో పంచుకోవడంతో కొత్త ఎఫ్ఐఆర్ నమోదైంది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణను ఢిల్లీ కోర్టు డిసెంబర్ 16కి వాయిదా వేసింది. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై కాంగ్రెస్ మండిపడింది. తమ పార్టీ అగ్రనాయకత్వంపై మోదీషా ద్వయం బెదిరింపులు, రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసు బోగస్ అని అంతిమంగా న్యాయం గెలుస్తుందని ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్య మం ఎక్స్‌లో పోస్టు చేశారు. బెదిరింపులకు పాల్పడేవారు అభద్రత, భయంతో ఉంటారని రాసుకొచ్చారు.

## పార్లమెంట్ ముందుకు
# భారీ సంస్కరణ ఎజెండా

**న్యూఢిల్లీ:** బిహార్‌లో భారీ విజయంతో దూకుడు మీదుతున్న అధికారపక్షం ఒకవైపు, ఊహించని ఓటమితో నైరాశ్యంలో మునిగిన ప్రతిపక్షం మరోవైపు వ్యూహ ప్రతివ్యూహాలతో పార్లమెంటు శీతాకాల సమావేశాలకు సిద్ధమవుతున్నాయి. ఈ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో భారీ సంస్కరణల ఎజెండాను ముందుకు తీసుకురానుంది. పౌర అణు రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు తెరిచే చట్టంతో ప్రభుత్వం తన సంస్కరణల ఎజెండాను ముందు కు తీసుకురానుంది. ప్రతిపక్షాలు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల సవరణ అంశాన్ని లేవనెత్తనున్నాయి.



* భారతదేశంలో అణుశక్తి వినియోగం, నియంత్రణను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్న కీలకమైన 'ది అటామిక్ ఎనర్జీ బిల్లు, 2025'తో పాటు, భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు, 8 ఇతర ముసాయిదా చట్టాలు కూడా ఎజెండాలో ఉన్నా యి.
* **భారత ఉన్నత విద్యాకమిషన్ బిల్లు :** విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు స్వతంత్ర, స్వయంప్రతిపత్తి సంస్థలుగా మారడానికి, బలమైన, పారదర్శకమైన అక్రిడిటేషన్, స్వయంప్రతిపత్తి వ్యవస్థ ద్వారా శ్రేష్ఠతను ప్రోత్సహించడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.
* జాతీయ రహదారుల (సవరణ) బిల్లును కూడా ఎజెండాలో పెట్టింది. జాతీయ రహదారుల కోసం వేగవంతమైన పారదర్శకమైన భూసేకరణను నిర్ధారించడానికి ప్రయత్నిస్తుంది.
* మరో ప్రతిపాదిత చట్టం కార్పొరేట్ చట్టాలు (సవరణ) బిల్లు, 2025. ఇది వ్యాపారం సులభతరం చేయడానికి కంపెనీల చట్టం, 2013, ఎల్‌పి చట్టం, 2008లను సర్దుబాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.
* ప్రభుత్వ అజెండాలో సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి), 2025 కూడా ఉంది. ఇది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం, 1992, డిపాజిటరీల చట్టం, 1996, సెక్యూరిటీస్ కాంట్రాక్టులు (నియంత్రణ) చట్టం, 1956 నిబంధనలను హేతుబద్ధీకరించిన సింగిల్ సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్‌గా ఏకీకృతం చేయాలని ప్రతిపాదిస్తుంది.
* ప్రభుత్వం ఆర్బిట్రేషన్, కన్సిలియేషన్ చట్టానికి కూడా మార్పులు చేయాలని యోచిస్తోంది. చట్టంలోని సెక్షన్ 34 కి ప్రతిపాదిత సవరణ, కంపెనీ డైరెక్టర్లపై సుప్రీంకోర్టు పరిశీలన కారణంగా ప్రభుత్వం ఈ సమస్యను ఒక కమిటీకి సూచించిందని న్యాయ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. మునుపటి సెషన్ నుండి రెండు బిల్లులు కూడా పరిశీలన, ఆమోదం కోసం జాబితాలో పెట్టింది. ఈ సంవత్సరానికి మొదటి అనుబంధ బడ్జెట్ కూడా ఎజెండాలో ఉందని బులెటిన్ తెలిపింది.

## పుట్టినరోజు వేడుకల్లో విషాదం

**స్టాక్‌టన్:** కాలిఫోర్నియా ఉత్తరప్రాంత నగరం స్టాక్‌టన్‌లోని ఒక రెస్టారెంట్‌లో శనివారం రాత్రి ఒక కుటుంబం కుమార్తె పుట్టినరోజు వేడుకలు చేసుకు ంటుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు కుటుంబ సభ్యులు మరణించారు. మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు అందరూ ఆసుపత్రుల్లో నే తమ ఆత్మీయుల మంచాలకు అతుక్కుపోయి త్వరగా కోలుకోవాలని దేవుడికి ప్రార్థనలు చేస్తున్నారు. ఈ ఘటన కాలిఫోర్నియాను కుదిపివేసి ంది. దుండగులకోసం పోలీసులు వేటాడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆకుటుంబంపై దుండగులు కాల్పులు జరిపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. శాన్‌జోక్విన్ షరీఫ్ కార్యాలయం సమాచార విభాగం అధికారిణి హీదర్ బ్రంట్ మీడియా తో మాట్లాడుతూ, ఈ ఘటన చాలా గంభీరమైనదని పేర్కొంటూ ఈ కేసులో చాలా తక్కువ సమాచారమే లభ్యమైందని, ఇది చాలా లోతైన వ్యవహారమన్నారు. కాలిఫోర్నియాలో ఆయుధాల చట్టం చాలా కఠినంగా ఉంటుందని, కానీ ఇటీవలికాలంలో పరిస్థితులు మారిపోయి కాల్పుల ఘటనలు పెరిగి పెను సవాళ్ళు ఎదురవుతున్నాయని అన్నారు. ఎఆర్–15 వంటి ఎసాల్ట్ రైఫిల్స్‌పై ఉన్న నిషేధాన్ని 2021లో ఫెడరల్ జడ్జి ఒకరు తొలగిస్తూ తీర్పు చెప్పారు. ఆ మరుసటి సంవత్సరంలోనే అమెరికా సుప్రీంకోర్టు వెంట తుపాకులు ఉంచుకోవడానికి సంబంధించిన హక్కులను విస్తరించింది. అప్పటివరకూ ఉన్న పరిమిత హక్కులను తొలగించింది.

# కొనసాగుతున్న 'దిత్వా' బీభత్సం
## ముగ్గురు మృతి, 57వేల హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ భూములు

**చెన్నై:** తమిళనాడులో 'దిత్వా' తుఫాన్ బీభత్సం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని, వర్షాల ధాటికి ముగ్గురు మరణించారని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం తెలిపింది. రానున్న 24 గంటల్లో తుఫాన్ రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతాల తీర ప్రాంతానికి, పొరుగున ఉన్న పుదుచ్చేరి తీరప్రాంతానికి సమాంతరంగా కదులుతుందని వాతావరణ కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలోని కావేరి డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో, రామనాథపురం, నాగపట్నం జిల్లాలపై తీవ్ర ప్రభావం పడింది. తీరప్రాంత పట్టణాలైన రామేశ్వరం, నాగపట్నంలలో భారీ వర్షాలు అనేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంతో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. ప్రాంతీయ వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం తుఫాను 7 కి.మీ వేగంతో దాదాపు ఉత్తరం వైపుకు కదిలింది. ఇది కడలూరుకు తూర్పుఆగ్నేయంగా 100 కి.మీ, కారైకల్‌కు ఈశాన్యంగా 100 కి.మీ, పుదుచ్చేరికి ఆగ్నేయంగా 110 కి.మీ, వేదరనియానికి ఈశాన్యంగా 140 కి.మీ, పుదుచ్చేరికి ఆగ్నేయంగా 160 కి.మీ, చెన్నైకి దక్షిణఆగ్నేయంగా 180 కి.మీ దూరంలో ఉంది. ఉత్తర తమిళనాడుపుదుచ్చేరి తీరాల నుండి తుఫాన్ కేంద్రం కనిష్ట దూరం దాదాపు 70 కి.మీ అని వాతావరణ శాఖ ఆదివారం విడుదల చేసిన బులెటిన్ తెలిపింది. తుఫాన్ ప్రభావం కారణంగా, కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు, కడలూరు, నాగపట్నం, మైలదుత్తురై, విల్లుపురం, చెంగల్పట్టు,



పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూర్, అరియలూర్, పెరంబలూర్, తిరుచిరాపల్లి, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట జిల్లాలు, పుదుచ్చేరి, కారైకల్‌లలో రానున్న 24 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర తీర ప్రాంత తమిళనాడు, పుదుచ్చేరిలలో గంటకు 60–70 కి.మీ నుండి 80 కి.మీ వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశముంది.



సోమవారం ఉదయం నాటికి ఇది క్రమంగా మెరుగుపడి మరింత అల్లకల్లోలంగా మారుతుందని, ఆ తర్వాత క్రమంగా మెరుగుపడుతుందని బులెటిన్ తెలిపింది. జాలర్లు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్‌తో సహా 38 విపత్తు ప్రతిస్పందన బృందాలను సిద్ధంగా ఉంచిందని, శనివారం సాయంత్రం సహాయ, పునరావాస పనులలో ఇతర రాష్ట్రాల నుండి మరో 10 బృందాలు చేరాయని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ మంత్రి కెకెఎస్ ఎస్ఆర్ రామచంద్రన్ తెలిపారు. దిత్వా తుఫాన్ కారణంగా సంభవించిన వర్ష సంబంధిత సంఘటనలలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని ఆయన అన్నారు. డెల్టా జిల్లాల్లో 149 పశువులు చనిపోయాయని, 57,000 హెక్టార్ల వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని, ప్రైవేట్ వాతావరణ సంస్థలు చెప్పగా, మైలదుత్తురై గత 24 గంటల్లో 140–220 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

### తెలంగాణలో వర్షాలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ భారత్ వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతానికి ఇది కారైకల్‌కు 80 కి.మీ., పుదుచ్చేరికి 160 కి.మీ., చెన్నైకి 250 కి.మీ.దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన ఆరు గంటల్లో 5 కి.మీ. వేగంతో ఈ తుపాన్ కదిలింది. రాగల 24 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదిలే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దిత్వా తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

# రాజ్‌భవన్ వద్ద నిరాశ్రయులు నిరసన ప్రదర్శన
## సహాయక శిబిరాల నుంచి తిరిగి తమ ఇళ్లకు వెళ్లనీయాలని డిమాండ్

**ఇంఫాల్ :** మణిపూర్‌లో 2023 మేలో జాతి హింస చెలరేగిన తర్వాత వివిధ సహాయ శిబిరాల్లో ఉంటున్న ప్రజలు తిరిగి తమ ఇళ్లకు వెళ్లనీయాలని రెండు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాజ్ భవన్ సమీపంలో వందలాది మంది నిరాశ్రయులైన ప్రజలు తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. వివిధ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న చురచంద్‌పూర్, కాంగ్‌పోక్పి, ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ తూర్పు జిల్లాల నుండి వచ్చిన నిర్వాసిత ప్రజలు సంగై పర్యాటక ఉత్సవాన్ని బహిష్కరించాలని నినాదాలు చేశారు. తమ ఇళ్లకు తిరిగి రావడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. 'స్థానభ్రంశం చెందిన జీవితాలు ముఖ్యం', 'ప్రజలు సంగై ఉత్సవాన్ని బహిష్కరించారు', 'హక్కులు మొదట పర్యాటకం తర్వాత', 'మా ప్రాథమిక హక్కులను నిర్ధారించండి' వంటి ప్లకార్డులను నిరసనకారులు చేబూని నినాదాలు చేశారు. రాజ్ భవన్‌కు 200 మీటర్ల దూరంలో ఉన్న కాంగ్లా గేట్ సమీపంలో వివిధ సహాయ శిబిరాల నుండి వచ్చిన నిరసనకారులను భద్రతా దళాలు అడ్డుకున్నాయని పోలీసులు తెలిపారు. రాజ్ భవన్ వైపు మరింత ముందుకు సాగకుండా భద్రతా దళాలు ప్రదర్శనకారులను అడ్డుకున్నాయి. దీంతో ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని ఉరిపోక్ ప్రాంతం వైపు ర్యాలీ నిర్వహించారు. చురాచంద్‌పూర్ జిల్లాకు చెందిన నిర్వాసిత వ్యక్తి ఇరోమ్ అబుంగ్ మెయిటీ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పట్ల పెరుగుతున్న నిరాశ కారణంగా స్థానభ్రంశం చెందిన ప్రజలు ఇక్కడ నిరసన ప్రదర్శనకు దిగారని, స్థానభ్రంశం చెందిన వారి దుస్థితిని విస్మరిస్తూ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొంటూ సంగై ఉత్సవం నిర్వహిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో సహాయ శిబిరాలకు తిరిగి వెళ్లకుండా మా నిరసనలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఇరోమ్ అన్నారు. నవంబర్ 21న సంగై ఉత్సవం ప్రారంభమైనప్పటి నుండి అంతర్గతంగా నిరాశ్రయులైన వ్యక్తులు (ఐడిపిలు) తమ ఇళ్లకు తిరిగి రావాలని కోరుతూ భద్రతా దళాలతో అనేకసార్లు ఘర్షణ పడ్డారు.





# సమగ్ర వ్యూహంతో మాదక ద్రవ్యాల నివారణ
## అఖిలభారత డిజిపిల సదస్సులో మోదీ

**రాయ్‌పూర్:** మాదక ద్రవ్యాల మహమ్మారిని నివారించేందుకు ఒక స మగ్ర వ్యూహం అనివార్యంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అ న్నారు. నిషేధిత సంస్థలపై రోజువారీ పర్యవేక్షణ చేయాలన్నారు. రాయ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన పోలీస్ డైరెక్టర్ జనరల్స్, ఇన్స్పెక్టర్ జనరల్స్ 60 వ అఖిలభారత సదస్సులో చివరిరోజు ఆదివారం ప్రధానమంత్రి మాట్లాడుతూ, ప్రజలు చట్టాలకు లోబడి వ్య వహరించేట్టు చూడటం, పునరావాసం, క్షేత్రస్థాయిలో జోక్యం వంటి స మగ్ర వైఖరితో యావత్ ప్రభుత్వయంత్రాంగం అన్ని వైపుల నుండి స్పం దించడం మాదక ద్రవ్యాల నిర్మూలన కు ఎంతో అవసరమన్నారు. పోలీసు పట్ల ప్రజల వైఖరిలో కూడా పరివర్తన తీసుకురావడం ఎంతో అత్యవసరమని అన్నారు. ప్రత్యేకించి యువతరం పోలీసులను చూసే దృక్పథంలో మార్పు తీసుకురావాలన్నారు. ఈ పరివర్తన తీసుకురావాలంటే పోలీసులు వృత్తిపరమైన నైపుణ్యాలను, విలువలను పెంపొందించుకోవాలని, సున్నితత్వాన్ని అలవర్చుకోవాలని, పట్టణ ప్రాంత, పర్యాటక పోలీసింగ్‌ను పటిష్టం చేయాలని కోరారు. వామపక్ష తీవ్రవాదం నుండి విముక్తి చెందిన ప్రాంతాలను సంపూర్ణాభివృద్ధి చేయాలని, కోస్తాతీర ప్రాంతాల భద్రతను అత్యాధునిక ఆదర్శ నమూనాలతో ప టిష్టం చేయాలని కోరారు. జన సంచారం లేని దీవులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్ది సమగ్ర ఆధునిక వ్యూహాలతో తీర్చిద్దిలని కేంద్రపాలిత ప్రాంతాల పోలీసులను కోరారు. పట్టణ ప్రాంతాలలో పోలీసు పర్యవేక్షణను బలోపేతం చేయాలని, పర్యాటక ప్రాంతాలలో పోలీసు యూనిట్ల కు పునరుజ్జీవనం కలిగించాలని, కేంద్రం ప్రభుత్వం ప్రక్షాళన చేసి కొత్తగా ఆమోదించిన భారతీయ న్యాయ సం హిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టాలపట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెం పొందించాలని కోరారు. వలసవాద ప్రభుత్వ హయాంలో రూపొందించి న పౌర చట్టాలను కేంద్రం ప్రక్షాళన చేసింది. 'వికసిత్ భారత్:భద్రతా కో ణాలు' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులు సదస్సుకు హాజరైనవారిలో ఉన్నారు.





# 2080కల్లా భారత్‌లో జనాభా స్థిరీకరణ
## 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్' వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత్‌లో జనాభా పెరుగుదల క్రమంపై కీలక అప్‌డేట్ వచ్చింది. 2080 సంవత్సరం నాటికి 180 కోట్ల నుంచి 190 కోట్ల రేంజులో దేశ జనాభా స్థిరీకరణ జరగొచ్చు. ఈవిషయాన్ని 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్' (ఐఎఎస్‌పి) ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా భారత్‌లో 'మొత్తం సంతానోత్పత్తి రేటు' (టిఎఫ్ఆర్) క్రమంగా తగ్గుతోందని, ఈ అంశం ప్రభావంతోనే 2080 నాటికి జనాభా స్థిరీకరణ జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గానే ఉందని, ఇది 'రీప్లేస్‌మెంట్ లెవల్' 2.1 కంటే తక్కువని ఆయన చెప్పారు. జనాభా పెరుగుదలలో వేగం తగ్గిన తీరుకు ఈ గణాంకాలు నిదర్శనాల లాంటివన్నారు. 2000 సంవత్సరంలో భారత్‌లో 'మొత్తం సంతానోత్పత్తి రేటు' 3.5గా ఉండేదని, ఇప్పుడది కేవలం 1.9 లెవల్‌కు పరిమితమైందని అనిల్ చంద్రన్ పేర్కొన్నారు. టీఎఫ్ఆర్ రేటు భారీగా తగ్గిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు.

**జనాభా పెరుగుదలలో వేగం తగ్గడానికి కారణాలివీ!**

'భారతదేశ జనాభా భవిష్యత్తులో గరిష్ఠంగా 200 కోట్లలోపే ఉంటుందని అంచనాలు చెబుతున్నాయి. ఈ లెక్కన 2080 సంవత్సరం నాటికి 190 కోట్ల రేంజులో మనదేశ జనాభా పెరుగుదల ఆగిపోవచ్చు. దేశ ప్రజల అక్షరాస్యతా స్థాయిలు పెరుగుతున్నాయి. ప్రత్యేకించి మహిళల అక్షరాస్యతా శాతం బాగా పెరిగింది. స్త్రీ, పురుషులు సరిసమానంగా ఆర్థిక అభివృద్ధి, కెరీర్ పురోగతి కోసం పోటీపడుతున్నారు. సంతానం విషయంలో భార్యల అభిప్రాయాలను సానుకూల కోణంలో స్వీకరించే వైఖరి భర్తల్లో ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే వారు కుటుంబ నియంత్రణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గర్భ నిరోధక సాధనాల వినియోగాన్నీ పెంచారు. ఏ వయసులోగా సంతానాన్ని పొందాలి? ఎంతమంది సంతానాన్ని పొందాలి? అనే దానిపై దంపతులు స్పష్టమైన క్లారిటీకి వస్తున్నారు. ఈ కీలక పరిణామాల ప్రభావంతోనే జనాభా పెరుగుదలలో వేగం తగ్గింది. ఫలితంగా చిన్న కుటుంబాల సంఖ్య పెరుగుతోంది' అని ఐఏఎస్‌పీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ తెలిపారు.



**సంతానోత్పత్తి రేటు:** నిరక్షరాస్యులు వర్సెస్ అక్షరాస్యులు 'దేశ అభివృద్ధి రేటుకు పూర్తి వ్యతిరేక దిశలో సంతానోత్పత్తి రేటు ఉంటుంది. నేటికీ భారత్‌లోని నిరక్షరాస్యుల సంతానోత్పత్తి రేటు 3కుపైనే ఉంది. కానీ అక్షరాస్యుల్లో సంతానోత్పత్తి రేటు 1.5 నుంచి 1.8 రేంజుకు పరిమితం కావడం సానుకూల అంశం. ప్రస్తుతం మన దేశంలో 'రీప్లేస్‌మెంట్ లెవల్ ఫెర్టిలిటీ' 2.1గా ఉంది. అంటే ఒక మహిళ సగటున ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలకు జన్మనిస్తోంది. ఒకవేళ సగటు సంతానోత్పత్తి రేటు దీన్ని మించి పెరిగిపోతే జనాభా పెరుగుతున్నట్లుగా భావించాలి. కానీ కేరళలో 1987 1989 సంవత్సరాల వ్యవధిలోనే 'రీప్లేస్‌మెంట్ లెవల్' బాగా తగ్గిపోయి 1.5కు చేరింది. ఆ రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు బాగా తగ్గిపోయిన తీరుకు ఇది నిదర్శనం. బంగాల్‌లోనూ సంతానోత్పత్తి రేటు చాలా వేగంగా తగ్గుతోంది. ఆ రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 2013లో 1.7గా ఉండగా, 2023 నాటికి అది 1.3కు డౌన్ అయింది. అంటే సంతానోత్పత్తి రేటు 18 శాతం తగ్గిపోయింది. ప్రస్తుతం దేశంలోనే అత్యల్ప సంతానోత్పత్తి రేటు బంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉంది. వీటి తర్వాతి స్థానంలో ఢిల్లీ ఉంది' అని అనిల్ చంద్రన్ వివరించారు.

జననాల రేటు తగ్గుతోంది ఆయుర్దాయం పెరుగుతోంది! 'దేశంలో ఓ వైపు జననాల రేటు తగ్గుతుంటే, మరోవైపు ప్రజల ఆయుర్దాయం క్రమంగా పెరుగుతోంది. ఆరోగ్య సంరక్షణ రంగంలో జరుగుతున్న పురోగతుల వల్ల ప్రజల జీవితకాలం పెరుగుతోంది. సగటున 60 ఏళ్లకుపైగా జీవించే వారి సంఖ్య పెరుగుతోంది.. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ యువత వలస బాట పడుతుంటే, ఇళ్లలో ఉండే వయో వృద్ధులను పట్టించుకునే వారు కరువవుతున్నారు. ఈ తరుణంలో వయో వృద్ధుల బాగోగులను చూసుకునే సంరక్షణ కేంద్రాలు పెద్దసంఖ్యలో ఏర్పాటవుతున్నాయి' అని ఐఏఎస్‌పీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ పేర్కొన్నారు.

**1971లో ఐఎఎస్‌పి ఏర్పాటు!**

'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్' (ఐఎఎస్‌పి) అనే సంస్థ 1971 సంవత్సరంలో ఏర్పాటైంది. ఇందులో దాదాపు 1,100 మంది జనాభా శాస్త్రవేత్తలు, డెమోగ్రఫర్లు భాగంగా ఉన్నారు. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ (యూఎన్ఎఫ్‌పీఏ), పాపులేషన్ కౌన్సిల్, పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వంటి సంస్థల సహకారంతో జనాభాతో ముడిపడిన అంశాలపై ఐఏఎస్‌పీ అధ్యయనం చేస్తుంటుంది.

## సిఎంతో విభేదాలు తోసిపుచ్చిన డికె



**బెంగళూరు:** ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో అంతర్గత విభేదాల వార్తలను కర్ణాటక ఉప ముఖ్యమ ంత్రి డి.కె. శివకుమార్ ఆదివారం మరోసారి తోసిపుచ్చారు. నాయకత్వ మార్పులపై గతంలో చెలరేగిన ఊహాగానాల మధ్య తాను ఏఎమ్మెల్యేలను ఢిల్లీకి తీసుకెళ్లలేదని పేర్కొన్నారు. శనివారం, ఇద్దరు నాయకులు అల్పాహార సమావేశం నిర్వహించిన విషయం విదితమే. ఆ తర్వాత వారు ఐక్యంగా ముందుకు వచ్చి తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని ఖండించారు. 'మాకు ఎప్పుడూ అభిప్రాయ భేదాలు లేవు. నేను ఢిల్లీకి వెళ్ళినప్పుడ ల్లా ఒక్క ఎమ్మెల్యేను కూడా తీసుకెళ్లలేదు. కనీసం 10 నుండి 12 మంది ఎమ్మెల్యేలను తీసుకెళ్లేవాడిని. అది ఏ ప్రయోజనాన్ని కలిగించదు' అని శివకుమార్ ఇక్కడ విలేకరులతో అన్నారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తాను పార్టీ సభ్యులందరికీ 'తండ్రి లాంటివాడిని' ఆయన అన్నారు. 'నేను అందరినీ తీసుకెళ్లాలి. 140 మంది ఎమ్మెల్యేలు నాకు ప్రియమైనవారు. నేను ఎప్పుడూ ఎవరితోనూ విభేదించను. నాకు ఎవరితోనూ అభిప్రాయ భేదాలు లేవు' అని డిప్యూటీ సిఎం అన్నారు. 2018 మే నుండి ఒక సంవత్సరం పాటు ముఖ్యమంత్రిగా హెచ్‌డి కుమారస్వామి పదవీకాలంలో ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, 'కాంగ్రెస్, జెడి (ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడటానికి ఇది నాకు, దేవునికి తెలుసు' అని ఆయన అన్నారు

కుమారస్వామి, ఆయన తండ్రి మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డి దేవెగౌడకు కూడా తెలుసునని ఆయన అన్నారు. అధికార పోరు మధ్యలో శివకుమార్ పోప్‌ల మద్దతు కోరారని కుమారస్వామి చేసిన ఆ రోపణకు స్పందిస్తూ, 'నేను ఎప్పుడూ దానిని అడగలేదు. నేను అన్ని కులాలను ప్రేమిస్తున్నాను. సాధువులు నాకు అనుకూల ంగా మా ట్లాడారు.






# లక్ష మెదళ్లను కదిలించిన ఓ వ్యాసం

మతపరమైన లేదా మతాలకు సంబంధించిన రచనలు ఎన్నో వచ్చాయి. వస్తునే ఉన్నాయి. అయితే, దాదాపుగా అన్ని రచనలు ఏదో ఒక బలమైన వాదన పునాదుల మీద ఆధారపడుతున్నాయి. ఒక మతాన్ని కీర్తించడం లేదా విమర్శించడం మినహా, తటస్థంగా ఉండి, మంచీచెడులను విశ్లేషించిన రచనల సంఖ్య చాలా చాలా తక్కువ. అత్యంత అరుదైన అలాంటి పారదర్శక రచనల్లో ప్రపంచ మేటి శాస్త్రవేత్త, రాసిన 'రిలీజియన్ అండ్ సైన్స్' (మతం మరియు విజ్ఞాన శాస్త్రం) వ్యాసం ఒకటి. న్యూయార్క్ టైమ్స్ పత్రికలో 1930 నవంబర్ 9వ తేదీన ప్రచురితమైన ఆ వ్యాసం లక్ష మెదళ్లను కదిలించింది. ఇప్పటికీ ప్రకంపనలు సృష్టిస్తునే ఉంది. మతం, విజ్ఞాన శాస్త్రం మధ్య ఉన్న సంబంధాన్ని, తేడాలను తటస్థంగా వివరించిన విధానం నిత్యనూతనం. ఐన్‌స్టీన్ ప్రకారం, సాధారణంగా మనిషి నైతికతను మాత్రమే ఆధారంగా చేసుకోవడమే జీవన విధానమని అనుకుంటాడు. విజ్ఞాన శాస్త్రం నైతిక విలువలను పట్టించుకోదు. అతి తటస్థం. అందుకే మతం లేదా నైతికత మనిషికి అవసరమవుతుంది. ఐన్‌స్టీన్ మతాన్ని దేవుళ్ల జాబితాగా కాకుండా, మనిషి భయాలనుండి, అర్థం కోసం చేసే ప్రయత్నాలనుండి పుట్టిన భావనగా చూస్తాడు. అందుకే 'మతం' అనే పదాన్ని 'ఆవశ్యకత' అనే విస్తృత అర్థంలో తీసుకోవాలి. మనిషి తన జీవితానికి గౌరవాన్ని కోరుకుంటాడు. ఆ గౌరవాన్ని చెప్పేవే మతపరమైన ఆలోచనలు లేదా నైతిక తత్వాలు. విజ్ఞానశాస్త్రం తార్కికంగా ఆలోచించాలని అంటుంది. అందుకే, ఐన్‌స్టీన్ తన వ్యాసంలో తార్కిక ఆలోచన, మతం, విజ్ఞానం అనే మూడు విభిన్న అంశాల మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని సమీక్షించాడు. ఆయన అభిప్రాయాన్ని అనుసరించి ఇవి మూడు వేర్వేరు శక్తులు అనిపించినా, ఇవన్నీ మనిషి మనుగడను సమతుల్యంగా నిలబెట్టే అంశాలు. విజ్ఞానం మనకు ప్రకృతిని అర్థం చేసుకోవడానికి హేతుబద్ధమైన విషయాలను అందిస్తుంది. మతం లేదా నైతికత మనం ఇతరులతో ఎలా జీవించాలో మార్గనిర్దేశనం చేస్తుంది. తార్కిక ఆలోచన అనేది ఈ రెండింటికి మధ్య మనిషిని తప్పుపట్టకుండా నడిపించే ఒక చెక్‌పాయింట్‌లా ఉంటుంది. తార్కిక ఆలోచన లేని మతం మూర్ఖత్వాన్ని పెంచుతుంది. తార్కిక ఆలోచన లేకుండా విజ్ఞానం కూడా అహంకారంగా మారుతుంది. ఇవన్నీ కలిసినపుడే సమాజం పురోగమన దిశగా సాగుతుంది. ఐన్‌స్టీన్ చెప్పిన ఈ బలమైన విధానాన్ని ఎందుకో సాహితీకారులు విస్మరించారు. కొద్ది మినహాయింపులు ఉన్నప్పటికీ, మతపరమైన అంశాలపై రచయితలు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం మతాన్ని బలంగా విశ్వసిస్తుంది. మత విశ్వాసాలకు కారణాలు వెతుక్కుంటారు. తాము నమ్మిన మతం మాత్రమే పరిపూర్ణమైదని వాదిస్తారు. వారి రచనలు ఆ పరిధిని దాటి ముందుకు వెళ్లవు. ఇక రెండో వర్గం మత విశ్వాసాలను ఖండించేదిగా ఉండాలి. కానీ, ఈ వర్గంలో దాదాపుగా అందరూ ఏదో ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని, పుంఖాను పుంఖాలుగా రాసేస్తుంటారు. వారికి ఏ ఒక్క మతంలో మాత్రమే తప్పులు కనిపిస్తాయి. ఆ ఒక్క మతాన్ని మాత్రమే విమర్శిస్తారు. మిగతా మతాల జోలికి వెళ్లరు. ఎప్పుడో పింగళి ధరశరథ్ రామ్ తన 'ఎన్‌కౌంటర్' పత్రికలో 'బిజెపి వచ్చి ఏం సాధించింది?' అనే ప్రశ్నకు 'ముస్లింలలో ఐక్యత సాధించింది' అంటాడు. ఇది ముమ్మాటికీ నిజం. ఒక మతాన్ని పదేపదే విమర్శించడం వల్ల, ఆ మతవాదులు మరింత బలపడతారు. తటస్థంగా ఉన్న వారు కూడా మతవాద ప్రభావంలోకి వెళ్లిపోతారు. మత ప్రచారకుల కంటే, ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పిస్తూ రచనలు చేసే వారే సమాజానికి మరింత ప్రమాదకారులు.

కాలాతీత రచన..

ఏదిఏమైనా, ఈ రెండు వర్గాలను మించి, తప్పును తప్పుగానూ, ఒప్పును ఒప్పుగానూ చూసే మూడో వర్గం బలపడాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉంది. 95 సంవత్సరాల క్రితం రాసిన ఐన్‌స్టీన్ వ్యాసానికి ఇప్పటికీ విలువ ఉందంటే, ఆయన అనుసరించిన తటస్థ విధానమే. ఆయన మతాన్ని తిట్టలేదు. పొగడలేదు. విమర్శించలేదు. మద్దతు ప్రకటించలేదు. మతం, విజ్ఞాన శాస్త్రం, తార్కిక అవగాహనలను బేరీజు వేసుకుంటూ, వేల సంవత్సరాల ఆధునిక మానవుడి ప్రస్థానంలో ఎదురైన పరిస్థితులను అవగాహనం చేసుకుంటూ ప్రస్తుత తరం ముందుకు వెళ్లాలి. మతపరమైన ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రస్తుత కాలంలో, మతం అనేది ప్రజాస్వామ్యం, శాస్త్రం, మానవహక్కులు, సామాజిక జీవితం అన్నింటి మీద ప్రభావం చూపుతోంది. మతం పేరుతో జరిగే రాజకీయ ధ్రువీకరణ, వైరుధ్యాలు, సాంఘిక అంతరాయాలు పెరిగాయి. మతాన్ని రాజకీయం నుంచి మానవజాతి విఫలమైతే, భవిష్యత్తు చీకటేనని ఐన్‌స్టీన్ ఎప్పుడో చెప్పాడు. ఆ మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయి. పర్యవసనాలు నేడు పతాక శీర్షికన వార్తలుగా, నిజమై కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మతం అంటే సమాజీకరణ అనే విశాల భావనను అలవరచుకోవాలని ఐన్‌స్టీన్ అంటాడు. నైతిక విలువలు, సంఘీభావం, కరుణ ఇవే మతం యొక్క అసలైన లక్షణాలు. దేవుడు ఎవరు? ఏ మతం గొప్పది? అనే చర్చలను అధిగమించాలంటే తార్కిక ఆలోచన తప్పదు. మతపరమైన ఆందోళనలు, హింస, విద్వేషాలు పెచ్చరిల్లుతున్న నేటి కాలంలో ఐన్‌స్టీన్ ఆలోచనా విధానం మరింత కీలకంగా మారింది. ఇప్పుడు మానవ సమాజం ఒకేసారి మూడు దిశల్లో పరుగులు పెడుతోంది. అత్యంత విస్తృతంగా దూసుకెళుతున్న అత్యాధునిక సాంకేతికత ఒకవైపు.. తీవ్ర రూపం దాలుస్తున్న మతపరమైన రాజకీయాలు మరోవైపు.. తాత్కాలిక ఆలోచనా విధానం ఇంకొకవైపు.. వెరసి సమాజం మూడు భిన్నమైన మార్గాలను ఎంచుకున్నట్లు కనిపిస్తున్నది. కానీ, ఐన్‌స్టీన్ చెప్పినట్టు ఈ మూడింటినీ ఒక కోణంలో చూడాలి. తార్కిక ఆలోచనలకు ఎదురవుతున్న కొత్తరకమైన ప్రమాదాల నేపథ్యంలో, సమకాలీన సాహిత్యం మరింత హేతుబద్ధంగా ముందుకు సాగాలి. ఒక రకంగా, సామాజిక జీవితం, ప్రజాస్వామ్య ప్రక్రియలు, మీడియా సంస్కృతి అనే మూడు శక్తుల ఒత్తిడి మధ్య సాహిత్యం ప్రస్థానం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఐన్‌స్టీన్ వ్యాసం, మరింత సమకాలీనతను సంతరించుకుంది. నేటి సమాజానికి, సాహిత్య పరిస్థితులకు అతికినట్టు సరిపోయే ఐన్‌స్టీన్ వ్యాసం, ఆయన దార్శకతకు నిదర్శనం.





Science and Religion

Albert Einstein

Certainly no one in 1879 in Ulm, Germany, could have guessed that one of their own born that year would someday receive global praise for his undisputed genius, meriting recently the coveted title "person of the century" (Time magazine). Likewise, international fame was probably not what Albert Einstein himself anticipated in 1895 when he failed the entrance exam for the Federal Polytechnical Institute in Zurich, Switzerland. Even as he worked and was being promoted at the Swiss Patent Office in Bern, Switzerland (1902–09), Einstein was far from becoming a household name, let alone the most renowned Nobel Prize winner in physics, which he received in 1921 not for his special theory of relativity (of $E=MC^2$ fame) that inaugurated the atomic age in 1905, but for his discovery of the photoelectric effect (the hypothesis he proposed also in 1905 that electromagnetic radiation interacts with matter as if the radiation had a granular structure or particles).

Shortly thereafter, when Einstein's reputation in academia waxed toward worldwide celebrity, no one could have presaged that in 1952 the newly established state of Israel would offer him the presidency, which he declined. That invitation, however, points out that he was not only perpetually engaged in the subtle mysteries of the universe but also as outspoken in the political arena as a Zionist who detested the Nazis' rise to power, as a prophet who insisted that Jews make peace with Arabs, and as a pacifist, who, in his famous letter to President Roosevelt (1939), warned against the potential abuses of atomic energy, despite his support for the development of the A-bomb. Even days before his death on April 18, 1955, he wrote his last signed letter to the philosopher Bertrand Russell expressing his intention to sign a joint manifesto insisting that all nations renounce nuclear weapons. By then his brilliant mark on human history was as unquestionable as his unkempt hair was uniquely recognizable.

It is this larger-than-life Einstein who wrote the following essay on the proper relationship between science and religion, part one in 1939 and part two in 1941. It is also here in the latter part of the essay that we find his often quoted dictum, "Science without religion is lame, religion without science is blind." He wrote "Science and Religion" as a contribution to a symposium held in New York in 1941 on what roles science, philosophy, and religion played in the cause of American democracy. Thus, the essay recommends itself to the multi-disciplinary approach that inquiry takes within the liberal arts program at Westminster.

ఐన్‌స్టీన్‌ను అనుసరించి విజ్ఞానం అనేది విశ్వం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకునేందుకు మనిషి చేసే ప్రయత్నం. మనిషి తార్కిక బుద్ధితో గమనించే ప్రపంచం, నియమబద్ధతల సమాహారంగా ఉంటుంది. మనం ఎగరడానికి విమానం, ఆలోచన కోసం ఇంటర్నెట్, మనుగడ కోసం మందులు ఉపయోగిస్తున్నాం. ఇవి అన్నీ విజ్ఞాన సూత్రాలఫలితాలు. అయితే, నేటి యువత, రాజకీయ వ్యవస్థలు, విద్యాపద్ధతులు విజ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపించినా, శాస్త్రీయ భావనకు మద్దతు తగ్గిపోతున్న సంకేతాలు ప్రపంచవ్యాప్తంగా కనబడుతున్నాయి. కుట్ర సిద్ధాంతాలకు పెరుగుతున్న ఆదరణ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. శాస్త్రీయ వాస్తవాలను తిరస్కరించడం.. ఒకవైపు టెక్నాలజీని వినియోగిస్తూనే మరోవైపు విజ్ఞానాన్ని ద్వేషించే విచిత్ర ప్రవర్తన తదితర పరిణామాలు తార్కిక ఆలోచన హరించుకుపోతున్నదనడానికి సంకేతాలు. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా, విజ్ఞానం మతమో, సంప్రదాయమో కాదని, అది పరిశీలన ద్వారా ఏర్పడే అర్థమని గ్రహించినప్పుడే, ప్రగతిశీల ఆలోచనలు సాధ్యమవుతాయి. ఈ అర్థమే మనిషిని బంధనాల నుంచి విముక్తి చేస్తుంది. విజ్ఞానం మనకు ఎలా జీవించాలో చెప్తుంది, కానీ ఎందుకు జీవించాలో చెప్పదంటాడు ఐన్‌స్టీన్. ఈ రెండు ప్రశ్నలకు సమాధానాన్ని వెతికినప్పుడే సరైన మార్గంలో అడుగులు పడతాయని తన వ్యాసంలో తేల్చిచెప్పాడు. ఐన్‌స్టీన్ అభిప్రాయాలు, ఆలోచనలు నేటి సమాజానికి కూడా వర్తిస్తున్నాయి. ప్రయోజనకరమైన సమాచారం ఎక్కడ ఉందో.. అబద్ధం ఎక్కడ ఉందో గుర్తుపట్టే శక్తి చాలా మందిలో తగ్గుతున్న పరిస్థితి శాస్త్రీయ తెలిసినవారికే కాదు, ప్రజాస్వామ్యాలకు కూడా ప్రమాదకరమని ఐన్‌స్టీన్ హెచ్చరిస్తాడు. మానవ మూర్ఖత్వం అనంతమైనదని వ్యాఖ్యానిస్తాడు. ఇది వినడానికి కొంత కఠినంగా ఉన్నప్పటికీ, తిరుగులేని వాస్తవం. విజ్ఞానాన్ని అర్థం చేసుకోవడం, పరీక్షించడం, తార్కికంగా విచారించడం ప్రతి పౌరుడి బాధ్యత అంటాడు ఐన్‌స్టీన్. ఆ బాధ్యతను విస్మరించడం వల్లే శాస్త్రం పట్ల శత్రుత్వం పెరుగుతున్న వైనాన్ని మనం ప్రత్యక్షంగా చూస్తునే ఉన్నాం. మన సహజ ప్రశ్నించే శక్తిని కదిలించకుండా భ్రమల్ని నిజాలు అనిపించడం చాలా సులభమైంది.

తార్కిక ఆలోచన లేకుంటే ప్రజలు నిరంతరం భ్రమలకు బలి అవుతునే ఉంటారు. రాజకీయ వంచనకు బలవుతునే ఉంటారు. మత మౌఢ్యం జీర్ణించుకొనిపోవడంతో, శాస్త్రం పట్ల ద్వేషాన్ని పెంచుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో 'తార్కిక ఆలోచన మనిషి స్వేచ్ఛకు పునాది' అంటూ ఐన్‌స్టీ చేసిన వ్యాఖ్యను మరోసారి గుర్తు చేసుకోవాలి. నేటి రచయితలు ఇలాంటి కీలక అంశాలపై దృష్టిసారించాలి. ఎందుకంటే, సాహిత్యం ఒక మానసిక రక్షక కవచం. అది మాటలతో చేసే సామాజిక సేవ. మతం, విజ్ఞానం, తాత్వికతల మధ్య మనిషి పడే దౌర్భాగ్యాలను విశ్లేషించడానికి సాహి త్యం ప్రత్యేకమైన సామర్థ్యం కలిగినది. 'మనిషి ఏ దిశలో తప్పిపోతున్నాడో చూపించడం.. తిరిగి దారిలోకి తెచ్చేందుకు ప్రశ్నలు వేయడం' అనే లక్షణాలను ఐన్‌స్టీన్ వ్యాసం నుంచి నేటి సాహిత్యం నేర్చుకోవాలి. మతం, శాస్త్రం మధ్య సంఘర్షణను అర్థం చేసుకునే సాహిత్యం నేటి అవసరం. ఇప్పటి సాహిత్యం తరచుగా ఒకవైపు మొగ్గు చూపడం ఆందోళన కలిగించే అంశం. ఒక వర్గాన్ని దూషించడం, మరొక వర్గాన్ని కీర్తించడం వంటి అతి ధోరణులు పెరిగాయి. ఈ పరిణామాలు సహజంగానే సాహిత్య విలువలను తగ్గిస్తాయి. కాబట్టి, సాహిత్యం అనేది మతం యొక్క సామాజిక పాత్రను విమర్శాత్మకంగా అధ్యయనం చేయాలి. శాస్త్రం వల్ల వచ్చిన మార్పులను పరిశీలించాలి. రెండింటి పరిమితులను వివరించాలి. వీటితోపాటు మూడవ శక్తిగా తార్కిక ఆలోచనా ప్రాముఖ్యతను వివరించాలి. పశ్నలు అడగడాన్ని ప్రమాదకరంగా చూస్తున్న ప్రస్తుత సమాజంలో, తార్కికతను ప్రజల్లో నింపే సాహిత్యం అవసరం. ప్రశ్నించే గుణం మృగ్యమైనప్పుడు పురోగతి శూన్యమవుతుంది. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచడానికి సాహిత్యం ఒక మెరుగైన మాధ్యమం. దీని ద్వారానే ప్రజల్లో విమర్శనాత్మక దృష్టిని పెంచడం సాధ్యమవుతుంది. నిబద్ధతతో చేసిన రచనలు గొప్ప విలువలతో వర్ధిల్లుతాయి. కలకాలం మార్గదర్శకాలుగా నిలుస్తాయి. కాలాతీత రచనలుగా వెలుగొందుతాయి. ఐన్‌స్టీన్ రాసిన 'సైన్స్ అండ్ రిలిజయన్' కూడా అలాంటి రచనే. ఆ తరహా రచనలు నేటి అవసరం.

– సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

## గొప్ప చారిత్రక నవల 'కోర్స్ ఓవర్ గ్రౌండ్'




బిల్ సి.విల్సన్ రాసిన 'కోర్స్ ఓవర్ గ్రౌండ్' ఆయన తొలి నవల అయినప్పటికీ, రచనా నైపుణ్యంలో ఏ మాత్రం కొత్తగానో, అనుభవరహితంగానో అనిపించదు. 2024 'ఇన్క్ ఆఫ్ ఏజెస్' ఫిక్షన్ విభాగంలో ఈ నవలకు మూడో బహుమతి దక్కింది. ఈ చారిత్రక నవల అమెరికా అంతర్యుద్ధం కాలం నాటి మొబైల్, అలబామాలో సాగుతుంది. కథా వేగం, పాత్రల నిర్మాణం, సంభాషణలను సమతూకంగా మేళవించిన ఈ రచన అన్ని వయసుల పాఠకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. చారిత్రక సందర్భంలో కథను సజీవంగా చెప్పడం సులభమైన పని కాదు. మంచి కథకుడిగా ఉన్నత ప్రమాణాలు పాటించడమే కాకుండా, ఆ కాలపు చరిత్ర, సంస్కృతి, వాతావరణాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. విల్సన్ ఈ రెండు బాధ్యతలను అద్భుతంగా నిర్వర్తించాడు. కథ, పాత్రలు, సంభాషణ వంటి కీలక అంశాలపై పట్టును ఎక్కడా సడలనీయలేదు. ముఖ్యంగా సముద్రయాన, నౌకానిర్మాణ విషయాల్లో ఆయనకు ఉన్న అనుభవం కథను మరింత వాస్తవికంగా మారుస్తుంది. కథ విషయానికి వస్తే, ఇది 1863 ఆగస్టులో ప్రారంభమవుతుంది. అది అమెరికా అంతర్యుద్ధం ఉధృతంగా నడుస్తున్న కాలం. కాన్ఫెడరసీ పక్షం యుద్ధంలో చిక్కుల్లో పడిన సమయం. గెటీస్‌బర్గ్ యుద్ధంలో లీ సైన్యం ఓడిపోతుంది. విక్స్‌బర్గ్ పతనమవుతుంది. యూనియన్ నేవీ దక్షిణ తీరమంతా నిషేధం విధించి, వాణిజ్య మార్గాలను మూసివేస్తుంది. ఈ నిర్బంధం ప్రభావం మొబైల్ నగరానికి తీవ్రంగా పడుతుంది. కాగా, కథానాయకుడు అలన్ చాంబర్స్ ఒక కుటుంబస్ఫూర్తి కలిగిన నౌకా నిర్మాణ నిపుణుడు. తన యజమాని సూచన మేరకు ప్రమాదకరమైన బ్లాకేడ్ రన్నింగ్‌కు సిద్ధపడతాడు. నౌకను గ్లాస్గోకి తీసుకెళ్లి అమ్మి, తిరిగి అవసరమైన సరుకులతో రావడం ద్వారా తన జీవనోపాధిని రక్షించుకోవాలనేదే అతని లక్ష్యం. కానీ తెలియకుండా అతను మరింత చీకటి కుట్రకు గురవుతాడు. సముద్రపు ప్రమాదాలు, యుద్ధపు ఒత్తిడులు, తన కుమార్తె భవిష్యత్తు వంటి అంశాలు ఈ కథకు మరింత ప్రత్యేకతను చేకూర్చాయి. నవల రాయడానికి ముందు విల్సన్ అమెరికా అంతర్యుద్ధ కాలాన్ని, అప్పుడు చోటు చేసుకున్న వివిధ ఘటనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్టు కనిపిస్తుంది. అందుకే, 1500కు పైగా బ్లాకేడ్ రన్నర్లు యుద్ధంలో చనిపోయి లేదా పట్టుబడిన చారిత్రక వాస్తవాలను కథలో చక్కగా పొందుపరిచగలిగాడు. రచయితకు ఉన్న నౌకాయాత్ర అనుభవం వల్ల సముద్ర ప్రయాణం, నౌకను నడిపించడం వంటి అంశాలు సజీవ రూపాన్ని సంతరించుకున్నట్టు కనిపిస్తుంది. కథ చివరి భాగం ప్రత్యేకంగా ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఈ పుస్తకాన్ని చదవడం ఒకసారి ప్రారంభిస్తే వదలడం కష్టం. అలన్ చాంబర్స్‌ఐ అతని కుమార్తె జోసెఫిన్ మధ్య ఉన్న కుటుంబ బంధం కథకు భావోద్వేగ బలం ఇస్తుంది. అందుకే, 'కోర్స్ ఓవర్ గ్రౌండ్' ఒక అద్భుతమైన నవలగా గుర్తింపు సంపాదించింది. చారిత్రక ఫిక్షన్ ప్రేమికులు లేదా అమెరికా సివిల్ వార్ నేపథ్యంపై ఆసక్తి ఉన్నవారు లేదా మంచి కథ కోసం వెతికేవారు తప్పక చదవాల్సిన పుస్తకం.

## అగ్ని జ్వాలలు ఎగసిపడినా..



యుద్ధాలు ప్రాణ, ఆస్తి నష్టాలను కలిగించడమే మాత్రమేకాదు... చరిత్రను కూడా హరించాయి. ఒకప్పుడు మెసొపొటేమియా (నేటి ఇరాక్ ప్రాంతం) సామ్రాజ్యంలో 'సాహిత్య భాండాగారం'గా విరాజిల్లిన నినేవె గ్రంథాలయం కూడా ఇలాంటి యుద్ధాల కారణంగానే ధ్వంసమైంది. అగ్నికి ఆహుతైంది. అయినప్పటికీ, కొంత భావం ఇప్పటికీ గత చరిత్ర వైభవంగా నిలిచే ఉంది. ప్రాచీన ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన గ్రంథాలయాల్లో ఒకటి. దీనిని 7వ శతాబ్దంలో న్యూఅస్సిరియన్ రాజు అశురబనిపాల్ నిర్మించాడు. ఈ గ్రంథాలయంలో 30,000కి పైగా మట్టి పలకలు (క్లే టాబ్లెట్లు) ఉండేవి. వీటిపై క్యూనీఫార్మ్ లిపిలో, చరిత్ర, చట్టం, విజ్ఞానం, సాహిత్యం వంటి విభిన్న విషయాలకు సంబంధించిన అంశాలు నిక్షిప్తమై ఉండేవి. ముఖ్యంగా మొటిగా గిల్గమేష్ మహాకావ్యం వంటి ప్రసిద్ధ రచనలు ఇందులో ఉండేవి. అశురబనిపాల్ గ్రంథాలయం శ్రేణి క్రమబద్ధీకరించి మెసోపొటామియా సంస్కృతి, జ్ఞానాన్ని సంరక్షించే విధంగా దీనిని రూపొందించారు. అందుకే ఇది చరిత్రకారులు, పండితులకు అద్భుతమైన సంపదగా నిలిచింది. అయితే, క్రీస్తుపూర్వం 612లో మెడ్స్, బాబిలోన్లు, స్కెథియన్ల దాడి చేసినప్పుడు నినేవె నగరం ధ్వంసమైంది. పలు సందర్భాల్లో శత్రువులు దీనిని అగ్నికి ఆహుతి చేశారు. అయితే, పాత మట్టి పలకలు మంటలకు మరింత దృఢంగా మారాయి. ఈ కారణంగానే ఆధునిక పురావస్తు పరిశోధకులు ఈ పురాతన పాఠ్యాలను సేకరించి అధ్యయనం చేయగలుగుతున్నారు. దీనివల్ల మెసోపొటామియా చరిత్ర, సంస్కృతి గురించి అమూల్యమైన సూచనలు లభించాయి.


## నాటక రచనల్లో మేటి ఆస్కార్ వైల్డ్



ఆంగ్ల నాటక రచయితల్లో అగ్రస్థానాన్ని ఆక్రమించే కొద్ది మంది ప్రముఖుల జాబితాలోకి వస్తాడు ఆస్కార్ వైల్డ్. ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో 1854 అక్టోబర్ 16న జన్మించిన వైల్డ్ తల్లిదండ్రులు విద్యాధికులు కావడంతో, చిన్నతనం నుంచే సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నాడు. తండ్రి సర్ విలియమ్ వైల్డ్ ఐర్లాండ్‌లోనే పేరొందిన కన్ను, చెవి వ్యాధుల స్పెషలిస్టు. వైద్య రంగానికి చేసిన సేవలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం 1864లో ఆయనకు 'సర్' బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన పురావస్తు శాస్త్రం, జానపద కళలపై కొన్ని పుస్తకాలు రాసి, రచయితగా కూడా తనను తాను నిరూపించుకున్నాడు. వైల్డ్ తల్లి జేన్ ఫ్రాంకెస్కా ఆ కాలంలో మంచి రచయిత్రిగా పేరు సంపాదించుకుంది. అంతేగాక ఆమె యంగ్ ఐర్లాండర్స్ అనే విప్లవ సంస్థకు రచనలు చేసింది. జీవితాంతం ఐరిష్ జాతీయురాలిగానే గడిపింది. డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజీ వెనుకగల లింకన్ ప్లేస్‌లో విలియమ్ ఒక డిస్పెన్సరీని నడుపుతూ, పేదలకు ఉచిత సేవలు అందించేవాడు. తల్లిదండ్రుల నుంచి సమాజ సేవ వైల్డ్‌కు వారసత్వంగా సంక్రమించింది. తల్లిని స్ఫూర్తిగా తీసుకొని రచనా వ్యాసాంగాన్ని కొనసాగించాడు. నవలలు, కథలు, కవితలు కూడా రాసేవాడు. అయితే, వైల్డ్ నాటకాలు జగత్ ప్రసిద్ధి పొందాయి. 'ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్', 'ది పిక్చర్ ఆఫ్ డార్సియన్ గ్రే' వంటి రచనలు ఆయనకు ఆంగ్ల సాహితీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించిపెట్టాయి. 1900, నవంబర్ 30న తన 44వ ఏట తుదిశ్వాస విడిచిన వైల్డ్, జీవితాంతం నిజాయితీగా బతికాడు. అద్భుతమైన రచనా పాటవాన్ని ప్రదర్శించడంతో, ఆయనకు వేల సంఖ్యలో అభిమానులయ్యారు. సమకాలీన రచయితల్లో అగ్రగణ్యుడిగా కీర్తి గడించిన వైల్డ్ రచనలు అప్పట్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. అతను సృష్టించిన పాత్రలు, కథనంలో అవి ఇమిడిపోయిన వైన్యం భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఇంగ్లీషులోనే గాక, ఫ్రెంచ్‌లోనూ వైల్డ్ పలు రచనలు చేశాడు. భార్య కాన్‌స్టన్స్ లాయిడ్, పిల్లలు సిరిల్ హాలాండ్, వైవయాన్ హాలాండ్‌తో చక్కని జీవితాన్ని గడిపాడు.

(నవంబర్ 30న వర్ధంతి)

## అనుభవాలను రంగరించిన రచనలు..




శామ్యూల్ లాంగార్న్ క్లెమెన్స్ అంటే చాలా మందికి తెలియకపోవచ్చు... కానీ, మార్క్ ట్వెయిన్ అంటే ఇట్టే గుర్తుపడతారు. 'టామ్ సాయర్ సాహసయాత్రలు' (ది అడ్వంచర్స్ ఆఫ్ టామ్ సాయర్), హికల్బెరీ ఫిన్ సాహసయాత్రలు (ది ఎడ్వంచర్స్ ఆఫ్ హిక్బెరీ ఫిన్), 'రాజు పేద' (ది ప్రిన్స్ అండ్ పాపర్) వంటి రచనలతో ప్రపంచ ప్రఖ్యాతి ఆర్జించాడు. శామ్యూల్ కలం పేరు 'మార్క్ ట్వెయిన్' వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. అప్పట్లో పడవ ముందుకు వెళ్లేందుకు సరిపడ లోతు ఉందో లేదో చెప్పడానికి, కర్రతో నీటిని కొలిచేవారు. నీరు తగినంత ఉంటే, 'బై ది మార్క్, ట్వయిన్' అని అరిచేవారు. అంటే, ట్వెయిన్ (12 అడుగులు) కంటే ఎక్కువగానే ఉందని అర్థం. ఆ వాక్యంలోని మార్క్ ట్వెయిన్‌ను శామ్యూల్ తన కలం పేరుగా మార్చుకున్నాడు. అతని రచనలన్నీ అనుభవాల ఆధారంగా చేసినవే. అందుకే అవి అంతగా పాఠకుల మనసుల్లోకి వెళ్లిపోయాయి. 1835, నవంబర్ 30న, జాన్ మార్షల్, జన్నే లాప్టన్ క్లెమెంట్స్ దంపతులకు ఆరో సంతానంగా జన్మించిన శామ్యూల్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో పేదరికాన్ని అనుభవించాడు. కొంతకాలం ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేశాడు. అక్కడ ఇమడలేక దేశ దిమ్మరిలా న్యూయార్క్, ఫిలడేల్ఫియా తదితర ప్రాంతాల్లో కొంతకాలం పని చేశాడు. చివరికి మిసిస్సిపీ నదిపై తిరిగే పడవ కళాసీగా చేరాడు. అక్కడే ఎక్కువ కాలం పనిచేసి, సరంగుగా ఎదిగాడు. సాహిత్యం పట్ల ఉన్న అభిమానం అతనిని రచయితగా మార్చింది. చిన్నతనంలో తమ ఇంట్లో నీగ్రోలు పనిచేయడం, వారు ఎన్నో కష్టాలు పడడం అతనికి తెలుసు. ఆ అనుభవాలే అతని రచనల్లో పాత్రలుగా కనిపిస్తాయి. కళాసీగా తన అనుభవానికి ఊహను జోడించి, 'టామ్‌సాయర్' వంటి అద్భుతమైన పాత్రను సృష్టించాడు. 1910 ఏప్రిల్ 21న భౌతికంగా దూరమయ్యాడు. రచనల రూపంలో మాత్రం మన మధ్యే ఉన్నాడు.

(నవంబర్ 30న జయంతి)

ఈ వారం కవితలు

## ఆశ

ఆశ హనుమంతుని తోక
అంతకంతకూ పెరిగే కోరిక
అభిలాష హద్దు మీరక
అందుకుంటావా నిరాశ పడక !
ఆశ ఆశల సౌధానికి ఊతం
కన్న కలల సాకార రాతం
ఆశ జీవికి ఉద్దీపనం
జీవన యానానికి ఇంధనం !
పగలు రేయిలు ఉన్న పుడమిపై
ఆశల గూటిలో జీవి భ్రమరమై
ఆశయాల మకరందం కూడబెట్టి
ఆశలలో తేలి తెల్లారి పోతుంది!
గూడు విడిచి మేతకు వెళ్ళిన పక్షి
కోటి ఆశల గూడు క్షేమమే తలుస్తది
ఆశల అంతరంగం తలచినదే
సంభవించాలని సదా తలపోస్తుంది!
ఆశ అంటే తెలియనిది
రేపు నెరవేరాలనుకునేది
ఆశ లేకుంటే ఈ రోజులోనే వుంటం




ఆశ ఎందుకో బ్రతుకుమని మిడుకు తది!
ఎన్ని అరణ్య వాసాలు
ఎన్ని అజ్ఞాత వాసాలు చేసిన
రేపటి తీపి ఆశల
నవోదయం కొరకే గదా!

– పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

## ఇన్ బిల్ట్... ట్రూ

నిజం అబద్ధం
ఒకే మూసలో కరుగుతున్నప్పుడు
వేరు వేరు చేయలేక
కాలం కంటతడి పెడుతుంది
అక్కడెక్కడో నిజం గుప్పుమంటే ఆశ్చర్యం

నిజాన్ని నిర్ధారణ చేయటానికి
కొలమానాలు.. దృశ్యమానాలు లేని చోట
అబద్ధమే రాజ్యమేలుతోంది
నిజాన్ని కాలం కొయ్యకు తగిలేసి
అబద్ధాల ముసుగును కప్పుకుని
ఎంతకాలం ప్రయాణం
మనస్సాక్షి నిన్ను పొడుస్తున్నంత కాలం
నువ్వు జీవచ్ఛవమే కదా..

రుజుమార్గం అనుసరిస్తేనే కదా
వెలుగు బాటలు తోడయ్యేది
సత్యవాక్కులు మోస్తేనే కదా
హృదయం పునీత మయ్యేది
అబద్ధాలతో చిల్లులు పడ్డ దేహం
అమృత స్మృతులను దాచుకోలేదు
ఒలికిపోతున్న నమ్మకాల ప్రాణదారను
ఏ కవచాలు అడ్డుకోలేవు

చినుకు చినుకు పుడమిని ముద్దాడుతేనే
మొలకల నవ్వులతో నేలతల్లి పులకించేది
దేహమైనా నేలైనా నిజం అనే
పచ్చదనం పోగుచేసుకుంటేనే
పదికాలాలు పరిఢవిల్లేది

నిత్యం నువ్వు గాయపడితే పడ్డావుగానీ
నిజాన్ని మ్యూజియంలో పెట్టి
తీక్షణంగా చూసి వెళ్ళిపోకు
దాన్ని నీలో ఇన్‌బిల్ట్ చేసుకో...!

– డా.కటుకోఝ్వల రమేష్
9949083327

## ప్రకృతి సౌందర్యం



వృక్ష సమూహాల కలయికతో ప్రకృతి
పచ్చని ఆకుల రెపరెపలతో ఆహ్లాదమై
కనుల విందుగా దర్శనమిస్తుంది
మంచు ముత్యాలతో చెట్ల పత్రాలు
వజ్రాలుగా వెలిగిపోతూ ఊగుతుంటే
అవని మాత పులకించి పరవశిస్తుంది
ప్రకృతి సేద్యంతో పంట పొలాలు
ఏపెత్తుగా పెరిగి ఊగిసలాడుతుంటే
కల్పతరువు రమ్యమై దేదీప్యమౌతుంది
చిరునగవుల వలే విరబూసిన పువ్వులు
పరిమళభరితమై వికసించి పోతుంటే
భూమి సుభిక్షమై అలరారుతుంది
ప్రకృతి సౌందర్యంతో చుట్టూ ప్రాంతం
వనాల మెరుపులతో కాంతివంతమౌతుంది
చెట్లను సంరక్షించే ప్రతి కర్తవ్యానికి
చేయూతనిచ్చే మనిషి ఉన్నంత కాలం
ప్రకృతి రమణీయత పెరిగిపోతుంది
వనాల రక్షణే మానవాళి భవిష్యత్తుకు
పురోగతి సంపూర్ణమై తొనికిసలాడుతుంది

– నరెద్దుల రాజారెడ్డి
9666016636

## మూడవ వార్డు సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ బంగ్లా మున్సిపాలిటీ 3వ వార్డులో గత కొన్ని రోజులుగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి రషీద్ తెలిపారు. పట్టణంలోని మూడవ వార్డులో వీధి దీపాలు పనిచేయకపోవడం వల్ల రాత్రి సమయంలో రాకపోకలు కష్టంగా మారాయని మహిళలు, విద్యార్థులు, వృద్ధులు భయంతో బయటికి రావాల్సి వస్తోంది ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సానిటేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, పేరుకుపోయిన చెత్తను సకాలంలో తీసుకెళ్లకపోవడం, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసనతో పాటు దోమలు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి అన్నారు. ఈ సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫోన్ చేసి, విన్నపం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సిబ్బంది ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం చాలా బాధాకరం అని అన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు సరి చేయాలని కోరారు.

## మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన వెంకట్రామ్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇటీవల హనుమకొండ జిల్లా నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదివారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి అందరి నాయకుల్ని కలవటం పత్రికల్లో చూశానని.. ఇది మంచి శుభ సూచికమని అభినందించారు. అలాగే పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చెరవేయాలని, ఇప్పు జరగబోయే, భవిష్యత్తులో జరగబోయే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరెలా కార్యాచరణ తయారుచేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లా యంత్రాంగం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కావున ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ కార్యాలయానికి రావొద్దని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు మోడల్ కోడ్ అమలులో ఉంటుందని, అప్పటి వరకు ప్రజావాణి రద్దు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు.

### ములుగులో

**ప్రజాపక్షం/ములుగు:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరుగుతుందని, గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

### వరంగల్‌లో

**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లా లో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరుగుతున్నదని, స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

### జనగామలో

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** 2వ సాధారణ పంచాయితి ఎన్నికలు 2025 నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని దరఖాస్తు దారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

## ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి: ఎస్పి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** రెండో విడత నామినేషన్‌లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను ప్రత్యక్షంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పర్యటించారు. స్థానిక సంస్థల ఎన్నికల రెండో విడత నామినేషన్ల నేపథ్యంలో, భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగే గ్రామ పంచాయతీ, చిట్యాల గ్రామపంచాయతీ టేగామపంచాయతీ మండలంలోని వెలిశాల, గర్మిళ్లపల్లి గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించబడిన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు విధులు, సిబ్బంది నిర్వహణను సమీక్షించి అవసరమైన సూచనలు అందించారు. తనిఖీల సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల వాతావరణం, వారి అంచనాలు, పోలీస్ శాఖ నుండి ప్రజలకు అవసరమైన సేవలు వంటి అంశాలను తెలుసుకున్నారు. ప్రజలు ప్రశాంతంగా, భయభ్రాంతులకు లోనుకాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సంపూర్ణ భద్రతా వాతావరణం కల్పించడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. నామినేషన్ కేంద్రాల్లో సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ శాంతిభద్రతలను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని విధుల్లో నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ సాఫీగా, ఏవిధమైన పరిస్థితులు తలెత్తకుండా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల కాలమంతా ప్రజా భద్రత, శాంతిసమాధానాల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ చేస్తుందన్నారు.

## ప్రజల మాటను పద్యంలో చూపిన మహా కవి గురజాడ: చెన్న కేశవులు

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలుగు సాహిత్యాన్ని ప్రజల హృదయాలకు దగ్గర చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని ఏఐటియూసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నెక్కొండ మండల సిపిఐ కార్యదర్శి కనిక చెన్న కేశవులు అన్నారు. ఆయన వర్థంతి సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశమంటే మట్టికాదు,..దేశమంటే మనుషులే అన్న ఆయన మహోదపదేశం ఈ రోజు ప్రజాస్వామ్యానికి అద్దం పడుతుందన్నారు. గురజాడ రచనలు కేవలం పద్యాలే కాదు ప్రజల శ్వాస, సమాజం ఎదుర్కొనే సమస్యల ప్రతిబింబమని, ఆయన చెప్పిన కాలం మారినా, విలువలు మారకూడదు, ప్రజలే ప్రధానులు అన్న సందేశం ఇప్పటికి తెలంగాణ ప్రజలకు మార్గదర్శకమని, సిపిఐ కూడా ఇదే తత్వాన్ని నమ్ముతుందని, ప్రజల అభిరుచి, ఆకాంక్షలు, సమస్యలు అనేవే పాలకుల దిక్సూచి కావాలని గురజాడ అప్పటికే చెప్పారు. గురజాడ స్ఫూర్తి ఒక రాజకీయానికి కాదు, ప్రజలకేనని, ప్రజల కోసం పనిచేసే ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తకు ఆయన మాటలు మారదర్శకాలని, సాహిత్యం సమాజానికి సేవ చేయాలన్న గురజాడ వాక్యం ఈ రోజు పాలు ప్రజలకే సేవ చేయాలనే ప్రజాపక్షం భావజాలంగా ప్రతిధ్వనిస్తోందన్నారు. గురజాడ వర్థంతి సందర్భంగా ఆయనకు శిరసు వంచి నివాళులు అర్పించారు.

## మహబూబాబాద్‌లో 155 మంది సర్పంచ్ ఎన్నికలకు 1239 నామినేషన్లు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ నియోజవకర్గంలోని గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, మహబూబాబాద్, నెల్లికుదురు 5మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల గడువు పూర్తియింది. మొత్తం 155 గ్రామ సర్పంచ్‌లకు గాను 1239 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. అలాగే 1338 వార్డులకు గాను 3496 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు 41 సర్పంచ్‌లకు గాను 329నామినేషన్లు, 324వార్డులకు 1048 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఇనుగుర్తి 13సర్పంచ్‌లకు 109 నామినేషన్లు,112వారులకు 296 నామినేషన్లు, కేసముద్రం 29సర్పంచ్‌లకు 233 నామినేషన్లు 254 వార్డులకు 658నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే మహబూబాబాద్ 41సర్పంచ్‌లకు 310 నామినేషన్లు 338 వార్డులకు 844 నామినేషన్లు, నెల్లికుదురు 31సర్పంచ్‌లకు 255నామినేషను 280వార్డులకు గాను 650నామినేషన్లు దాఖలయ్యాయి.

# పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు

### ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్



**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ మండలంలోని భార్గవ్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటినుంచి పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు లభిస్తాయని వారిని తప్పకుండా పార్టీ గుర్తిస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని. ప్రజలకు అందించే సన్న బియ్యం అలాగే రెండు వందల యూనిట్ల ఫ్రీ కరెంటును అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను గెలిపించుకోవాలని సూచించారు. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భూక్య ఉమా మురళి నాయక్, మాలోత్ నెహ్రూ నాయక్, మాజీ సర్పంచ్ నూకల అభినవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా పార్టీ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, కాలం శ్రీనివాసరెడ్డి, కోట వెంకటరెడ్డి, నలబోలు శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవి, మరిపెడ పట్టణ టౌన్ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, ఐలమల్లు, గండి వీరభద్రం గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచాల తిరుపతి సేవలు మరువలేనివి

### తిరుపతి ప్రథమ వర్ధంతి సభలో చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** మంచాల తిరుపతి సేవలు మరువలేనివి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో సిపిఐ నాయకుడు మంచాల తిరుపతి ప్రదమవర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మంచాల తిరుపతి ప్రజాసేవలను స్మరించుకున్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నుండి ఎదిగి, కమ్యూనిస్టు పార్టీకి ఎన్నో విధాలుగా సేవలందించిన తిరుపతి జిల్లా స్థాయి పదవులు కూడా నిర్వహించారని తెలిపారు. అనేక ప్రజా సమస్యలపై తిరుపతి పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఆయన పోరాటాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జ్యోతి నేదునూరి, శ్రీనివాస్, రమాదేవి, ఆదరి రమేష్, తిరుపతి బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు చురుగ్గా కృషి చేయాలని, ప్రజలకు చేరువగా సేవలందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య సజ్జన్, వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

### కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. హసన్ పర్తి మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ నామినేషన్ల స్వీకరణ కేంద్రమైన సీతంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏయే గ్రామాల పరిధిలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని తెలిపారు.హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్లకు సంబంధించిన సమాచారం అందించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు తగిన కౌంటర్లు ఉండాలన్నారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు కార్డులను ధరించాలని సూచించారు. నాగారం క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో రవి, ఎంపీడీవో సుమనవాణి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు



**ప్రజాపక్షం/చెన్నారావుపేట:** నియోజకవర్గం అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేయించామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సన్నాహాక సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం నిధులు భారీగా మంజూరు అయిందని అందుకుగాను డిసెంబర్ 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేస్తున్నామని తెలిపారు వేస్తున్నామని అన్నారు.ప్రారంభోత్సవం చేస్తున్నామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నాయకులు దివాలా కోరు మాటలు మాట్లాడుతున్నారని వారిని తిప్పి కొట్టాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ఏకాభిప్రాయంతోనే ఎంపిక చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, యువజన మండల అధ్యక్షులు బండి హరీష్, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ తప్పెట్ల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ తో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 50 మందికి కాంగ్రెస్ కండువా కప్పిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఐనవోలు :** ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మార్నేని యద లక్ష్మి – లక్ష్మణ్ రావు దంపతులతో పాటు 50 మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రానున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రజలందరూ కలసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పోలేపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వరరావు, జేబీఎం జిల్లా చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు పెండ్ల సంపత్ కుమార్, గ్రామ సీనియర్ నాయకులు బర్ల రవి బీసీ సెల్ నాయకులు రవి తో పాటు గ్రామ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. హన్మకొండ భీమారం ప్రాంతంలో హన్మకొండ బ్యాడ్మింటన్ టోర్నమెం ట్ నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని టోర్నమెంట్ ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. టోర్నమెంట్‌ను ప్రారంభిస్తూ సరదాగా క్రీడాకారులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడుతూ, వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. అనంతరం బ్యాకింగ్ కోచ్ శీలం నరేందర్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, తెలంగాణ రాష్ట్రంలోనే నాలుగవ స్పోర్ట్స్ స్కూల్ హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించామని, పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజీకి ప్రభుత్వం కోటి రూపాయలు ఇచ్చి ప్రోత్సహించిందని చెప్పారు. తాను కూడా స్పోర్ట్స్ మెన్ అని, వర్ధన్నపేట నియోజకవర్గంలో క్రీడా రంగ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని, విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాలకు చేరుకోవాలన్నారు. క్రీడాకారులకు ఒక స్పోర్ట్స్ మెన్ గా అనునిత్యం అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.అలాగే, హసన్ పర్తి ప్రాంతంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడానికి తాను కృషి చేస్తున్నానని తొందరలోనే స్టేడియం ఏర్పాటు అవుతుందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆర్గనైజర్, కాంగ్రెస్ నాయకులు, కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల మహా ధర్నా కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజే (ఐజెయు) ఆధ్వర్యంలో హైదరాబాద్ లో డిసెంబర్ 3న మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీయుడబ్ల్యూజె (ఐజేయూ) జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్ లో నిర్వహించతలపెట్టిన మహా ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి,తోట సుధాకర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సార దోరణి అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు వడిసెంబర్ 3న హైదారాబాద్ మాసాబ్ ట్యాంక్ రాష్ట్రసమాచార కమీషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సీనియర్ నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం. రాజేంద్రప్రసాద్, అనుముల రవి, దేవేందర్, ఎండి ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు కామ్రేడ్ బాల మల్లేష్

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం/హనుమకొండ/నర్సంపేట:** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించి అమరుడైన కామ్రేడ్ బాల మల్లేష్ చిరస్మరణీయులని భారతీయఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రం లోని కార్యాలయంలో అమరజీవి బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ లో చేరి విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. సిపిఐలో అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి అనేక భూ పోరాటాలకు ,కార్మిక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి పలుమార్లు అరెస్టై జైలు జీవితం అనుభవించాడన్నారు. వారి ఆశయాల సాధనకు పేదలకుభూమి ,ఉపాధి, పౌర హక్కుల కోసం పోరాడటమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్టు కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బిక్షపతి,లక్ష్మణ్,



సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, వెంకట్రాజం, పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల యోధుడు కామ్రేడ్ బాల మల్లేష్ అని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్కే బాషు మియా అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేష్ మొదటి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భాంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో అనేక పోరాటాల్లో ముందు వరుసలో ఉండి పోరాడిన బాల మల్లేష్ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, అక్బర్, పాల కవిత, పిట్టల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరురాలు విజయమ్మ మృతి

నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని 28వ డివిజన్‌కు చెందిన గుండెపూడి విజయమ్మ(69) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవరగ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, మున్సిపాలిటీ నాయకులు పొన్నెకంటి రామకృష్ణ, మేళ్లచెర్వు భాస్కర్, సిపిఐ సోషల్ మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**ప్రజాపక్షం/వైరాః** వైరా డాక్టర్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ వైరా గ్రేట్ విజన్ సంయుక్తంగా నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం జీవనం లో ఆరోగ్యం కంటే ముఖ్యమైంది మరేది లేదు అని పేర్కొన్నారు.విజయవ ంతంగా నిర్వహించిన నిర్వాహకులను, అలాగే ప్రశాంతి ఆసుపత్రి వైద్యులనుఅభినందించారు.నిర్వాహకులు ఎమ్మెల్యేని సన్మానించారు.



## ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## మూడు రోజులు వర్షసూచన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దిత్వా తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో మూడు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3,05,053 ఎకరాల్లో వరి పంట సాగు చేయడం జరిగిందని1,52,000 ఎకరాల్లో పంట కోత జరిగిందని, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలుకు ధాన్యం సిద్దంగా ఉందన్నారు. దిత్వా తుఫాన్ ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు పరిసర జిల్లాల్లో ఆదివారం, సోమ, మంగళవారాల్లో మోస్తారు వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపినట్లు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యాన్ని టార్పాలిన్లతో భద్రపరిచి తడవ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలకు సిద్దంగా ఉన్న రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

## మహిళల జీవనోపాధి మెరుగు పరుచుకునేందుకు తోడ్పాటు

డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**ఉషా ఇంటర్నేషనల్ ఆర్థిక సహకారంతో సర్వోదయ ఆర్గనైజేషన్, కృషి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రం ఉషా సిలై స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా నిరుపేద మహిళలు అయినటువంటి పదిహేను గ్రామాల నుండి గ్రామానికి ఒకరిని ఎంపిక చేశారు. తొమ్మిది రోజుల పాటు వారు ఇక్కడే ఉంటూ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, లైఫ్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, కుట్టుపని స్కిల్స్ నేర్పించారు. తొమ్మిదిరోజుల శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్ అందించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేనేజర్ రాజ్ కుమార్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీటి ద్వారా వారు వారి గ్రామాలకు వెళ్ళి సిలై స్కూల్ ఓపెన్ చేసుకుని వారి జీవనోపాధి మెరుగు పరుచుకునేలా తోడ్పాటు అందించడం జరిగిందన్నారు. మిషన్ అలాగే సిలై కిట్ అందజేశారు. ఈకార్యక్రమంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు పల్లేపాటి దామోదర్ రావు, కృషి ఎన్‌జీవో నుండి డైరెక్టర్ పోతగాని కృష్ణారావు, కోఆర్డినేటర్ కరుణ, పాల్గొన్నారు.

## మౌలాలికి అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న మహమ్మద్ మౌలాలికి అరుదైన గౌరవంతో పాటు నేషనల్ ఐడియల్ ఇన్ఫర్మేషన్ అవార్డు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన సభలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డును ప్రధానం చేశారు. గణిత శాస్త్రంలో విద్యార్థులకు అందిస్తున్న మెళకువలు సులభతరం చేస్తూ సేవలను గుర్తు చేస్తూ వారికి అవార్డును అందించారు. అవార్డును అందుకోవడం పట్ల మండల పరిధిలోని పలు ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు గ్రామస్తులు మండల ప్రజలు హర్షిస్తూ అభినందించారు. మనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి దశకు భారీగా నామినేషన్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి చివరి రోజు అర్థరాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఎక్కువ చోట్ల అర్థరాత్రి దాటిన తర్వాత కూడా నామినేషన్లను స్వీకరించారు. నవంబర్ 28 అష్టమి కావడం 29న మధ్యాహ్నం మూడు గంటల తర్వాత మంచి ఘడియలు ఉండడంతో అభ్యర్థులు మధ్యాహ్నం మూడు గంటల తర్వాతే పెద్ద సంఖ్యలో నామినేషన్ల స్వీకరణ కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం 1142 నామినేషన్లు సర్పంచ్ స్థానాలకు దాఖలు కాగా చివరి రోజున 884 నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. కొణిజర్ల మండలంలో 27 గ్రామ పంచాయతీలకు 194, రఘునాథపాలెంలో 37 గ్రామ పంచాయతీలకు 254, వైరాలో 22 గ్రామ పంచాయతీలకు 133, బోనకల్‌లో 22 గ్రామ పంచాయతీలకు 108, చింతకానిలో 26 గ్రామ పంచాయతీలకు 161, మధిరలో 27 గ్రామ పంచాయతీలకు 146, ఎర్రుపాలెంలో 31 గ్రామ పంచాయతీలకు 146 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యులకు సంబంధించి మొత్తం 1740 వార్డులకు గాను 4054 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజున 3665 నామినేషన్లు వార్డులకు దాఖలు కావడం గమనార్హం. ఈ దఫా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో స్పష్టమైన మార్పు కనిపించింది.తదనంతరం బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. సర్పంచ్‌కు 30 గుర్తులు, వార్డుకు 20 గుర్తులను ఎన్నికల సంఘం కేటాయించింది.

## చాపరాలపల్లి గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిలిపివేత

**ప్రజాపక్షం/ములకలపల్లి:**ములకలపల్లి మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామ పంచాయితీకి డిసెంబర్ 14న ఎన్నికలు జరగాల్సి ఉండగా, హైకోర్టు స్టేతో ఆ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చాపరాలపల్లి గిరిజన ప్రాంతం కాదని, గతంలో మధిర తాలూకాలో ఉండేదని గ్రామానికి చెందిన పర్వతనేని అమర్‌నాథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అక్టోబర్ 15న విచారణ చేసి, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ నవంబర్ 28కి వాయిదా వేసింది. కాగా ఈ జీసీ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ(జనరల్)కు కేటాయిస్తూ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఆదివారం నుండి దరఖాస్తుల స్వీకరణకూ ఏర్పాట్లు చేశారు. హైకోర్టును ఆశ్రయించగా విచారణను జనవరి 19కి వాయిదా వేశారు. ఎన్నిక ప్రక్రియ నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. డిసెంబర్ 17న జరిగే పంచాయితీ ఎన్నిక నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు. హైకోర్టు తుది తీర్పు వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

# అర్బన్ పార్క్‌లో ఆగని మూగ జీవాల మరణాలు

వేటతో కొన్ని సరైన రక్షణ లేక మరికొన్ని..

రూ.కోట్ల ఖర్చు ఏమైనట్లు..?

మూగ జీవాలను రక్షించలేని అటవీశాఖ ఎందుకు.. ?

మూగజీవాల సంఖ్యను పెంచాలి..




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మూగజీవాలను రక్షించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో మరణాలు ఆగటం లేదు. అర్బన్ పార్కులో ఆగని మరణాలతో జంతు, ప్రకృతి ప్రేమికులు కన్నీరు పెడుతున్నారు. ఓ పక్క పట్టణం నడిబొడ్డులో ఉన్న అర్బన్ పార్క్ లో వేటతో కొన్ని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయనే సంఘటనలు ప్రజలను, జంతు ప్రేమికులను కలవర పెడుతుండగా. సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం కూడా ముచ్చట గొలుపే ఆ చుక్కల దుప్పులు, జింకలు మరణానికి కారణమవుతున్నాయి. మూగజీవాల రక్షణ కోసం సుమారు రూ.3 కోట్ల ఖర్చు చేసిన అటవీ శాఖ అధికారులు. మరి ఆ మూగజీవాల కు రక్షణ లేకుండా చేయటం ఏమిటని జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లకు కోట్లు నిధులతో అర్బన్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులలో అంతా డొల్లతనమే కనిపిస్తుందని. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, గుత్తేదారు ఇష్టారాజ్యంతో నాసిరకంగా పనులు జరగటం, జరిగిన పనులలో సైతం సందు, గొందులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నాయని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. మూగజీవాల రక్షణ కోసం సుమారు 350 ఎకరాలలో తయారైన అర్బన్ పార్కులో చివరికి ఆ మూగజీవాలను రక్షించలేని స్థితిలో అటవీశాఖలోని కొందరు అధికారులు ఉన్నారని, కంచె చేను మేస్తుంది అనే సామెతను అటవీ శాఖలోని కొందరు ప్రోత్బలంతోనే అక్రమ వేటలు కొనసాగుతుండగా, పార్కులో జరుగుతున్న కొన్ని అలజడులు సైతం మూగజీవాలను కలవర పెడుతుండడంతో ఆ కలవర పాటుల నుండి ప్రాణాలు రక్షించుకోవడం కోసం మూగ జీవాలు సరైన రక్షణ లేని ఫెన్సింగ్ ను, గోడలను దూకుతూ వాటి ప్రాణాలను అవి తీసుకుంటున్నాయి. కళ్ళ ముందు కనిపిస్తున్న మూగజీవాలను కాపాడలేని అటవీశాఖలోని కొందరు అధికారులు అడవులలో ఏం చేస్తుంటారని ప్రకృతి, జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు సైతం ఆ శాఖలోని కొందరి అధికారులు తీరుపై మండి పడుతున్నారు. పోడు భూములలో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులను వేధించడం తప్ప మూగజీవాల రక్షణ ఆ శాఖలోని కొందరు అధికారులకు పట్ట డం లేదని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సుమారు 200 వరకు ఉన్న దు ప్పులు, జింకలు నేడు వేళ్ళపై లెక్కించేలా ఉన్నాయని. ప్ర తి సంవత్సరం పెరగాల్సిన వాటి సంఖ్య తగ్గుతూ రా వడం వెనక ఎవరి హస్తం ఉందని, ఎవరి స్వలాభం కో సం అర్బన్ పార్క్ నిర్మాణం జరిగిందని. ఎవరి జేబులు నింపడం కోసం కోట్లకు, కోట్లు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రజలు, ప్రజా సంఘాల నాయకు లు ప్రశ్నిస్తున్నారు. సత్తుపల్లిలోని అర్బన్ పార్క్‌లో ఆగని మరణాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిష్పక్షపాతంగా జరిపి మూగజీవాల మరణాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అర్బన్ పార్క్ లోని మూగజీవాల సంఖ్యను పెంచటంతో పాటు, కొన్ని నెలల పాటు పార్క్ లోకి ప్రజల సంచారాన్ని నిలిపివేయాలని జంతు, ప్రకృతి, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## జిల్లాలో తొలివిడత సర్పంచ్‌లుగా 813 మంది

వార్డు సభ్యులుగా 3485 నామినేషన్లు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం కొనసాగిన నామినేషన్ల పర్వంలో పలువురు తమ తమ అభ్యర్థిత్వాలను భారీగా సమర్పించారు. 159 సర్పంచ్ స్థానాలకు గానూ 813 మంది , 1436 వార్డులకు గానూ 3485 మంది అభ్యర్థిత్వాలు సమర్పించారు. అశ్వాపురం 24 జిపిలక గానూ 132 నామినేషన్లు, భద్రాచలం జిపి 1, 11 నా మినేషన్లు, బూర్గంపాడు 18 జిపిలు 1 14 నామినేషన్లు, చర్ల 26 జిపిలు 134 నామినేషన్లు, దుమ్ముగూడెం 37జిపిలు 153, కరకగూడెం 16 జిపిలు, 67 నా మినేషన్లు, మణుగూరు 14జిపిలు 83 నామినేషన్లు, పినపాక 23 జిపిలు 119 నామినేషన్లు. మొత్తం 159 గ్రామపంచాయతీలకు గానూ మొత్తం 813 నామినేషన్లు సమర్పించారు. అశ్వాపురం 214వార్డులకు గానూ 533 నామినేషన్లు, భద్రాచ లం 20 వార్డులు 98 నామినేషన్లు, బూర్గంపాడు 182 వా, 483 నా, చర్ల 232 వా, 485 దుమ్ము గూడెం 324 వా, 648 వార్డులు, కరకగూడెం 130 వా, 278 నామినేషన్లు, మణుగూరు 132 వార్డులు 431 నామినేషన్లు, పినపాక 20 2 వార్డులు 529 నామినేషన్లకు మొత్తం 3485 నామినేషన్లు సమర్పించారు.

## 199 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాపక్షం/ఇల్లందు:** మండలంలోని సాయన్నపేట క్రాస్ రోడ్డు సమీపంలో మూల మలుపు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా శనివారం సాయంత్రం 4:13 గంటల సమయంలో 199.673కేజీల గంజాయిని, 100 ప్యాకెట్లు ద్వారా కారు డిక్కీలో, మధ్య సీట్లో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి చంద్రభాను వివరాలను వెల్లడించారు. దీని విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని తెలిపారు. ఆంధ్ర, ఒడిస్సా బార్డర్ నుండి రాజస్థాన్‌కు తరలిస్తుండగా పోలీసులు సాయన్నపేట క్రాస్ రో డ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుంగా మారుతి కార్‌లో(ఏపి 31డిఏ 4554) కార్ డిక్కీలో, మధ్య సీట్లో ఒడిస్సా నుండి రాజస్థాన్ తరలిస్తున్న లాల్ సింగ్ చౌహాన్‌ని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి




**ప్రజాపక్షం/కల్లూరుః** ఎమ్మెల్యే ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్థానిక శాసన సభ్యురాలు మట్టా రాగమయి అన్నారు. కల్లూరు లోని మార్కెట్ యార్డ్ లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కమిటీ విస్తృత విస్తృత స్థాయి సమావేశం షేక్ రంజాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. మొదటిగా కొత్త బస్టాండ్ నుంచి మార్కెట్ కమిటీ వరకు భారీ ర్యాలీ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలతో ర్యాలీ జరిగింది .అనంతరం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యురాలు మట్టా రాగమయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఉపాధ్యాయులు స్నేహభావం, ఆదర్శనీయం, కలిగి ఉంటారని భావితరాలకు విద్యార్థులను మార్గదర్శకులుగా తీర్చిదిద్దుతున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేందుకు తయారు చేస్తున్నారని ఉపాధ్యాయుల శ్రమ గుర్తించ తగినదని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు గడుస్తున్నా హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విశ్రాంత ఉపాధ్యాయుల బకాయిలు పెండింగ్ బిల్లులు, పెండింగ్ డిఏలు, పిఆర్సి సాధనకు, ఆరోగ్య కార్డులు, సిపిఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఐక్యంగా పోరాడేందుకు సిద్ధం కావాలని కోరారు. టెట్ రద్దుకు పోరాటంకు యుటిఎఫ్ సిద్ధం కావాలని ఉపాధ్యాయ సంఘాన్ని కోరింది. లేబర్ కోడ్స్ రద్దుకు కేంద్ర ప్రభుత్వానికి వినతి తోపాటు పోరాటాలు చేయాలని అన్నారు. మృతి చెందిన ఉపాధ్యాయుల చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తూ ఓదార్పును ధైర్యాన్నిస్తూ వారి కుటుంబాలకు అండగా ఉంటామని సభలో ఉపాధ్యాయ సంఘం పేర్కొంది.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్




**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎలాంటి పొరపాట్లకు, తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ సూచించారు. మండల పరిధికోడిపుంజులవాగులో ఏర్పాటు చేసిన నామినేషన్‌ల కేంద్రాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డుస్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పని సరిగా అందుబాటులో ఉంచాలన్నారు.అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిమయ, నిభంధనల మేరకు విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితిని లెక్కించటానికి తగిన ఏర్పాట్లను చేసుకోవాలన్నారు.పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంకు అకౌంటు ద్వారానే ఎన్నికల లావాదేవీలను చేయాలని, కావునా అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్‌ను తీసుకోవాలన్నారు. ఎంపిడిఓ కుదుముల విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్, వార్డులకు 1,050 నామినేషన్లు

నామినేషన్ స్క్రూటీని పరిశీలించిన జెడ్‌పి సిఇఒ

మంగ్యాతండా పంచాయతీ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు 1,050 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లకు శనివారం చివరి రోజు కావడంతో అర్థరాత్రి వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. మంగ్యాతండా గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం కానుంది. మండలంలో 37 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 254 మంది అభ్యర్థులు, 308 వార్డు స్థానాలకు గాను 796 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం నామినేషన్ల స్క్రూటీని చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు నామినేషన్ల స్క్రూటీనిలో పాల్గొన్నారు. మండల పరిధిలోని ఈర్లపుడి, మల్లేపల్లి నామినేషన్ కేంద్రాలను జెడ్పి సిఈవో దీక్షారైనా పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్క్రూటీనికి సంబంధించి ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఏ చిన్న తప్పు ఉన్న సంబంధిత నామినేషన్లను తిరస్కరించాలన్నారు. జెడ్పి సిఈవో తో పాటు ఎంపిడివో అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హర్యాతండా, పాపటపల్లి, పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానాలకు అత్యధికంగా 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మంగ్యాతండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానానికి ఒకటి, ఆరు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైంది. దీనితో ఆ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కానుంది. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం అధికారులు ఏకగ్రీవానికి సంబంధించి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అదేవిధంగా మండలంలో పలు గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రయత్నాలు మొ దలు పెట్టారు. రాములుతండా పంచాయతీలో నామినేషన్లు వేసిన వారితో చర్చలు జరిపినట్లు సమాచారం. ఉప సంహరణల అ నంతరం ఏకగ్రీవాలకు సంబంధించి పూర్తి స్థా యిలో తేలనుంది. సోమవారం నామినేషన్లకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు.(బుధవారం) మధ్యాహ్నం మూడు గంటల వర కు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. అనంతరం పో టీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించడంతో పాటు గుర్తులను కూడా అదే రోజు కేటాయించనున్నారు.

## ప్రజా పంపిణీలో రేషన్ డీలర్ల పాత్ర కీలకం

రేషన్ డీలర్ల ఆత్మీయ సమ్మేళనంలో డిటి వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా పంపిణీలో రేషన్ డీలర్ల పాత్ర కీలకమైందని ఖమ్మం అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన రేషన్ డీలర్ల సంక్షేమ, అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గోపాలపురం సమీపంలో గల మామిడి తోటలో రేషన్ డీలర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిటి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. నగర పరిధిలోని రేషన్ డీలర్లంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇలా సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య రేషన్ డీలర్లు వారధులుగా పని చేస్తున్నారన్నారు. రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులంతా సాయంత్రం వరకు వనంలో సరాదాగా గడిపారు. మహిళలకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. రేషన్ డీలర్లు సైతం నృత్యాలు చేసి సందడిగా గడిపారు. అనంతరం డీలర్లందరిని మెమోంటోలతో సత్కరించారు. సంఘం నగర అధ్యక్షులు వాకదాని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి ఉమారాణి, సయ్యద్ రఫీ, గోళ్ల మురళీ, షేక్ బిక్కన్, రత్నాకరం సాయికుమార్,రాధాకృష్ణ, మహేష్, శేఖర్‌బాబు, లక్ష్మయ్య, ఖాజా మియా, జానిమియా, ఖాసీం, మహిళా డీలర్లు పాల్గొన్నారు.

# అన్నదాతల కష్టాలు ఒకవైపు.. ప్రమాదాలు మరోవైపు

రోడ్లపై ఆరబోసిన దాన్యంతో ఇక్కట్లు

పోలీసుల సూచనలు పాటించని అన్నదాతలు

**ప్రజాపక్షం/వైరాః** అన్నదాతలు ఆరుగాలం ఎండనక వాననక రాత్రనక పగలనక కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ నిర్దేశించిన తేమ శాతం పేరుతో కాటాలు వేయకపోవడంతో రోడ్లపై పండించిన వరి ధాన్యం ఆరబోసుకుంటున్నారు. వైరా మండలం స్టేజిపినపాక నుండి దాచాపురం వరకు రోడ్డుకి ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోశారు. ఆరబోసిన ధాన్యంతో వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతుంది అని పలువురు వాహనదారులు తెలుపుతున్నారు. రోడ్లపై ధాన్యాన్ని రెండు పక్కల ఆరబోయడం వలన వాహనదారులు ఎందురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల క్రితం దాచాపురం నుండి గరికపాడు వరకు ఉన్న రోడ్డుపైఉ ధాన్యాన్ని తప్పించడానికి ఎదురుగా వచ్చిన వాహనాన్ని ఢీకొనబోయారు. తృటిలో ప్రమాదం తప్పడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి వేళల్లో ఆరబోసిన ధాన్యం గుర్తుపట్టలేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు తెలుపుతున్నారా, రోడ్లపై ధాన్యం పోయకుండా ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని, బా ధ్యతతో వ్యవహరించాలని, ధాన్యం ఆరబెట్టుకోవాలని, బాధ్యతతో వ్యవహరించాలని, ధాన్యం ఆరబెట్టడానికి ఇళ్ల వద్ద పొలాల్లో ప్రత్యేక కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. అధికారులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులకు ప్రమాదాలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ధాన్యం ఆరబోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలిః** ఎస్సై రామారావురైతులు రోడ్లపై రెండు ప్రక్కల ధాన్యం పోయవద్దని రెండు ప్రక్కల ధాన్యం పోయడం వలన వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని వైరా ఎస్సై పుప్పాల రామారావు అన్నదాతలను కోరారు. రైతులు సాధ్యమైనంత వరకు ఖాళీ స్థలాల్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలం ఉంటే ధాన్యాన్ని ఆరబోసుకోవాలని పూర్తిగా రెండు ప్రక్కల ధాన్యం పోయం వలన ఎదురెదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలుసార్లు పలు గ్రామాల్లో రైతులకు సూచనలు చేయడం జరిగిందని, మరోసారి రైతులకు సూచనలు చేస్తామని ఎస్సై రామారావు తెలిపారు.



# క్రీడ



# శతకంతో రెచ్చిపోయిన కోహ్లీ..

తొలి వన్డేలో సఫారీలకు లక్ష్యం 350

టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ నుంచి తేరుకున్న భారత జట్టు రాంచీ వన్డేలో భారీ స్కోర్ చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికేస్తూ విరాట్ కోహ్లీ(135) శతకంతో గర్జించగా.. రోహిత్ శర్మ(57) ఉన్నంతసేపు దంచేశాడు. హిట్‌మ్యాన్ ఔటయ్యాక గేర్ మార్చిన కోహ్లీ సిక్సర్లతో రెచ్చిపోయి 52వ సెంచరీ సాధించాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్(60) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ 300 దాటించాడు. రవీంద్ర జడేజా(32) కూడా రాణించగా నిర్ణీత ఓవర్లలో టీమిండియా ప్రత్యర్థికి పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించింది.

రాంచీ వన్డేలో టాస్ ఓడిన టీమిండియా.. టాపార్డర్ మెరుపులతో దక్షిణాఫ్రికాకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆరంభంలోనే ఓపెనర్ యశస్వీ జైస్వాల్(18) వికెట్ కోల్పోయినా.. రోహిత్ శర్మ(57), విరాట్ కోహ్లీ(135: 120 బంతుల్లో 11ఫోర్లు, 7 సిక్సర్లు)లు దంచేశారు. ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయిన రోకో స్కోర్ బోర్డును ఉరికించారు. సిక్సర్‌తో కోహ్లీ 75వ అర్ధ శతకం సాధించాడు. ఆ కాసేపటికే హిట్‌మ్యాన్ సైతం హాఫ్ సెంచరీ అందుకున్నాడు. చెలరేగి ఆడుతున్న ఈ ద్వయాన్ని మార్కో జాన్సెన్ విడదీసి సఫారీలకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ (8) క్రీజులో కుదురుకొనేలోపే డెవాల్డ్ బ్రెవిస్ స్టన్నింగ్ క్యాచ్ పట్టగా ఔటయ్యాడు. దాంతో.. 183 వద్ద టీమిండియా మూడో వికెట్ పడింది. అనూహ్యంగా బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన వాషింగ్టన్ సుందర్(13) సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. బార్ట్‌మన్ ఓవర్లో అతడు బాష్ చేతికి చిక్కడంతో నాలుగో వికెట్ కోల్పోయింది భారత్. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడడంతో స్కోర్ నెమ్మదించింది. అయితే.. జాన్సెన్ ఓవర్లో బౌండరీతో 52వ శతకం సాధించిన కోహ్లీ ఆ తర్వాత సుబ్రమణ్యం ఓవర్లో దంచేశాడు. రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 21 పిండుకున్న విరాట్ 43వ ఓవర్లో రికెల్టన్ రన్నింగ్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. అనంతరం రవీంద్ర జడేజా(32).. రాహుల్(60) ధనాధన్ ఆడి జట్టు స్కోర్ 300 దాటించారు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన రాహుల్ మెరుపులతో టీమిండియా 350 కొట్టేలా కనిపించింది. కానీ, ఆఖరి ఓవర్లో రెండు వికెట్లు పడడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది.

## సచిన్-ద్రవిడ్‌ను అధిగమించిన రోహిత్-కోహ్లీ జోడీ!

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేల్లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నారు. దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ రెండో వికెట్‌కు 50కిపైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఘనమైన ఆరంభాన్ని అందించారు. యశస్వి జైస్వాల్ రూపంలో భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా.. రోకో జట్టును భారీ స్కోరు వైపు నడిపిస్తున్నారు. భారత్‌తో జరిగిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికా టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేయాలని నిర్ణయించుకుంది. టాస్ గెలిచినా తాను తొలుత బౌలింగ్ చేసి ఉండేవారమని భారత కెప్టెన్ కేఎల్ రాహుల్ తెలిపాడు. యశస్వి జైస్వాల్‌ను అవుట్ చేసి నాంద్రే బర్గర్ షాక్ ఇచ్చాడు. యశస్వి బ్యాట్‌తో అలరించినా.. అదే ఊపును కొనసాగించలేకపోయాడు. యశస్వి 16 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 18 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. దక్షిణాఫ్రికాపై కోహ్లీ, రోహిత్ దూకుడుగా ఆడారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తి చేశారు. ఈ సమయంలో కోహ్లీ ఫుల్ ఫామ్‌లో కనిపించాడు. ఈ ఇద్దరూ వన్డేల్లో స్వదేశంలో 50ప్లస్ పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ఇది 18వ సారి. రోహిత్-కోహ్లీ జంట 39 వన్డే ఇన్నింగ్స్‌లో 17 సార్లు 50+ పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి.. మార్టిన్ గప్టిల్‌కేన్ విలియమ్సన్ రికార్డును అధిగమించారు. వన్డేల్లో అత్యధిక భాగస్వామ్యాల రికార్డు కుమార్ సంగక్కరమహేల జయవర్ధనే పేరిట ఉన్నది. వీరిద్దరు 57 ఇన్నింగ్స్‌లలో 24 సార్లు ఈ భాగస్వామ్యాన్ని చేశారు. ఇది రోహిత్-కోహ్లీ కలిసి 392వ ఇంటర్నేషనల్ మ్యాచ్. గతంలో ఎవరూ భారత్ తరఫున మరే జంట కలిసి ఇన్ని మ్యాచ్‌లు ఆడలేదు. రోహిత్-కోహ్లీ జోడీ.. సచిన్-రాహుల్ ద్రవిడ్ రికార్డును అధిగమించారు. సచిన్ టెండూల్కర్ – రాహుల్ ద్రవిడ్ 391 మ్యాచులు ఆడారు.

## కామన్వెల్త్ గేమ్స్‌పై వశిష్ఠ్ పాట విడుదల




**కొజికోడ్:** భారత దేశంలో 2030లో జరగబోయే కామన్వెల్త్ గేమ్స్‌ను ఆహ్వానిస్తూ కాలికట్ మలబార్ క్రిస్టియన్ కాలేజీ మాజీ ప్రొఫెసర్ ఎంసి వశిష్ఠ్ రచించిన పాట విడుదలైంది. హిందీ భాషలో రాసిన ఈ గీతానికి ఆయన పూర్వ విద్యార్థి సాయి గిరిధర్ సంగీతం సమకూర్చి, స్వయంగా ఆలపించారు. క్రీడలపట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శించే వశిష్ఠ్, ఎన్నో జాతీయ, అంతర్జాతీయ క్రీడోత్సవాల చారిత్రక నేపథ్యాలను అధ్యయనం చేస్తూ, పలు రచనలు చేశారు. భారత హాకీ సమాఖ్యకు అంతర్జాతీయ హాకీ సమాఖ్యలో గుర్తింపు, సభ్యత్వం లభించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబర్ నెలలో ఆయన రాసిన పాట విశిష్ట ఆదరణ పొందింది. కేవలం క్రికెట్‌కు మాత్రమే అధిక ప్రోత్సాహం లభిస్తున్న తరుణంలో, ఇతర క్రీడలను కూడా ఆదరించాల్సిన అవసరం ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్ దారుణ వైఫల్యాలను ఎదుర్కోవడానికి ఇప్పుడు ఉన్న పరిస్థితులే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బృందం మెరుగైన ప్రదర్శనతో రాణిస్తుందని ఆశిస్తున్నట్టు వశిష్ఠ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆరోగ్యం

ఫోకస్

## అవగాహనతో అయోడిన్ లోప నివారణ!

మానవ జీవక్రియ నియంత్రణకు అత్యవసరమైన థైరాయిడ్ గ్రంధి క్రియాశీలత, ఎదుగుదల, అభివృద్ధి, థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిలో శరీరానికి అయోడిన్ పలు రకాలుగా ఉపయోగపడుతుంది. శరీరంలో అయోడిన్ కొరత ఏర్పడితే పలు 'అయోడిన్ లోప రుగ్మతలు (అయోడిన్ డెఫిష్యన్సీ డిసీజెస్) కలుగుతాయి. అయోడిన్‌తో కూడిన ఆహారపదార్థాలను నిరంతరం సక్రమంగా తీసుకున్నట్లైతే, ఈ రుగ్మతలు నివారించబడుతూ సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందనే అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా 21 అక్టోబర్ రోజున ప్రపంచ అయోడిన్‌లోప రుగ్మతల నివారణ దినం(వరల్ అయోడిన్ డెఫిసియెన్సీ డిసార్డర్ ప్రివెన్షన్ డే) పాటించుట జరుగుతోంది.

### అయోడిన్ లోప నివారణ మార్గాలు..

కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, మిటమిన్లు, ఖనిజ లవణాలు, పీచుపదార్థాలు, నీరు సమపాళ్ళలో ఉన్న సమతుల పోషకాహారం తీసుకున్నట్లయితే పూర్తి ఆరోగ్యం సిద్ధిస్తుంది. సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాల లోపం వల్ల పలు రోగాలు వస్తాయి. వీటిలో ఒక ముఖ్యమైన ఖనిజ లవణమైన అయోడిన్ వల్ల టి3 (ట్రైఅయోడోథైరోనిన్), టి4 (థైరాక్సిన్) అనబడే థైరాయిడ్ హార్మోన్లు తయారు చేయబడతాయి. అయోడిన్ సహకారంతో థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి, సక్రమమైన జీవక్రియ, ప్రొటీన్లు, కొవ్వుల జీవక్రియ, ఎముకల అభివృద్ధి, మెదడు ఎదుగుదల జరుగుతాయి.

### అయోడిన్ లోప అనారోగ్యాలు..

శరీరంలో అయోడిన్ లోపం ఫలితంగా గాయిటర్ (థైరాయిడ్ విస్తరణ), న్యూరోమస్కులర్ (నాడీకండర) బలహీనతలు, హైపోథైరాయిడిజమ్, వినికిడి బలహీనత, స్పీచ్ (మాట) బలహీనత, బుద్ధి మాంద్యం (ఇంటలిజెన్స్ స్థాయి తగ్గడం), చూపు మందగించడం, స్పాస్టిసిటీ, క్రెటినిజమ్ లాంటి అయోడీన్ లోప రుగ్మతలు జనిస్తాయి. గర్భిణిలో అయోడిన్‌లోపం వల్ల శిశువు సమగ్రాభివృద్ధి ప్రభావితం అవుతుంది. శరీరంలో అయోడిన్ ఉత్పత్తి కాదు, కాబట్టి అయోడిన్ కలిగిన ఆహారాన్ని తీసుకోవడం మాత్రమే తప్పనిసరియని గమనించాలి. ఒక ఆరోగ్యవంతుడికి రోజుకు సగటున 100–150 మైక్రోగ్రామ్‌ల అయోడిన్ అవసరం అవుతుంది. అయోడైజ్డ్ సాల్ట్, సముద్ర ఆహారం, పాలు, పెరుగు, బ్రెడ్, ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, అరటి పండ్లు, మాంసం, గుడ్లు, తృణధాన్యాలు లాంటి ఆహారంలో అయోడీన్ లభ్యమవుతుంది. నిత్యం అయోడీన్‌తో కూడిన ఉప్పును వాడడం ఉత్తమమైన మార్గమని గుర్తించాలి.

### ప్రపంచ సమస్యగా అయోడిన్ లోపం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వివరాల ప్రకారం ప్రపంచ జనాభాలో 1.5 బిలియన్ల (1/3 వంతు జనాభా) ప్రజలు అయోడీన్ లోపంతో బాధ పడుతున్నారని తేలింది. ఇండియాలో 200 మిలియన్ల మంది (10శాతం జనాభా) అయోడీన్‌లోప రుగ్మతల ప్రమాదంలో ఉన్నారని, 71 మిలియన్లు గాయిటర్ సంబంధ వ్యాధులతో బాధ పడుతున్నారని తేలింది. 1984లో భారత ప్రభుత్వం అయోడైజ్డ్ సాల్ట్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ, 1993లో నాన్ అయోడైజ్డ్ ఉప్పు వాడకాన్ని నిషేధించింది. సామాన్య జనంలో అయోడిన్ లోపంతో వచ్చే ప్రమాదకర రుగ్మతల పట్ల అవగాహన కల్పించేందుకు 'ప్రపంచ అయోడిన్‌లోప రుగ్మతల నివారణ దినాన్ని' పాటించడం ఉద్యమంలా జరగాలి. వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్నయని, అయోడీన్‌లోపం రాకుండా ముందే జాగ్రత్త పడాలని విశ్వ మానవాళికి అవగతం చేయడం మన కనీస బాధ్యత అని సత్వరమే తెలుసుకోవాలి. అయోడిన్ ప్రాముఖ్యతను వివరించడం, అయోడిన్‌లోప రుగ్మతల లక్షణాల అవగాహన, అయోడిన్ సహిత ఆహారాన్ని తీసుకోవడం, అయోడిన్‌లోపానికి సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయడం లాంటి అంశాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలి. అయోడిన్‌లోప రుగ్మతలు నివారించదగినవని, అయోడిన్ సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారపదార్థాలను తీసుకుంటూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.





## కాగితం కప్పులతో జాగ్రత్త



కాఫీ లేదా టీని కాగితం కప్పుల్లో తాగడం ఇటీవల కాలంలో పెరిగిపోయింది. ముఖ్యంగా ఏవైనా ఫంక్షన్లు, పార్టీలలో కాగితం కప్పులను ఉపయోగిస్తున్నారు. అయితే, వీటిలో కాఫీ లేదా టీ తాగడం వల్ల మనకు తెలియకుండా శరీరంలో హానికరమైన పదార్థాలు చేరవచ్చని ఒక సంచలనాత్మక అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధన ప్రకారం, కాగితం కప్పులో కాఫీ లేదా టీని కేవలం 15 నిమిషాలు ఉంచినప్పుడు దాదాపు 25,000 మైక్రోప్లాస్టిక్ కణాలు దానిలో కలుస్తాయి. అంతేకాకుండా, ఫ్లోరైడ్ నైట్రేట్, బిస్ఫెనాల్ 'ఎ' (బిపిఎ), సీసం వంటి రసాయనాలు కూడా అందులో చేరుతాయి. ఈ పదార్థాలు కాలక్రమేణా శరీరంలో నిల్వ ఉంటాయి. దీని ప్రభావంతో, దీర్ఘకాలంలో తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాఫీ, టీ తాగడం వల్ల కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వాటిని పోసే కప్పులు ప్రమాదాలను సృష్టిస్తాయన్నది ఆందోళన కలిగిస్తున్న విషయం. అందుకే, మళ్లీ తిరిగి ఉపయోగించగల స్టీల్ లేదా గాజు గ్లాసులను ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధంగా చేస్తే, కాఫీ, టీ రుచి మారదు. ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుంది. మనకు ఇష్టమైన ఈ పానీయం తాగే విధానంలో చిన్న మార్పులు చేయడం వల్ల మన ఆరోగ్యానికి పెద్ద ప్రయోజనం కలిగించే అవకాశం ఉంది. పేపర్ కప్పుల వాడకాన్ని ఎంత త్వరగా మానుకుంటే అంత మంచిది.

## బిఆర్‌ఎస్ నుంచి సిపిఐలోకి 75 కుటుంబాలు

పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించిన మౌలానా, దండి, పుచ్చకాయల



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పల్లెగూడెం బిఆర్‌ఎస్ నుంచి 75 కుటుంబాలు ఆదివారం సిపిఐలో చేరాయి. బిఆర్ఎస్ మండల నాయకుడు కళ్లెం సీతయ్య ఆధ్వర్యంలో సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకులు లింగ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ పార్టీ జెండాలను కప్పి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన కళ్లెం సీతయ్య, బొమ్మిల ముత్తయ్య, కృష్ణ, ఊబిది కొరవి, అలేటి వెంకన్న, కళ్లెం ఉప్పలయ్య, వెంకటమ్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఐ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై తమతో పాటు తమ కుటుంబాలు పార్టీలో చేరినట్లు తెలిపారు. బలమైన సిపిఐ పార్టీని మరింత బలోపేతం చేసేలా సైనికుల్లా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కళ్లెం ముత్తయ్య, మాజీ ఎంపిటీసీ అన్నమ్మ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా కృషిచేస్తే విజయం

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని దుప్పల్లి సర్పంచ్ అభ్యర్థిగా జావీద్‌ను నిర్ణయించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి సమక్షంలో జావిద్‌తో పాటు పదిమందిని ఆదివారం పార్టీలోకి ఆహ్వానించారు. బాలగోని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యానాల దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి సర్పంచ్, వార్డు మెంబర్లను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఈ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ సర్పంచ్‌గా అనేక పర్యాయాలు గెలిచి అనేకమైన అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితోనే ఈ గ్రామం మరింత అభివృద్ధి చెందాలన్నారు. సర్పంచ్ ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సీనియర్ నాయకులు ఎలగందు అంజయ్య, శాఖ కార్యదర్శి కట్ల యాదగిరి, నరిగ యాదయ్య, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు మరోజూ నరసింహ చారి, కన్నబోయిన పృథ్వీరాజ్, మెట్టు లక్ష్మీ నారాయణ, కన్నబోయిన తాతయ్య, సలిగంజి కృష్ణ కుమార్, నోముల నర్సయ్య, రాపోలు పవన్, కట్ల సామెల్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్




**ప్రజాపక్షం/మంచిర్యాల :** మావోయిస్టుల పట్ల కేంద్రప్రభుత్వం పునరాలోచించి శాంతి చర్చల ద్వారా పరిష్కార మార్గాన్ని ఎంచుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా బూటకపు ఎన్‌కౌంటర్ తర్వాత దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారని గుర్తుచేశారు. మెజారిటీ ప్రజల ఆలోచనలను కేంద్రం గౌరవించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో సిపిఐ పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 26న రామకృష్ణాపూర్‌లో సిపిఐ శత జయంతి వేడుకల ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలవేన శంకర్ కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, బోల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, రేగుంట చంద్రకళ, జోగుల మల్లయ్య, ఇప్పకయాల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, దుర్గరాజ్, ఆడెపు రాజమొగిలి, కొండూ బాణేష్, దేవి పోచన్న, పట్టణ, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వార్డుమెంబర్‌గా సిపిఐ అభ్యర్థి ఎన్నిక

**ప్రజాపక్షం/గంగాధర :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మంగపేట గ్రామపంచాయతీ ఎనిమిదో వార్డు సభ్యురాలిగా సిపిఐ అభ్యర్థిని షేక్ యాకూబ్ భి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ మండల కార్యదర్శి షేక్ మౌలానా భార్య యాకూబ్ భి. ఏకగ్రీవంగా ఎన్నికయిన యాకూబ్ భి ఆదివారం సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అభినందించారు. యాకూబ్ భి పార్టీ నిర్వహించిన అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడే వ్యక్తులు గెలిస్తేనే గ్రామాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి షేక్ మౌలానా, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులతోనే గ్రామాల అభివృద్ధి

## ప్రజా సమస్యలపై పోరాడేవారిని ఆదరించాలి : సిపిఐ నేతల పిలుపు

**ప్రజాపక్షం/జనగామ :** స్థానిక సంస్థలకు జరుగుతున్న ఎన్నికలలో ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, సేవ చేస్తున్న వారిని ఎన్నుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జువారి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను గెలిపించాలని ఆయన కోరారు. ప్రజా సేవకు అంకితమై ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వదలకుండా ప్రజాసేవ కాంక్షితమే పనిచేస్తున్న సిపిఐ అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరు సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎల్లయ్య, యాదగిరి, ప్రశాంత్, సదానందం, సోమయ్య, కుమారస్వామి, శ్రీశైలం, రాజు, యాకూబ్, సీతారాం, సఖి, మల్లేశం, పాండు, యూనస్, విజయ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



జనగామలో...



మహబూబాబాద్‌లో...

### సేవచేసే కమ్యూనిస్టులను గెలిపించాలి

**మహబూబాబాద్ :** నిజాయితీతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో ఆదరించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్ల సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పంచాయతీ ఎన్నికల సన్నహాక సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలలో పారదర్శక పాలన కావాలంటే, పాలక పార్టీలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనునిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో సేవచేసే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను పెద్ద ఎత్తున గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య కొరివి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య,బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు, సాయి, రవి పాల్గొన్నారు.

### కాంగ్రెస్, సిపిఎంలతో కలిసి పోటీ

**వాజేడు :** ములుగు జిల్లా వాజేడు మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆచంట ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పాల్గొన్నారు. మండలంలోని కొన్ని పంచాయతీలలో పోటీ చేయాలని సిపిఐ కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. కాంగ్రెస్, సిపిఎం పార్టీలు సిపిఐ పార్టీతో సంప్రదింపులు జరిపిన తదనంతరం కలిసి పనిచేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని సమావేశంలో తోట మల్లికార్జున్‌రావు అన్నారు. కొన్ని పంచాయతీల్లో ఒంటరిగా పోటీ చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నల్లబోయిన రవీందర్, మండల కార్యవర్గ సభ్యులు గార రాంబాబు, బొల్లె వెంకటేశ్వర్లు, గగ్గుల ప్రసాదు, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


వాజేడులో...


చెన్నారావుపేటలో...

### డబ్బు, మద్యానికి లొంగొద్దు

**చెన్నారావు పేట :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకున్ని స్థానిక ఎన్నికల్లో ఎన్నుకోవాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాసు మియా అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట గ్రామంలో జాగృతి విద్యానికేతన్ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులకు నిధులు రాక అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు వాగ్దానాలు చేసుడే తప్ప పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించడంలో విఫలం అయ్యారని అన్నారు. స్థానిక ఎన్నికల్లో డబ్బు, మద్యంలకు లొంగిపోవద్దని, స్థానిక సమస్యలపై పోరాడే నాయకునే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పేరుతో అధికారం చేపట్టి నేటికీ ఒక సంక్షేమ పథకం కూడా పేదలకు పూర్తి స్థాయిలో అందలేదని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో సిపిఐ పోటీ చేస్తుందని తెలిపారు. సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా పోటీస్థానాల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ మండల కార్యదర్శి పత్తి ఆనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కొండగట్టు అగ్ని ప్రమాద స్థలాన్ని విద్యుత్ శాఖ సిఇ తనిఖీ



**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా కొండగట్టు లో అంతర్గత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని విద్యుత్ శాఖ వరంగల్ ఆపరేషన్ సీ ఈ అశోక్ తనిఖీ చేశారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆయన వెంట జగిత్యాల డీఈ ఆపరేషన్ బి గంగారాం ,మల్యాలఏ డీ ఈ మహేందర్ ,రామన్న పేట ఏ ఈ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కలెక్టరేట్లో సోమవారం నేడు (01.12.2025) నిర్వహించే ప్రజావా ణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**కరీంనగర్లో..**

గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ఈ కార్యక్రమాన్ని ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి ఉండదని స్పష్టం చేశారు. కోడ్ ముగిసిన తర్వాత యథావిధిగా కార్యక్రమం కొనసాగుతుందని, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

**జగిత్యాల రూరల్లో...**



జగిత్యాల కలెక్టరేట్లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఉన్న సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు కంటికి సంబంధించిన జబ్బులతో బాధపడుతున్న వారు ఈ శిబిరంలో ఉచితంగా వైద్యులు సేవలు అందించడం జరుగుతుందని, అవసరమైన వారికి వివిధ ఆరోగ్య బీమా కింద ఆపరేషన్లు కరీంనగర్లో వారి హాస్పిటల్ నందు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ శిబిరంలో వంద మంది కి పైగా హాజరు కాగా డాక్టర్ మైథిలి పరీక్షలు నిర్వహించారు. కొంత మందికి ఆపరేషన్ లు అవసరమని డాక్టర్ నిర్ధారించారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి కరీంనగర్ లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కి తీసుకెళ్ళి ఆపరేషన్ చేస్తామని డాక్టర్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు కె.మైథిలి, హాస్పిటల్ మేనేజర్ యాదగిరి, హాస్పిటల్ సిబ్బంది రమేశ్, అజయ్, అన్వేష్, స్నేహ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని ఆర్టిసి డిపోలో గత 29 సంవత్సరాలుగా కండక్టర్గా విధులు నిర్వహించిన కాంద్రేగుల మణి కుమారి నేడు పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆర్టిసి డిపోలో జరిగిన స న్మాన కార్యక్రమంలో సిపిఐ నాయకులు మణి కుమారి చిన్న సత్యనారాయణ దంపతులకు పూలగుచ్చం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం, మహిళా సమాఖ్య నాయకురాలు మడికొండ ఓదెమ్మ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఆసాల నవీన్ లు పదవి విరమణ చేసిన వీరికి శుభాకాంక్షలు తెలుపుతూ వారి శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు.

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యం లో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కఠినంగా అమలు చేయడంతో పాటు,ప్రలోభాలను నివారించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందనిపేర్కొన్నారు.సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో అభ్యర్థులు,వారి అనుచరులు డబ్బు పంచడం,ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం,కుల సంఘాలకు డబ్బు పంచడం,గ్రామ అభివృద్ధి పేరుతో డబ్బులు అడగడం, ఆశాచూపడం వంటి చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, మండలాల వారిగా ఎఫ్ఎస్ టి బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని డిఎస్పి తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా కొండగట్టు లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 25 దుకాణాలు పూర్తిగా దగ్ధం కాగా, 5 దుకాణాలు పాక్షికంగా కాలిపోయిన సంఘటన తెలిసిందే. బాధిత కుటుంబాలకు జిల్లా కలెక్టరు సత్య ప్రసాద్ ఆదేశాల ప్రకారం వారికి తక్షణ సహాయం గా ఒక్కొక్క కుటుంబానికి తక్షణ సాయంగా నగదు ఐదు వేల రూపాయలతో పాటు పది కిలోల బియ్యం మల్యాల ఎంఆర్ఓ వసంత అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు .

# బలహీన మనస్తత్వం నుంచి బయటకు రావాలి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బలహీన మనస్తత్వం నుంచి బయటకు వచ్చి సర్పంచ్ ఎన్నికల్లో ధైర్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోటీ చేసి విజయం సాధించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన సంగీతం శ్రీనివాస్ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విహెచ్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి పాత బస్టాండ్ నుండి లహరి ఫంక్షన్హాల్వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. లహరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని నూతనంగా ఎన్నికైన సంగీతం శ్రీనివాస్చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా, జిల్లా కాంగ్రెస్ నాయకులుగా పని చేసి పరిశీలకులు, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎంపికయ్యారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అందరిని కలుపుకొని ముందుకు పోయి జిల్లాలో నీ స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించాలని అన్నారు. గత ప్రభుత్వం జిల్లాను విస్మరించిందని, నేతన్నలకు పెట్టిన బకాయిలను ప్రజా ప్రభుత్వం తీర్చిందన్నారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉన్నారునీ 9 వ ప్యాకెజ్ పూర్తి చేసి గతంలో మల్కాపేట రిజర్వాయర్ నుండి సుమారు 7000 ఎకరాలకు నీరు అందించామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని పోతూ సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. జిల్లా మంత్రులుగా నేను ,శ్రీధర్ బాబు ,అడ్లూరి ,విప్ ఆది శ్రీనివాస్, ఇతర ఎమ్మెల్యేలు ఈ జిల్లాలో ఉన్నాం పార్టీని బలోపేతం చేసుకొని ఇక్కడ జెండా ఎగురవేద్దాం అన్నారు. సిరిసిల్ల నేతన్నలకు చేతి నిండా పని కల్పించ దానికి మహిళా సంఘాలకు చీరలు ఇక్కడే తయారు చేయించామన్నారు. మిగతా జిల్లాల కంటే సిరిసిల్లలో బలంగా ఉన్నామని చెప్పుకోవాలన్నారు. బలహీనంగా ఉన్నామనే భావన నుండి బయటకు రావాలని కార్యకర్తలకు సూచించారు. సర్పంచ్,స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ఎల్లవేళలా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కటకం మృత్యుంజయం, అంజని కుమార్, నాగుల సత్యనారాయణ, ఉమేష్ రావు, ఆకారపు భాస్కర్,వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, చొప్పదండి ప్రకాష్,కాముని వనిత, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, గడ్డం నరసయ్య, చొక్కాల రాము, హరిలాల్, చంద్రకళ, బొప్ప దేవయ్య, మడుపు శ్రీదేవి, చంద్రగిరి శ్రీనివాస్ వివిధ మండలాల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

సాధారణ ఎన్నికల పరిశీలకుడు అనుగు నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్గా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహ రెడ్డి అన్నారు. ఆదివారం సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు జె.అరుణ శ్రీ , డి.వేణులతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుగు నర్సింహా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నిక మొదటి సారిగా నిర్వహిస్తున్నట్లు భావించి అధికారులు పని చేయాలని అన్నారు. ఎం.సి.సి అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించడానికి వీలు లేదని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించేలా చూడాలని అన్నారు. ఎన్నికల ప్రచారసమయంలో జరిగే ప్రతి ఖర్చు వివరాలు కట్టుదిట్టంగా అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలన్నారు. పోలింగ్ , కౌంటింగ్ కేంద్రాలు వేర్వేరు ఉన్న చోట బ్యాలెట్ తరలింపు అప్రమత్తంగా చేయాలని అన్నారు. ప్రతి విడత పోలింగ్కు రెండు రోజుల ముందు వైన్ షాప్స్ మూసి వేసేలా చూడాలన్నారు. తనిఖీ లలో జప్తు చేసే నిధులు నిబంధనలు ప్రకారం చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు కావడానికి ఆస్కారం లేదని, ఫ్రీ అండ్ ఫేయిర్గా ఎన్నికలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎం.సి.సి. నిబంధనల ఉల్లంఘనలు జర్గకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలని అన్నారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల పరిమితి వివరాలు అందించాలని, నామినేషన్లో ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉండే ప్రతి అభ్యర్థికి ఎన్నికల ప్రచారవ్యయ వివరాల నమోదు చేసేందుకు రిజిస్టర్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని స్పష్టంగా తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులను పకడ్బందీగా నిర్వహిస్తూ బృందంగా పని చేయాలని, ఎన్నికల పారదర్శకంగా జరగాలని అన్నారు. ఎఫ్.సి.టి , ఎస్.ఎస్.టి ఏర్పాటు పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ పేపర్, ప్రింటింగ్ మేటిరయల్ , బ్యాలెట్ బాక్స్, రవాణా వాహనాలు, గుర్తుల కేటాయింపు మొదలగు వివిధ అంశాలకు సంబంధించిన అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా పరిధిలో మొదటి విడత డిసెంబర్ 11న 99 గ్రామాలు, 896 వార్డులకు , రెండవ విడత డిసెంబర్ 14న 73 గ్రామాలు, 684 వార్డులకు , మూడవ విడత డిసెంబర్ 17న 91 గ్రామాలు, 852 వార్డులకు ఎన్నికల జరుగుతాయని అన్నారు. మొదటి విడత జరిగే 99 గ్రామ పంచాయతీలకు 823 నామినేషన్ స్వీకరించామని, రెండవ విడత నోటిఫికేషన్ నేడు విడుదల చేయడం జరిగిందని అన్నారు. నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు బి.గంగయ్య, సురేష్, డీసీపీ. రామ్ రెడ్డి ,ఏసిపి రమేష్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, డిపిఓ వీర బుచ్చయ్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## రెండవ దశ నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** గ్రామపంచాయతీ ఎన్నికలు రెండవ విడుతలో సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, పొన్నాల క్లస్టర్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను ఆదివారం జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మిట్టపల్లి క్లస్టర్లో మిట్టపల్లి, పాండవపురం, మందపల్లి, పొన్నాల, కిష్టసాగర్ , నాంచార్పల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందన్నారు. మొదటిదశలో 7మండలాలు, రెండవ దశలో10 మండలాలు, మూడవదశలో 9 మండలాల్లోని గ్రామాల్లో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. మొదటి దశలో నామినేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయిందన్నారు. రెండవదశలో అక్బర్పేటభూంపల్లి, తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూరు, చిన్నకోడూరు, నారాయణరావుపేట. బెజ్జంకి మండలాల్లో ఈరోజు నుండి మూడు రోజుల పాటు నామినేషన్ స్వీకరించటం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు 58 క్లస్టర్లలో నామినేషన్ స్వీకరించనున్నట్లు తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్మార్గదర్శకాల ప్రకారం క్లస్టర్లో నామిని అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లస్టర్ చుట్టు 100 మీటర్ల పరిధిలోని నామిని అభ్యర్థితో పాటు ఇద్దరినే మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. పోలీసు అధికారులు భారీ బందోబస్తును నిర్వహించాలని సూచించారు.

## పదవీ విరమణ తరువాత సుఖంగా శేష జీవితం

టిఎన్జిఒ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తమ శేష జీవితాన్ని సుఖంగా గడపాలని టిఎన్జిఒ రాష్ట్ర అధ్యక్షులు, ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, పిఎన్జిఒ జిల్లా అధ్యక్షులు బొంకూరు శంకర్ అన్నారు. శనివారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా టిఎన్జిఒ కార్యదర్శి పిస్క సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం శనివారం రోజున ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పదవీ విరమ ణ కార్యక్రమంతో పాటు పిస్క పద్మజ సత్యనారాయణ గార్ల షష్ఠి పూర్తి మహోత్సవం కూడా టిఎన్జిఒ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో ఈవెంట్ వారు ఏర్పాటు చేసిన వాహనం ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పిఎన్జిఒ సంఘం అధ్యక్షులు, ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా టిఎన్జిఒ సంఘం అధ్యక్షులు, ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ బొంకూరి శంకర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఒక పదవీ విరమణ కార్యక్రమం ఇంత ఘనంగా జరగడం ఈ మధ్య చూడలేదని, పదవి విరమణతో పాటు షష్ఠి పూర్తి జరపడం కొత్త సంప్రదాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, మంచిర్యాల్ జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, కార్యదర్శి అమరేందర్ రెడ్డి, జిల్లా ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## చిన్న ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు నాంది

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం మొండయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ :**విద్యార్థులు పరిసరాలను నిశితంగా గమనిస్తూ కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం మొండయ్య పిలుపునిచ్చారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను కనుగొనే దిశగా ఆలోచించాలన్నారు. ఆవిష్కరణలు అనుకరణలా కాకుండా సృజనాత్మకతతో ఉండాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మేళాకు విశేష స్పందన లభిస్తోందని, ఆదివారం వివిధ పాఠశాలల నుంచి 2652 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. సోమవారం చివరి రోజు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్. భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, ఎంఇఒలు ఆనందం, ఏనుగు ప్రభాకర్రెడ్డి, కట్ట రవీంద్రాచారి, రామయ్య, గాజుల రవీందర్, స్తంభంకాడి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

సాధారణ ఎన్నికల పరిశీలకుడు వి.వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఎన్నికల నిబంధనల ప్రకారం అప్రమత్తంగా ఉంటూ విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకు లు వి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు కీలక ఘట్టమని, పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు పకడ్బందీగా జరగాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు కరపత్రాలు, వాల్ పోస్టర్లు, ప్రచార వాహనాలకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు.ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక ధ్రుఢత్వం లభిస్తుందనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ స్టేడియంలో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి జూనియర్ వాలీబాల్ చాంపియన్షిప్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడారు. మన ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. గతంలో విద్యార్థి దశలో ఉన్న సమయంలో కోర్టు లైన్ పోసే వాడినని అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహారాలు ఉంటాయని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డి పోటీలు జిల్లా పరిదిలో తన వంతు ప్రోత్సాహకం ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాలకు పెద్ద పీట వేస్తన్నరని అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు జీవితంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనే ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో మంత్రుల చేతుల మీదుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, గడ్డం నరసయ్య, తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి, కోశాధికారి కృష్ణ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యామ్, కార్యదర్శి అస్మీర రాందాస్ వివిధ జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఘనంగా మంత్రి వివేక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మాజీ సర్పంచ్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ ఎన్నం కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి వివేక్ పుట్టినరోజు పురస్కరించుకొని ఆదివారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీచక్ర సహిత లలిత మాత ఆలయంలో మంత్రి వివేక్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి నిత్యం పేదలకోసం పరితపించే నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో గంగా రాం, మహేష్, రమేష్, శంకర్, మల్లయ్య, తిరుపతి, వనిత, స్వప్న, రోజా, భాగ్య, అపర్ణ, మధు, తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జెడ్పి సిఇఒ



**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని రాంపూర్, రామన్నపేట, ముత్యంపేట, మల్యాల, తక్కలపల్లి, తాటిపల్లి 6 గ్రామ పంచాయతీ ఎన్నికల క్లస్టర్ నామినేషన్ ల స్వీకరణ కేంద్రాలను జగిత్యాల జిల్లా జెడ్పి సిఇఒ గౌతంరెడ్డి ఆదివారం పరిశీలించారు. సహాయ సిబ్బంది విధులు,అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకోని వారికి తగు సూచనలు తెలియజేశారు.ఆయన వెంట ఎంపిడిఒ స్వాతి,,ఆయా గ్రామాల కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అభ్యర్థులకు అన్ని విధాలా సహకరించండి : కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా మండల కేంద్రమైన మనోహరాబాద్ రైతు వేదికలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. కౌంటర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులకు సహకరించాలన్నారు. ఎస్ఐ సుభాష్ గౌడ్, ఎమ్మార్వో ఆంజనేయులు, ఎంపీఓ శ్రీనివాస్ఉన్నారు.

## నామినేషన్ల ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం / సిర్పూర్(టి) :** సిర్పూర్ (టి) మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జడ్పి సిఇఒ ఆదివారం పరిశీలించారు. స్థానిక క్లస్టర్ జిపి వద్ద నామినేషన్ల తీరును, ఏర్పాట్లను జడ్పి సూపరింటెండెంట్ తో కలిసి పర్యవేక్షించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. కాగా ఆదివారం తొలిరోజు మండలంలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. చిలపల్లి, వేంపల్లి సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్కటి, సిర్పూర్ టి వార్డు సభ్యునిగా ఒక నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడిఓ రహీముద్దీన్, ఎంపిఓ సత్యనారాయణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

### కుంటాలలో..



**ప్రజాపక్షం/కుంటాల :** రెండవ దశ పంచాయతీ నామినేషన్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది.మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ సందర్శించి సజావుగా,ప్రశాంతంగా కొనసాగాలని ఆర్ఓ,ఏఆర్ఓ లకు సూచించారు.మండలంలో సర్పంచ్ స్థానానికి 12 నామినేషన్లు,వార్డు సభ్యులు 8 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.తహసీల్దార్ కమల్ సింగ్,ఎంపీడీవో అల్లాడి వనజ,ఎంపీఓ రహీం,తదితరులు పాల్గొన్నారు.

### రామాయంపేటలో రెండవ విడత..



**ప్రజాపక్షం/రామాయంపేట:** రెండవ విడత నామినేషన్ల పర్వం ఆదివారం ప్రారంబమైంది. మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల కోసం నాలుగు కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. నామినేషన్ ప్రక్రియను ఆర్డీవో రమాదేవి, జెడ్పీ సీఈవో ఎల్లయ్యలు పరిశీలించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని వారు సూచించారు. మొదటిరోజు సర్పంచు స్థానాలకు 11, వార్డు సభ్యుల స్థానాలకు 14 నామినేషన్లు వచ్చాయని ఎంపీడీవో షాజిలోద్దిన్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సిఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజు అద్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

### 'నిజాంసాగర్'లో సర్పంచుకు 4 నామినేషన్లు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలో 14 గ్రామపంచాయతీలకుగాను ఇప్పటి వరకు 4 సర్పంచు అభ్యర్థులు, 6 గురు వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామాల వారీగా అచ్చంపేట్‌లో 3 సర్పంచుకు, గోర్గల్‌లో ఒకరు సర్పంచు పదవికి నామినేషన్ వేయగా గోర్గల్ గ్రామంలో 6 వార్డు సభ్యునికి నామినేషన్ వేసినట్లు అధికారులు వెల్లడించారు.

### దిలావర్‌పూర్‌లో 'సర్పంచ్ పదవికి' ఏడుగురు నామినేషన్లు



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు మండలంలోని వివిధ గ్రామాల నుండి ఆదివారం మొదటి రోజున మండలంలో సర్పంచ్ అభ్యర్థులు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ సమర్పించడం జరిగింది. వార్డ్ మెంబర్ అభ్యర్థులు 9 మంది అభ్యర్థులు నామినేషన్ వేయడం జరిగింది. సోమవారం అధిక నామినేషన్ వేయడానికి అభ్యర్థులు ముగ్గు చుప్తున్నారు.ఎన్నికల నామినేషన్ సెంటర్లను ఎంపీడీవో అరుణ రాణి పరిశీలించారు.

## 100మందికి ఉచిత వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలో అమృత ట్రూ లైఫ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో సుమారు వంద మందికి వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దగ్గు, దమ్ము, జ్వరం, జలుబు, అస్తమా, ఛాతిలో మంట, నొప్పి, దయాబెటిస్, బిపి, కీళ్ల నొప్పులు, తదితర వ్యాధులకు చికిత్సలు అందించి, మందులను పంపిణీ చేశారు. బోధన్ ప్రాంతీయ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బోధన్ అమృత ట్రూ లైఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తెలిపారు. డాక్టర్లు శవాలి, సుధాకర్, విగ్నేశ్వర్, సురేష్, ముస్తాక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**ప్రజాపక్షం/ఖానాపూర్‌రూరల్:** విద్యుత్ షాక్ కు గురై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.ఖానాపూర్ మండలం సురాపూర్ గ్రామానికి చెందిన వన్నెల వెంకట్రాములు (40) శనివారం రాత్రి మొక్కజొన్న పంట పొలానికి సాగునీరు పెట్టేందుకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి రాలేదు.అయ్యప్ప మాలలో ఉన్న వెంకట్రాములు ఆలయంలో,నిద్రిస్తున్నాడని కుటుంబికులు అనుకున్నారు.ఉదయం పంట పొలం వైపుగా వెళ్లిన పక్క పొలం వ్యక్తి వేముల శ్యామసుందర్ పంట పోలం వద్ద మృతుడి శవాన్ని చూసి కుటుంబికులకు సమాచారం అందించాడు.మృతుడి భార్య,ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## అభ్యర్థులకు అండగా ఉంటాం..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఎల్లవేళలా అండగా ఉంటామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్ అధ్యక్షతన చెంది ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్లి గులాబి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆమె అన్నారు.

# అభివృద్ధిలో 'అగ్రపథాన' హుస్నాబాద్

### తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతా
### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని హుస్నాబాద్‌ను అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతామని,హుస్నాబాద్‌ను ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతామని రవాణశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు అన్నారు. అదివారం అయన హు స్నాబాద్‌లో 3వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండు ఏళ్ల క్రితం నవంబర్ 30న ఎన్నిక పోలింగ్ జరిగింది. నేటికి రెండేళ్ల అయింది. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినందుకు ప్రజలందరికి ధన్యావాదాలు తెలిపారు. అధికారం చేపట్టిన నుండి ప్రజలకు చేసిన అభివృద్ధి పనులను వివరించేందుకే మీ ముందుకు వస్తున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కాలేజి, 250 పడకలు అసుపత్రి కొత్తపెల్లి టూ హుస్నాబాద్‌కు నాల్గు వరుసల రోడ్డు పనులకు, ఏటిసి సెంటర్, హుస్నాబాద్ టూ అక్కన్నపేట టూ జనగాం వర కు రోడ్డు విస్తరన పనులకు, గిరిజన గ్రామాలకు లింక్ రోడ్డల తో పాటు అనేక అభివృద్ది పనులకు శంకుస్థాపనలు చేస్తారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే హుస్నాబాద్ పట్టణంతో పాటు ఏడు మండలాల్లో అనేక అభివృద్ది పనులను చేసుకున్నామని తెలిపారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజికి రూ.33 కోట్లు మంజూరయ్యాయన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటికి రూ.20కోట్లు వచ్చాయని అభివృద్ధిపనులకు శంకుస్తాపన చేస్తామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు 70 మందికి సైకిళ్లు పంపిణీ, హుస్నాబాద్‌కు రింగ్ రోడ్డు, మా ర్కెట్ యార్డు అభివృద్ధి, ఎల్లమ్మచెరువు, పల్లె చెరువు,అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వంగరలో నవోదయ పాఠశాల, ఎల్కతుర్తిలో జంక్షన్ ఏర్పటు చేసేకున్నమని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకుని కాల్వల పనులచేసుకుని అతి త్వరలో హుస్నాబాద్ నియోజకవర్గంను సస్యశ్యామలం చేయడం నా బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి జిల్లాల నుండిఎమ్మెల్యేలు వివిధ హోదాల్లో ఉన్న చైర్మన్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సభను విజయవంతంచేయాలనిపిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ , కాంగ్రేస్ నాయకుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి , సహకార సంఘం చైర్మెన్ బి శివయ్య, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి, చిత్తారి రవిందర్, చితారి పద్మ, తదితరులు పాల్గోన్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే

### ఎన్నికల స్టేట్ అబ్జర్వర్ ఆయేషా



**ప్రజాపక్షం/సోన్ :** ఎన్నికల మార్గదర్శకాలను అనుగుణంగా నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల స్టేట్ అబ్జర్వర్ ఆయేషా అధికారులకు సూచించారు. ఆదివారం సోన్ మం డలం కడ్తాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ క్లస్టర్ కేంద్రాన్ని వారు సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ నామినేషన్ దాఖలు కొరకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట ఎంపీడీవో సురేష్, ఎంపీఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మ ణ్ ఇతర సిబ్బంది ఉన్నారు.

## పారదర్శకంగా నామినేషన్ ప్రక్రియ ఉండాలి



**ప్రజాపక్షం /కాగజ్‌నగర్ :** రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఆదివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పెంచికల్ పేట, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్అధికారులునామినేషన్ పత్రాల ధృవీకరణ, వివరాల నమోదు, రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని తెలిపారు. కేంద్రాల వద్ద అనవసర గుంపులు, ప్రచారాలు, బ్యానర్లు లేకుండా ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోలీసుల సహకారంతో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో 8500 844365 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు

### జిల్లా ఎస్పీజానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** నిర్మల్ జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో,స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భద్రతాచర్యలను సమీక్షిస్తూ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు,చెక్‌పోస్టుల కార్యకలాపాల పర్యవేక్షణ,సున్నితమైన ప్రాంతాల గుర్తింపు,రూట్ మొబైల్ వాహనాల మానిటరింగ్ వంటి కీలకఅంశాలపై వివరంగా చర్చించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోడానికిభద్రతాఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏవైనా అనుమానాస్పద కదిలికలు లేదా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన,ఇన్‌స్పెక్టర్లు,ఎస్ఐలున్నారు.

### నామినేషన్ కేంద్రాల వద్ద కూడా

**నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని నిర్మల్ రూరల్ మండలలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టాలని జానకి షర్మిల ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ స్వయంగా నిర్మల్ రూరల్ ప్రాంతాల్లోని చిట్యాల,వెంగ్వాపేట్ గ్రామపంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు,బందోబస్తు పరిస్థితులను పరిశీలించారు. నామినేషన్ వేసే సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, శాంతియుతమైన వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.నామినేషన్ ప్రక్రియ సందర్భంగా పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలన్నారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఏసి. బి ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఎస్ఐ లింబాద్రి పాల్గొన్నారు.

### వెల్దుర్తి – మెదక్ వెళ్లే రోడ్డు బాగు చేయకుంటే
# ఎన్నికలు బహిష్కరిస్తాం


### నాలుగు గ్రామాల ప్రజలు మహాధర్నా



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** వెల్దుర్తి మండల కేంద్రం నుండి మెదక్ జిల్లా కేంద్రం వరకు ఉన్న రోడ్డును బాగు చేయకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని వెల్దుర్తి మండలంలోని ముఖ్యమైన నాలుగు గ్రా మాల ప్రజలు రామయపల్లి, బండపోసంపల్లి, ఎదుల్లపల్లి, శెట్టిపల్లి, కలాన్ ప్రజలందరూ మూకుమ్మడిగా ఆదివారం రోజు ప్రధాన రహదారి మీద ధర్నా చేశారు. ఇటు మండల కేంద్రానికి అటు జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న ఈ గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంతకుముందు అధికారులకు పాలకులకు ప్రభుత్వలకు ఎన్నో వినతి పత్రాలు ఎన్ని పాదయాత్రలు చేసినా కనీస స్పందన రాలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు అంతా పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారి ఈ రోడ్డు గుండా ప్రయాణించిన నలుగురు వ్యక్తులు మరణించిన దాఖలాలు ఉన్నాయి. ఈ రోడ్డు దుస్థితి కారణంగా అటు స్కూల్ బస్సులు వెళ్లడం కూడా ఇబ్బందిగా మారి సరైన టైంలో వెల్దుర్తి మండల కేంద్రానికి వచ్చే స్కూల్ విద్యార్థులు అటు మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే కాలేజీ విద్యార్థులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమైందా మారి బస్సులు కూడా రావడం లేదు. అటు ప్రభుత్వ యంత్రాంగం మరియు అధికారులు వెంటనే స్పందించి తక్షణమే ఈ రహదారిని బాగు చేయాలని, ఈ రోడ్డును బాగుపరుస్తామంటేనే ఎన్నికల్లో పాల్గొంటామని నాలుగు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభం

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**ప్రజాపక్షం / నస్పూర్ :** విద్యార్థులు ఇష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభతరం అవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. ఆదివారంజిల్లాకేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల కళాశాల, సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న కోర్సులను ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రపంచంలో భారతదేశంలోనే నైపుణ్యాలతో కూడిన యువత అందుబాటులో ఉందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, సహాయ అభివృద్ధి అధికారి కె. ధర్మానంద్ గౌడ్, వసతి గృహ సంక్షేమ అధికారి డి. చందన, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జైతాపూర్‌లో ఘనంగా బోనాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం బోనాలు మరింత ప్రత్యేకంగా నిలిచాయి. గ్రామంలో కొలువైన ఎల్లమ్మ దేవి మందిరం ఐదేళ్ల వార్షికోత్సవం, మహాలక్ష్మి దేవి మందిరం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన గ్రామ దేవతాలయాలైన పోచమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, మహాలక్ష్మి దేవతలకు భక్తులు భక్తిపారవశ్యంతో బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

## నామినేషన్ల ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వొద్దు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదివారం తనిఖీ చేశారు. ఆమె ఈ సందర్భంగా అక్కడ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. ఈ 2వ విడుతలో సర్పంచు, వార్డు సభ్యులకు ఈనెల 14న ఎన్నికలు జరుగనున్నాయని, జుక్కల్ నియోజకవర్గంలోని మహ్మద్‌నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాల్లో సర్పంచు, వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈ నామినేషన్లు డిసెంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయని, మూడవ విడత డిసెంబర్ 3వ తేదీనా ప్రారంభమవుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఉండాలని అధికారులను ఆదేశించారు.

# నిబంధనల ఉచ్చులో పత్తి రైతులు



**కొనుగోళ్లలో సిసిఐ కొర్రీలు..**
**నిర్మల్, బైంసా, సారంగాపూర్, ఖానాపూర్ మార్కెట్లలో**
**దిగుబడి ఆంక్షలు,తేమ పేరుతో కోతలు..**

ప్రజాపక్షం/నిర్మల్

**పత్తి రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. అత్యంత శ్రమతో పండించిన తెల్ల బంగారాన్ని కొనుగోలు చేసే విషయంలో కాటన్ కార్పొరేసన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) విధిస్తున్న కఠిన నిబంధనలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు,సాంకేతిక సమస్యలు రైతులకు ఆశనిపాతంగా మారాయి.ఎకరా దిగుబడిపై ఆంక్షలు,తేమ శాతం పేరుతో కోతలు విధిస్తుండటంతో ప్రభుత్వ మద్దతు ధర(ఎంఎస్‌పి) రైతులకు అందడం లేదు.**

### దిగుబడిపై అంక్షలు,కఠిన కోతలు..

జిల్లాలో పత్తి దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ, సిసిఐ కొనుగోలు కేంద్రాలలో విధించిన ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి రైతులకు పెద్ద సమస్యగా మారింది. వాస్తవానికి,జిల్లాలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నా, సిసిఐ నిర్దేశించిన అసంబద్ధమైన పరిమాణంలోనే కొనుగోలు చేయడం జరుగుతోంది.దీనివల్ల అధికంగా పండిన మిగిలిన పత్తిని ఎక్కడ అమ్ముకోవాలనే గందరగోళం ఏర్పడి, రైతులు నష్టాన్ని భరించక తప్పడం లేదు. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాలలో తేమ శాతాన్ని కారణంగా చూపుతూ కఠిన కోతలు విధించ డం పరిపాటిగా మారింది. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, రాత్రిపూట మంచు కారణంగా పత్తిలో తేమ శాతం సహజంగానే పెరుగుతున్నా, ఈ విషయంలో అధికారులు ఎలాంటి సడలింపు ఇవ్వడం లేదు.ఒక్కో క్వింటాల్‌పై రూ.100 నుంచి 500 వరకు కోత విధిస్తుండటంతో మద్దతు ధర అందినట్టే అంది అందకుండా పోతోంది.

### విదేశీ విధానాల ప్రభావం, సాంకేతిక సమస్యలు

రైతులకు ఎదురవుతున్న సమస్యలకు కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలు ప్రధాన కారణమయ్యాయి. కేంద్రం పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం వల్ల దేశంలోకి చౌకగా విదేశీ పత్తి వరదలా వచ్చిపడింది.దీని కారణంగా దేశీయ పత్తికి డిమాండ్ పడిపోయి,ధరలు ఆశించిన స్థాయిలో లేవు,ఈ ప్రభావం వల్లనే సిసిఐ కొనుగోళ్ల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సి వస్తోంది. మరోవైపు పత్తి కొనుగోలు ప్రక్రియలో సిసిఐ తీసుకొచ్చిన 'కపాస్ కిసాన్ యాప్'నిబంధనలు గ్రామీణ రైతులకు పెనుభారంగా మారాయి.బైంసా,సారంగాపూర్ వంటి ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం,ఇంటర్నెట్ నెట్‌వర్క్ సమస్యలు, యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాల వరకు రాలేకపోతున్నారు.ఈ సాంకేతిక సమస్యల కారణంగా కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యం, సిసిఐ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### దళారులకు దారి చూపుతున్న అధికార యంత్రాంగం!

సిసిఐ విధిస్తున్న అసంబద్ధమైన దిగుబడి పరిమితి,కఠినమైన తేమ శాతం నిబంధనలు,కపాస్ కిసాన్ యాప్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం,జిల్లా అధికారులు,తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి,కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయాల్సిన అధికారులు,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన సమాధానం ఇవ్వకుండా, నిబంధనలను పదేపదే ప్రసావిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద వేధింపులకు తిరస్కరణకు గురైన రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో,తక్కువ ధరకు అమ్ముకోవడానికైనా సిద్ధమై ప్రైవేట్ వ్యాపారులనే ఆశ్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర (ఎంఎస్‌పి) రైతుకు లభించకుండా,రైతులు దోపిడీకి గురై దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడటానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా దారి చూపుతోందని పత్తి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తెల్ల బంగారం సాగు నుంచి పూర్తిగా వైదొలిగే ప్రమాదం ఉన్నందున,ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


# రీల్

## ఆకట్టుకునేలా 'మోగ్లీ'

### 'చిట్ చాట్'లో సందీప్ రాజ్



జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం 'మోగ్లీ'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ మీద ఈ మూవీని టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 12న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్ర దర్శకుడు సందీప్ రాజ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాకు ముందుగా నటన అంటేనే ఇష్టం. 'చాయ్ బిస్కెట్'లో ఉన్నప్పుడు కథలు కూడా రాసేవాడ్ని. అలా 'అతిథి' అనే షార్ట్ ఫిల్మ్ చేశాను. ఆ తరువాత దర్శకుడిగా నాకు అవకాశాలు స్టార్ట్ అయ్యాయి. అడ్వర్టైజ్‌లు కూడా ఇచ్చేందుకు రెడీ అయ్యారు. ఆ తరువాత మెల్లిమెల్లిగా కథలు రాయడం, డైరెక్షన్ మీద ఫోకస్ పెట్టాను. కానీ నాలోని యాక్టింగ్ కోరికల్ని ఇప్పుడిప్పుడే తీర్చుకుంటున్నాను. 'మోగ్లీ' ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటుంది. ఈ కథలో నేను మాత్రం నటించలేదు. ఐదేళ్ల గ్యాప్ తరువాత దర్శకుడిగా సినిమా చేస్తున్నాను. ఆ సమయంలో ఒక్క దగ్గర పెట్టుకుని మరింత జాగ్రత్తగా చేశాను. డెఫ్ అండ్ డంబ్ పాత్రను పోషించడం అంత సులభం కాదు. ప్రేమకు భాష అవసరం లేదు అని ఆ విషయాన్ని చెప్పేందుకు ఆ పాత్రను అలా డిజైన్ చేశాను. ఇందులో హీరో, హీరోయిన్ పాత్రలు చూసి అందరూ కనెక్ట్ అవుతారు. హీరో ఎంత అమాయకుడు అయితే అంత స్ట్రాంగ్‌గా కనిపిస్తాడు అన్నది నా అభిప్రాయం. మీకు ఇంత వరకు తెలిసిన మోగ్లీ కథలకు ఈ కథకు ఏలాంటి సంబంధం ఉండదు. ఫస్ట్ హాఫ్ అంతా చాలా ఫన్నీగా ఉంటుంది. ఆద్యంతం నవ్వించేలా సాగుతుంది. అందరినీ ఎంటర్టైన్ చేసేలానే మూవీని రూపొందించాను. నాకు విలన్ పాత్రలంటేనే చాలా ఇష్టం. నటుడిగా అయినా దర్శకుడిగా అయినా కూడా విలన్ పాత్రలపైనే ఎక్కువగా ఫోకస్ పెడతాను. ఈ చిత్రంలో బండి సరోజ్ గారి పాత్రను చూసి అంతా షాక్ అవుతారు. గత కొన్నేళ్లుగా తెలుగులో ఇలాంటి విలన్ పాత్రను మాత్రం కచ్చితంగా చూసి ఉండరు. 'సూర్యాస్తమయం'లో బండి సరోజ్ గారిని చూసి ఈ పాత్రకు సెట్ అవుతారని తీసుకున్నాను. ప్రజెంట్ ట్రెండ్‌కి మోగ్లీ అంటే ఎవరో తెలీదు. నాకు టైటిల్స్ పెట్టడం అంటే చాలా ఇష్టం. నా టైటిల్స్ అందరికీ అర్థం అవ్వాలని అనుకుంటా. అందుకే 'కలర్ ఫోటో' అని సింపుల్ టైటిల్ పెట్టాం. కానీ 'మోగ్లీ' మాత్రం ఇప్పటి తరానికి సరిగ్గా అర్థం కావడం లేదు. ఓ కథకు క్యాస్టింగ్ పర్ఫెక్ట్‌గా సెట్ అయితే సగం పని అయిపోయినట్లే. 'మోగ్లీ'లో అద్భుతమైన టీం సెట్ అయింది. డేట్స్ క్లాష్ అవ్వడం వల్ల ఈ సినిమాలో సంపూర్ణేశ్ బాబు ఓ పాత్రను చేయలేకపోయారు. కథ రాసుకున్న తరువాత రోషన్‌ను అనుకున్నాను. 'బబుల్‌గమ్'లో రోషన్ గెటప్, రా నెస్ ఇవన్నీ చూసి 'మోగ్లీ'కి సెట్ అవుతాడని ఫిక్స్ అయ్యాను. 21 ఏళ్లకే ఆ క్యారెక్టర్స్, యాక్టింగ్ ఏంటి? అని షాక్ అయ్యాను. రోషన్ తన పాత్రను అద్భుతంగా పోషించాడు. ఈ మూవీ కోసం రోషన్ శారీరకంగానూ చాలా కష్టపడ్డాడు. 'మోగ్లీ' అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది. యూత్, ఫ్యామిలీ, మాస్ అని ఇలా వేర్వేరుగా కాకుండా అందరినీ మెప్పిస్తుంది. ఇందులోని సందేశాన్ని మాత్రం ఇన్‌డైరెక్ట్‌గా రిలీజ్ చేయలేదు. మా సినిమాకు అదే పెద్ద ట్విస్ట్. చివర్లో అద్భుతమైన ఎక్స్‌పీరియెన్స్‌ని ఫీల్ అవుతారు. అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపిస్తాన్నే ఈ మూవీ ఎంగేజింగ్‌గా ఉంటుంది. చివరకు మాత్రం ఓ బలమైన ఫిలాసఫీని చూపిస్తాను. ప్రస్తుతం నటుడిగా రెండు ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. డిసెంబర్ 20 నుంచి నటుడిగా బిజీ అవుతాను. నాకు మాత్రం ఓ ఫాంటసీ కథను చేయాలని ఉంది. ఈ మూవీ రిలీజ్ తరవాత ఏ జానర్ కథను చేయాలా? అన్నది ఆలోచిస్తాను.



## 'అఖండ-2'కు యు/ఏ సర్టిఫికెట్

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న డివైన్ యాక్షన్ సినిమా 'అఖండ–2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. 'అఖండ 2: తాండవం' 2డీ, 3డీ రెండు ఫార్మాట్లలో డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు నుంచి యు/ఏ సర్టిఫికెట్ లభించింది. ఈ సినిమాలో బాలకృష్ణ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తోంది. మరో ముఖ్యమైన పాత్రను మురళి మోహన్ పోషిస్తుండగా, విలన్ పాత్రను తమిళ నటుడు ఆది పినిశెట్టి (దర్శకుడు రవి రాజా పినిశెట్టి తనయుడు) పోషిస్తున్నారు. థమన్ సంగీతం అందించిన ఈ సినిమాకు కాసర్ల శ్యామ్, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాశారు. రామ్ లక్ష్మణ్ ఫైట్స్ కంపోజ్ చేశారు.

## ఆయన ఎనర్జీ వేరే లెవల్

### – ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2'. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయబోతోన్నారు. ఈ సందర్భంగా నటుడు ఆది పినిశెట్టి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో నేను 'సరైనోడు' చిత్రంలో వైరం ధనుష్ అనే పాత్రను పోషించాను. అందులోని పాత్రకి 'అఖండ–2'లో నేను పోషించిన కారెక్టర్‌కు చాలా తేడా ఉంటుంది. నేను కథ వినకుండా ఓకే చేసిన మొదటి చిత్రం 'అఖండ–2'. బోయపాటి మీద నాకు చాలా నమ్మకం ఉంది. బాలయ్యకి ఎదురుగా అంటే సరిపోతానా? అని అడిగాను. పర్ఫెక్ట్‌గా ఉంటారు అని ఆయన అన్నారు. సెట్‌కి వెళ్లిన తరువాతే నాకు ఆ వాతావరణం, కథ తెలిసింది. ఇందులో నా పాత్ర మంత్రం తంత్రాల చుట్టూ తిరిగే పాత్ర. ఈ క్యారెక్టర్ కోసం ఇలానే ఉండాలి ఇలానే కనిపించాలి ఇలానే ప్రవర్తించాలి అని ఆయన ముందే చెప్పారు. చాలా లుక్ టెస్ట్‌ల తరువాత ఫైనల్‌గా ఇప్పుడు సినిమాలో మీరు చూస్తున్న లుక్ ఫైనల్ అయింది. బాలయ్య గురించి బయట చాలా వింటుంటాం. కానీ సెట్‌లో ఆయన ఎనర్జీ వేరేలా ఉంటుంది. ఆయన ఉంటే సెట్లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. మా నాన్నతో చేసిన సినిమాల అనుభవం కూడా నాతో పంచుకున్నారు. 'అఖండ' కంటే 'అఖండ తాండవం'లో హై మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, తమన్ మ్యూజిక్, ఎలివేషన్స్ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది. వావ్ అనిపించేలా, ఆశ్చర్యపోయేలా ఎన్నో అంశాల్ని చూపించబోతోన్నారు. అదే 'అఖండ–2' ప్లస్ పాయింట్. 'అఖండ తాండవం'లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. మరీ ముఖ్యంగా రెండు మేజర్ సీక్వెన్స్‌లు ఉంటాయి. ఓ సీక్వెన్స్‌ను ఎండాకాలంలో 15 రోజుల పాటు నిర్విరామంగా షూటింగ్ చేశాం. మధ్యాహ్నం వరకు చాలా మంది ఎండదెబ్బకు పడిపోయారు. కానీ బాలయ్య మాత్రం ఆ ఎండలోనే అలా నిల్చుండేవారు. కనీసం గొడుగు కూడా పట్టుకుని ఉండేవారు కాదు. సినిమా పట్ల ఆయనకు ఉండే ప్రేమ, పిచ్చి నాకు అప్పుడు అర్థమైంది. 14 రీల్స్ మాత్రం ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఈ మూవీని గొప్పగా నిర్మించింది. ఎవ్వరికీ ఎప్పుడు కూడా పేమెంట్స్ విషయంలో ఆలస్యం చేయలేదు. 'థండర్' అనే స్పోర్ట్స్ డ్రామాని తమిళ, తెలుగు భాషల్లో చేస్తున్నాను. 'మరకతమణి' సీక్వెల్ చేస్తున్నాను. కార్తీతో కలిసి 'మార్షల్' మూవీని కూడా చేస్తున్నాను.

## 'సకుటుంబానాం' ట్రైలర్ రిలీజ్



హెచ్ఎన్‌జి సినిమాస్, ఎల్ఎల్‌పి బ్యానర్‌పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సకుటుంబానాం. రామ్ చరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్‌గా శశాంక్ మలి చేశారు. దర్శకుడు బుచ్చిబాబు సనా చేతుల మీదగా సకుటుంబానాం చిత్ర ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు సనా మాట్లాడుతూ ఉదయ్ ఒక కథగా మార్చి ఆ కథను సినిమాగా చేస్తున్నాను అని చెప్పినప్పుడు నేను చాలా సంతోషించాను. ఈ సినిమా సుకుమార్ ఐడియాలో ఉండబోతుంది. సకుటుంబానాం చిత్రం మంచి విజయం సాధించాలని నటీనటులకు, నిర్మాతకు, సాంకేతిక బృందానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... 'సభా సరస్వతికి, నా తెలుగు ప్రేక్షకులకు నమస్కారం. బ్రహ్మానందం మరొకసారి కలిసిన నటించడం, మధు పనిచేసిన వారంతా ఉన్నత స్థాయిలకు అడగడం, వారిని ఈ స్టేజిపై చూడటం నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఒక నటుడు ఎంతో కాలం పాటు చిత్ర పరిశ్రమలో కనిపిస్తూ ఉండటం అనేది ఎంతో ప్రత్యేకమైన విషయం. ఒక నటుడు అలా కనిపించాలి అంటే తాము వేసే పాత్ర ప్రేక్షకులను అంతగా మెప్పించాలి. వివిధ ప్రాంతీయ భాష యాసాలను సినిమాలలో మాట్లాడుతూ ప్రతి ప్రాంతం వారికి దగ్గర వాడిని అయ్యాను. ఒక కొత్త పాత్రతో మా దగ్గరకు కథ వచ్చిన ప్రతిసారి ఆశ్చర్యపోతూ ఉంటాము అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మహదేవ్ గౌడ్, దర్శకుడు ఉదయ్ శర్మ , హీరో రామ్ కిరణ్ పాల్గొన్నారు.

## 'ఐయామ్ గేమ్' ఫస్ట్ లుక్



కాంతతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న దుల్కర్ సల్మాన్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఐయామ్ గేమ్' మూవీతో అలరించబోతున్నారు. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిధాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్ డ్రాప్‌లో స్టైలిష్ షూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో మిస్కిన్, ఆంటోనీ వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. అన్బరీవ్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

## చిరంజీవి, వెంకటేష్‌లపై పాట చిత్రీకరణ



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో వెంకటేష్ ఓ కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఫ్యాన్స్‌ని విశేషంగా అలరించనుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో చిరంజీవి, వెంకటేష్‌లపై పాట చిత్రీకరణ ప్రారంభించారు. తొలిసారిగా, చిరంజీవి, వెంకటేష్ ఒక ఉత్సాహభరితమైన, గ్రాండ్ సెలబ్రేషన్‌లో కలిసి అలరిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో అద్భుతమైన బీట్స్‌తో కంపోజ్ చేశారు. ఈ పాటలో 500 మందికి పైగా డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. ఈ పాటలో సెట్‌ని కలర్, రిథమ్, వైబ్‌ల కార్నివాల్‌గా మార్చారు. ఇద్దరు స్టార్ల కెమిస్ట్రీ, ఎనర్జీ ప్రేక్షకులని అభిమానులను ఫుల్‌గా ఎంటర్టైన్ చేయనుంది.

## 'బెల్లా బెల్లా' పాట ఆవిష్కరణ

రవితేజ హీరోగా, ఆషిక రంగనాథ్, డింపుల్ హయత్ హీరోయిన్లుగా తెరకెక్కుతున్న సినిమా భర్తమహాశయులకు విజ్ఞప్తి. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమాను దర్శకుడు కిషోర్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'బెల్లా బెల్లా' అనే పాటను విడుదల చేయనున్నారు. రాజమండ్రిలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఈ ఈవెంట్ జరుగబోతోంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. బెల్లా బెల్లా అనే పాటను అజీజ్ నకాష్, రోహిణి సొరట్ ఆలపించారు. సూరి ఈపాటకు సాహిత్యం అందించారు. రవితేజతో భీమ్స్ చేస్తున్న మూడవ సినిమా ఇది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సుధాకర్ తెలిపారు. ఎల్ఎస్‌వీసి సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# అత్యధిక నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు తొలిదశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్‌ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు ఆదివారం వెల్లడించారు. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్‌ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ నామినేషన్‌లు సమర్పించారు. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్‌లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్‌ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. నామినేషన్‌లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్‌ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తుది గడువుగా నిర్ణయించారు. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

### సూర్యాపేటలో అత్యధిక నామినేషన్‌లు..

అత్యధికంగా సూర్యాపేటలో 1,387 నామినేషన్‌లు దాఖలయ్యాయి. తొలి దశలో మొత్తం 159 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనుండగా చివరి రోజే 1,021 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత అత్యధిక నామినేషన్లు దాఖలైన రెండో జిల్లాగా వికారాబాద్ నిలిచింది. ఈ జిల్లాల్లో 262 గ్రామ పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనుండగా 1,383అభ్యర్థులో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మహబూబాబాద్‌లో 155 గ్రామపంచాయతీలకు గాను 1,239, కామారెడ్డి జిల్లాలో 167 గ్రామాపంచాయతీలకు గాను 1,224 నామినేషన్‌లు దాఖలయ్యాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో 48 గ్రామపంచాయతీలకు గాను 220 నామినేషన్‌లు మాత్రమే దాఖలయ్యాయి.

### వార్డులో రంగారెడ్డి టాప్..

తొలిదశలో మొత్తం 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇందుకు గాను అత్యధిక నామినేషన్లు రంగారెడ్డి జిల్లాలో దాఖలయ్యాయి. ఈ జిల్లాలో 1,530 వార్డులకు గాను 4,540 నామినేషన్‌లు వచ్చాయి. ఆ తర్వాత వికారాబాద్, ఖమ్మం, కామారెడ్డి, సూర్యాపేటలో అత్యధికంగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఇక అత్యల్పంగా ములుగులో 420 వార్డు స్థానాలకు గాను 967 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.

### మొదలైన రెండవ విడుత నామినేషన్ల ప్రక్రియ..

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రెండవ విడుత నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభమైంది. తెలంగాణ వ్యాప్తంగా 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు నోటిఫికేషన్ వెలువడింది. అనంతరం వెంటనే నామినేషన్‌ల దాఖలు ప్రక్రియను ప్రారంభించారు. డిసెంబర్ 2 వరకు నామినేషన్‌లు స్వీకరిస్తారు, 3న పరిశీలన, 6న నామినేషన్‌ల ఉపసంహకరణ, అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తారు. 14న పోలింగ్, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

# 37 మంది నక్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

పునరేకీకరణ వరకు) చొరవలో భాగంగా 12 మంది మహిళలు సహా ఈ కేడర్లు సీనియర్ పోలీసు, సిఆర్‌పిఎఫ్ అధికారుల ముందు లొంగిపోయారని దంతేవాడ పోలీసు సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ తెలిపారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన ఈ చొరవ, బస్తర్ ప్రాంతంలో శాశ్వత శాంతి, గౌరవం, సమగ్ర పురోగతిని నెలకొల్పడానికి ఒక పరివర్తనాత్మక డ్రైవ్‌గా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. లొంగిపోయిన వారిలో కీలక కార్యకర్తలైన కుమాలి అలియాస్ అనితా మాండవి, గీతా అలియాస్ లక్ష్మి మడ్కం, రంజన్ అలియాస్ సోమా మాండవి, భీమా అలియాస్ జహాజ్ కల్ము ఉన్నారు. వారందరికీ ఒక్కొక్కరికి రూ.8 లక్షల రివార్డు ఉందని అధికారి తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ, వ్యవసాయ భూమి మొదలైన ఇతర సౌకర్యాలు అందించబడతాయని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లొంగుబాటు, పునరావాస విధానాల నుండి ప్రేరణ పొంది, గత 20 నెలల్లో దంతేవాడ జిల్లాలో 165 మందిపై రివార్డు కలిగిన వారితో సహా 508 మందికి పైగా మావోయిస్టులు హింసను విడిచిపెట్టి సామాజిక ప్రధాన స్రవంతిలో చేరారని అధికారి తెలిపారు. సీనియర్ నాయకుల నుండి వారి స్థావర ప్రాంతాలలో చురుకైన కార్యకర్తల వరకు పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నిషేధిత సంస్థను విడిచిపెట్టారని రాయ్ చెప్పారు. గత 23 నెలల్లో, ఛత్తీస్‌గఢ్‌లో అగ్రశ్రేణి కార్యకర్తలతో సహా 2,200 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని పోలీసులు తెలిపారు.

# మహారాష్ట్రలో స్థానిక సంస్థలకు రేపు మొదటి దశ పోలింగ్

**ముంబై:** మహారాష్ట్రలో స్థానిక సంస్థలకు కీలకమైన మొదటి విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం (డిసెంబరు 2) 246 పురపాలక మండళ్ళకు, 42 నగర పంచాయతీలకు పోలింగ్ జరుగుతుంది. 1.07 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో 288 మంది అధ్యక్షులు, 6,859 మంది సభ్యుల భవిష్యత్తును నిర్ణయిస్తారు. ఈ ఎన్నికల నిమిత్తం 13,355 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మొత్తం సీట్లలో 3,492 స్థానాలను మహిళలకు రిజర్వు చేశారు. వీటిల్లో 895 స్థానాలు షెడ్యూల్డు కులాలకు, 338 స్థానాలు షెడ్యూల్డు తెగలకు, 1,821 స్థానాలు ఇతర వెనుకబడిన తరగతులకు కేటాయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అపరిష్కృతంగా ఉన్న స్థానిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను వచ్చే ఏడాది జనవరి 31 లోపు అంటే రెండు నెలల వ్యవధిలో పూర్తిచేయాల్సి ఉంది. అదేవిధంగా 29 నగర పాలక సంస్థలకు, 32 జిల్లా పరిషత్‌లకు, మరో 336 పంచాయతీ సమితులకు ఎన్నికల షెడ్యూలును ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించాల్సి ఉంది. కీలకమైన బృహన్ముంబై నగరపాలక సంస్థ ఎన్నికలు ఇంతకు ముందు 2017లో జరిగాయి. ఇప్పుడు మళ్ళీ వచ్చే జనవరి రెండోవారం తర్వాత జరుగుతాయని అంచనావేస్తున్నారు. కాగా గత ఏడాది నవంబరు నెలలో బిజెపి నాయకత్వానగల మహాయుతి కూటమి ఘన విజయం సాధించినందువల్ల మంగళవారం జరిగే పోలింగ్ ప్రక్రియను అధికార కూటమికి ప్రాముఖ్యత పొందిన రాజకీయ భావోద్వేగ సూచనగా పరిగణిస్తున్నారు. 2024 నవంబరులో మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మొత్తం 288 స్థానాలకుగాను 235 స్థానాలను బిజెపి కూటమి గెలుచుకుంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల విజయం ఉరవడితో గ్రామీణ ప్రాంత పరిపాలనావ్యవస్థ పగ్గాలు కూడా అధికారపార్టీ చేతికే వస్తాయా? లేక ఏకీకృతమైన బలపడిన ప్రతిపక్షాలు అధికార కూటమి ఆధిపత్యాన్ని ఈ మున్సిపల్‌స్థాయి ఎన్నికల్లో సవాలు చేస్తాయా? అనే విషయం ఫలితాల్లో తెలుస్తుందని రాజకీయ పరిశీలకులు అన్నారు. రాజకీయపార్టీల ప్రచార సమయాన్ని సోమవారం ఉదయం 10 గంటల వరకూ పొడిగించారు. రెండో తేదీ పోలింగ్ తర్వాత మరునాడే బుధవారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ దినేశ్ వాఘమేర్ పోలింగ్ షెడ్యూలు ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. అభ్యర్థులకు అంటే అధ్యక్ష పదవికి పోటీ చేసేవారికి రూ.15 లక్షలు, సభ్యులుగా పోటీ చేసేవారికి రూ.12 లక్షలకు ఎన్నికల ఖర్చును పరిమితం చేశారు. మొత్తం 66 వేల మంది సిబ్బంది ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారు. అన్ని ప్రాంతాలకు ఓటింగ్ యంత్రాలను తరలించారు.




# గాడి తప్పిన పాలన

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులను కూడా డిప్యూటేషన్లపై వచ్చిన వైద్యులకే అప్పగించారు. ఇక వివిధ విభాగాల్లో కీలకమైన పోస్టుల్లో రిటైరైన వారిని తాత్కాలిక ప్రాతిపాదికన నియమించారు.

### పరీక్షలు, ఫలితాల్లో దారుణం

ఇక వైద్య విద్య పరీక్షల నిర్వహణలో కాళోజీ వర్సిటీ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జనవరి 15న నిర్వహించిన రేడియాలజీ పీజీ పరీక్షలో గత ఏడాది ఇచ్చిన ప్రశ్నపత్రాన్నే మళ్లీ ఇచ్చారు. అక్టోబరు 13న జరిగిన పీజీ ఫోరెన్సిక్ పరీక్షలో 10 ప్రశ్నలకు బదులు 11ప్రశ్నలు ఇచ్చారు. ఇక గతేడాది పీజీ పరీక్షలను కౌన్సెలింగ్‌ను సిబ్బంది కొరత సాకుతో పలుమార్లు వాయిదా వేశారు. నవంబరు 5న వరంగల్ నగ రానికి చెందిన ఓ విద్యార్థినికి తొలుత ఖమ్మంలోని మమత డెంటల్ కాలేజీలో సీటు వచ్చినట్టు వర్సిటీ అధికారులు మెసేజ్ పంపించారు. కానీ మరుసటి రోజే మార్చేశారు. మొదటి జాబితాలో తప్పులు దొర్లాయని.. నిజామాబాద్ మేఘనా డెంటల్ కాలేజీలో ఆమెకు సీటు వచ్చి నట్టు చెప్పారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు కాలేజీ వైద్య విద్యార్థులు ఫెయిలైనా.. రీకౌంటింగ్లో పాస్ చేయటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించటంతో ఎగ్జామినేషన్ గదికి తాళం వేశారు.

### వర్సిటీ వీసీ రాజీనామాతో సంబురాలు

ఉపకులపతిగా డాక్టర్ నందకుమార్ రెడ్డి రాజీనామా చేశారన్న వార్తతో కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం సంబురాలు చేసుకున్నారు. యూనివర్శిటీ ప్రధాన గేటు వద్ద సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి.. పెద్ద ఎత్తున బాణా కాల్చారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పి.ప్రభాకర్ మాట్లాడుతూ.. వీసీగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం తనను హైదరాబాద్‌కు రావాలని ఒత్తిడి చేశారని, తక్కువ వేతనాలకు పని చేస్తున్నామని, తన తండ్రి ఆరోగ్యం బాగా లేదని తెలిసినా బలవంతంగా హైదరాబాద్ తీసుకెళ్లారని అన్నారు. గడిచిన 3 నెలల్లో 24 గంటలు ఇతర పనులు చేయించుకు న్నారని, తన ఆరోగ్యం సహకరించడం లేదని చెప్ప డంతో ఉద్యోగం నుంచి తొలగించారని చెప్పారు.

# సేవలు ఏకరువు

(మొదటి పేజీ తరువాయి)



ముందుకు వచ్చిన వారిని నిలదీసే పనిలో కొందరు ఓటర్లు ఉన్నారు. ఏఏ సందర్భాల్లో ఆయా పార్టీలు లేదా వ్యక్తులు తమ పట్ల వివక్ష ప్రదర్శించిందన్న విషయాలను అభ్యర్థుల దృష్టికి తీసుకు వస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం విస్మరించిన వారిని గట్టిగానే నిలదీస్తున్నారు. మొత్తంగా మొదట్లోనే సర్పంచ్ ఎన్నికల్లో ప్రచార పదనిసలు చోటు చేసుకుంటున్నాయి. తొలి దశకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాటు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఆదివారంతో పూర్తయింది. ఇప్పుడు ఇక ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం ప్రారంభమైంది. నీకు నాకు అన్న ధోరణిలో రాజకీయ పార్టీల మధ్య ఒప్పందాలు కుదురుతున్నాయి. ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఒడంబడికలు చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీలు రాజకీయ పార్టీల మధ్య ఒప్పందాలతో ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యే నాటికి మరికొన్ని గ్రామ పంచాయతీలు కూడా ఏకగ్రీవమయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. చింతకాని మండలం రాఘవాపురం గ్రామపంచాయతీని సిపిఐ కైవసం చేసుకుంది. సిపిఐకి చెందిన కాంపల్లి కోటమ్మ ఒక్కరే సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇక్కడ ఒక వార్డు మినహా మిగిలిన వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సైతం సిపిఐకి చెందిన రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఇదే మండలంలోని రేపల్లేవాడ గ్రామ పంచాయతీ బోనకల్ మండలంలోని కలకోట, మధిర మండలంలోని సిద్దినేనిగూడెం, వైరా మండలంలోని పుణ్యపురం, రఘునాథపాలెం మండలంలోని మంగ్యాతండా ఏకగ్రీవమయ్యాయి. పరిశీలన ప్రక్రియ తర్వా త ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామ పంచాయతీ సైతం ఏకగ్రీవమైంది.

**ఖర్చు పెట్టాల్సిందే :**

ఎన్నికలంటేనే ఇప్పుడు ఖర్చుతో కూడుకున్న ప్రక్రియగా మారిపోయింది. అది ఎంఎల్‌ఎ అయినా, గ్రామ పంచాయతీ అయినా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమంటే డబ్బులు పంపిణీ చేయడమేనన్న భావన ఏర్పడింది. మైనర్ పంచాయతీల దగ్గర నుంచి మేజర్ పంచాయతీల వరకు డబ్బును ధారాళంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఐదారు వందల ఓట్లు ఉన్న గ్రామ పంచాయతీల్లో సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. రాజకీయ పార్టీలు సైతం అర్థబలం, అంగబలం కలిగిన అభ్యర్థులనే రంగంలోకి దింపుతున్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు మద్దతుదారులు ఎంత ఖర్చు చేయగలవో అంత మొత్తం తమ ముందు జమ చేయాలంటూ షరతు విధిస్తున్నాయి. మొత్తంగా గ్రామ పంచాయతీల్లో రాజకీయ ప్రభావం కంటే స్థానికత దానితో పాటు ఖర్చు చేయగలిగిన స్థోమతే ప్రధాన అంశాలుగా మారాయి. నిజాయితీపరుడు, సేవాభావం కలిగిన వారు డబ్బు లేకపోతే బరిలో నిలిచే పరిస్థితి లేదు. వేలం పాటల్లో దక్కించుకునేందుకు సైతం పోటీపడుతుండటం గమనార్హం.

# ఆ హక్కు ట్రంపునకు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గడచిన రెండు నెలలుగా డ్రగ్స్ మాఫియాల నియంత్రణ పేరుతో వెనిజులా దేశాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రంప్ కయ్యానికి కాలు దువ్వుతూ ఉండటంతో కరీబియన్ జలాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. తనను పదవీచ్యుతుణ్ణి చేసేందుకే ట్రంప్ డ్రగ్స్ మాఫియా పేరుతో కుట్రలకు పాల్పడుతున్నారని, సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలకు పూనుకున్నారని మదురో విమర్శించారు. వెనిజులా ప్రజలపైన, సార్వభౌమత్వం పైన ట్రంప్ చేస్తున్న అన్యాయపూరితమైన, దురాక్రమణ చర్యగా వెనిజులా విదేశీ మంత్రిత్వశాఖ విమర్శించింది. వెనిజులా డ్రగ్స్ మాఫియా ముఠాలను పెంచి పోషిస్తోందని ట్రంప్ కొద్దికాలంగా ఆరోపణలు చేస్తున్నారు. కరీబియన్ జల్లాలో గడచిన 60 రోజులుగా పెంటగాన్ రక్షణ దళాలు 21 పడవలపై దాడులు చేసి 80 మందిని హతమార్చింది. మదురో నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని ట్రంప్ బాహాటంగా ప్రకటనలు చేస్తూ కరీబియన్ జలాల్లో శక్తిమంతమైన అమెరికా విమానవాహక యుద్ధ నౌకలను మోహరించారు. మొదటినుండీ మదురో సామ దాన భేద దండోపాయ మార్గాలలో మాట్లాడుతూ వచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వెనిజులాలో డ్రగ్స్ ముఠాలను అదుపు చేశామని, అనేకమందిని అరెస్టు చేశామని ట్రంప్‌కు చెప్పారు. ఆ తర్వాత డోసు పెంచి అమెరికా గనుక యుద్ధం కోరుకుంటే తాము కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరిక చేశారు. తమ దేశాన్ని సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడానికి, అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణను అడ్డుకోవడానికి ప్రతి వెనిజులా పౌరుడూ యుద్ధ శిక్షణ తీసుకుంటాడని కూడా ప్రకటించారు. ఒకదశలో మధ్యేమార్గంగా ట్రంప్‌తో చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని మదురో పరతిపాదన చేశారు. ఐనప్పటికీ ట్రంప్ మొండి వైఖరి అనుసరించి రెచ్చగొట్టే ప్రకటకలను కొనసాగిస్తూ వస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com